www.visalaandhra.com VISALAANDHRA Regd No.VJ/042/2015-17 పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం వెల: రూ.4.00

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
38 Securing Your Future
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం
sricharanamedia.com

SUNDAY
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 66, సంచిక : 238
ఆదివారం 18-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ



వణికిస్తున్న

వాయు కాలుష్యం

- ఏటా 15 లక్షల మంది మరణం
- ఏపీలోనూ ఇదే పరిస్థితి
- చర్యలు తీసుకోకుంటే ఉక్కిరి బిక్కిరే....

దేశనాగరికతకు రవాణా సౌకర్యాలే కొలమానాలు. ఒకప్పుడు పర్యావరణసహితమైన ఎడ్లబళ్లు, గుర్రాలు, ఒంటెలుతో మొదలైన రవాణా సైకిలు, మోటారు సైకిళ్లు, కార్లుగా రూపాంతరం చెందాయి. రవాణాపేరుతో సహజవనరులు తగ్గిపోవడం, వాయుకాలుష్యం పెరిగిపోవడం మానవాళికి పెనుముప్పుగా పరిణమించింది.

7 లో



పరీక్షల సమయం

సెల్‌తో చేటు

- మనదేశంలో స్టేటస్ సింబల్ భావన
- 8వ తరగతి నుంచే వ్యసనం
- ఏకాగ్రత లోపించి డాక్టర్ల వద్దకు
- తల్లిదండ్రుల బాధ్యతే ఎక్కువ

7 లో

మానవ వనరులను రక్షించుకుందాం



- జీడీపీ పెరుగుదలకు అవే కీలకం
- విద్యార్థి, యువత రక్షణకు ప్రభుత్వ చర్యలు అవశ్యం
- మనుషులు ఓటు వేసే యంత్రాలు కాదని గుర్తించాలి

సామాజిక అభివృద్ధికి మానవ వనరులే కీలకం. మానవ వనరులు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. వాటిని సరైన, సమర్ధవంతమైన పద్ధతిలో వినియోగించడంలో జపాన్ అగ్రస్థానంలో ఉంది.

Sunday Special

7 లో

విభజన హామీల సాధన కోసం

కేంద్రంపై పోరాటమే

- హోదా పేరుతో కొందరు రాజకీయం
- రాష్ట్రాభివృద్ధిపై రాజీపడను
- సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-నరసరావుపేట : హేతుబద్ధత లేకుండా ఓ పార్టీ రాష్ట్రాన్ని విభజిస్తే... విభజన హామీలను అమలు చేయకుండా మరోపార్టీ ఇబ్బంది పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాంగ్రెస్, బీజేపీలపై పరోక్ష విమర్శలు చేశారు. గుంటూరు జిల్లా నరసరావుపేట పట్టణ పరిధిలోని పెట్లూరివారిపాలెం గ్రామ సమీపంలో రూ.80 కోట్ల వ్యయంతో చేపడుతున్న జేఎన్‌టీయూకే ఇంజనీరింగ్ కాలేజ్ భవన నిర్మాణాలకు చంద్రబాబు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం హేతుబద్ధత లేకుండా ఏకపక్షంగా రాష్ట్రాన్ని విభజించి ఐదు కోట్ల ఆంధ్రులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రానికి సాయం చేయాలని మూడేళ్లు కేంద్రం చుట్టూ తిరుగుతున్నానని, ఇప్పటికి 29సార్లు ఢిల్లీ వెళ్లానని అన్నారు. అయినా నరేంద్రమోడీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలు నెరవేర్చకపోతే ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోకెల్లా ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందన్నారు. విభజన హామీలను

- మిగతా 2 లో

ఉద్యోగాలు ఒట్టి కల్పనలే !

- పెట్టుబడులు 40 కాదు.. 15 శాతమే...!
- ఉద్యోగాలూ పది శాతమే
- 24న విశాఖలో మరో సదస్సు
- 553 కంపెనీల్లోనే ఉత్పత్తి ప్రారంభం
- భూమి కోసం 241 కంపెనీల ఎదురుచూపు
- డీపీఆర్ సమర్పించని సంస్థలు 563



విశాలాంధ్రబ్యూరో - అమరావతి భారీగా పెట్టుబడులను ఆకర్షించి...రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేయటం ద్వారా యువతకు లక్షలాది ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు ఆచరణలో కార్యరూపం దాల్చటం లేదు. రాష్ట్రానికి 40 శాతం పెట్టుబడులు వచ్చినట్లు ప్రభుత్వం లెక్కలు చూపిస్తుండగా, వాస్తవానికి అది 15 శాతం మించలేదు. విశాఖపట్నం కేంద్రంగా చంద్రబాబు ప్రభుత్వం రెండుసార్లు భాగస్వామ్య సదస్సులు నిర్వహించింది. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సహకారంతో రెండు విడతల్లో జరిగిన సదస్సుల్లో 1,946 దేశ, విదేశీ ప్రముఖ సంస్థలు రూ.14.21 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చి...ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. ఆయా సంస్థలలో 33.06 లక్షల మందికి ఉద్యోగవకాశాలు కలుగుతాయని సాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రకటించారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఆయా సంస్థలలో 18 శాతానికి మించి ఉద్యోగవకాశాలు లభించలేదు. 2016, 2017లో విశాఖ కేంద్రంగా భాగస్వామ్య సదస్సులు నిర్వహించగా, ఈ నెలలోనే మూడో సదస్సు నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. మూడున్నర సంవత్సరాలలో 1,946 సంస్థలు రాష్ట్రంలో రూ.14.21 లక్షల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ప్రభుత్వంతో పలు సంస్థలు కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం కొన్ని సంస్థలు ఉత్పత్తులను ప్రారంభించగా, మరికొన్ని ట్రైల్ దశలో, మిగిలినవి మెషినరీ ఏర్పాటు, సివిల్ పనుల దశలోనూ ఉన్నాయి. సంస్థల నిర్మాణ పనుల ప్రారంభం నుంచి పని చేసేవారిని కూడా పరిగణనలోకి తీసుకుని ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లుగా గణాంకాలు చూపించటం గమనార్హం. వీటిలో విశాఖలో

- మిగతా 2 లో

హోదాపై రౌండ్‌టేబుల్ సమావేశం నేడు

- విజయవాడలో ఉదయం 10.30 గంటలకు
- వేదిక ఐవీ ప్యాలెస్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని ఐవీ ప్యాలెస్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరగనుంది.

ఈ సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంతోపాటు విభజన హామీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి గురించి సమావేశంలో చర్చించనున్నారు. సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సమితి కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి, వైసీపీ రాష్ట్ర నాయకుడు కె పార్ధసారధితోపాటు పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొననున్నారు.

పీఎన్‌బీ కుంభకోణం కేసులో

ముగ్గురి అరెస్టు

- ఇద్దరు బ్యాంకు అధికారులు
- ఒకరు నీరవ్ కంపెనీ ఉద్యోగి

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) భారీ కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన బ్యాంకు అధికారులను సీబీఐ అదుపులోకి తీసుకుంది. పీఎన్‌బీ నుంచి రూ. 11,400 కోట్ల విలువైన లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎల్‌ఓయూ) జారీ చేయడంలో అక్రమాలకు పాల్పడడంలో సంబంధం ఉన్నదని సీబీఐ శనివారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసింది. అరెస్టు అయిన వారిలో ప్రధాన సూత్రదారుడు, ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీకి సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి పీఎన్‌బీ డిప్యూటీ మేనేజర్ గోకుల్ నాథ్ శెట్టి, పీఎన్‌బీ ఎస్‌డబ్ల్యూఓ మనోజ్ కరత్, నీరవ్ మోడీ గ్రూప్

- మిగతా 2 లో

హోదా అంటూ మభ్యపెట్టారు

ఎంపీలు సరిగా పని చేయలేదు

- నేతల తప్పిదాలు ప్రజలకు శాపం కారాదు
- చిత్తశుద్ధి ఉంటే ఏదైనా చేయొచ్చు
- జనసేన అధినేత పవన్ కల్యాణ్



సమావేశంలో మాట్లాడుతున్న పవన్ , ఉండవల్లి తదితరులు

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : రాజకీయ నాయకులు తమ వ్యక్తి ప్రయోజనాలు, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే తప్పిదాలు ప్రజల పాలిట శాపంగా మారకూడదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. దురదృష్టవశాత్తు నేడు అదే జరుగుతుందని, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో ప్రధాన రాజకీయ పక్షాలు విఫలం అవుతున్నాయని చెప్పారు. వారి నిర్లక్ష్యం కారణంగానే నేటికీ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా, నిధుల కేటాయింపు, ఇతర హామీలపై జనసేన పార్టీ ఆధ్వర్యంలో వేసిన నిజ నిర్ధారణ కమిటీ(జేఎఫ్‌సీ) శనివారం రెండో రోజు కూడా నగరంలోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరు, రాష్ట్రానికి కేటాయించిన నిధులు, వాటి ఖర్చు, ప్రత్యేక హోదా వంటి అంశాలపై మేథోమథనం చేశారు. ఈ సమావేశానికి పవన్ కల్యాణ్ అధ్యక్షత వహించగా, కేంద్ర మాజీ హోం శాఖ కార్యదర్శి పద్మనాభయ్య, మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు ఉండవల్లి అరుణ్‌కుమార్, సీనియర్ జర్నలిస్టు అరుణ, ఔట్‌లుక్ ఇండియా మాజీ సంపాదకులు

- మిగతా 2 లో

ఖాళీల భర్తీ

ఓ ప్రహసనం

- దక్షిణ మధ్య రైల్వేలో ఖాళీలు 22 వేలు
- ఏటా రిటైరయ్యేవారి సంఖ్య 15 వేలు
- ఏడాది పాటు కొనసాగనున్న నియామక ప్రక్రియ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రైల్వేశాఖలో ఉద్యోగుల ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రహసనంగా మారింది. ఒకవైపు ఉద్యోగాల భర్తీ జరుగుతుండగా, మరోవైపు అదేస్థాయిలో పదవీ విరమణ చేస్తుండడంతో ఖాళీల పరిస్థితి ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ముఖ్యంగా భద్రతతో ముడిపడి ఉన్న కేటగిరీల్లో ఉద్యోగుల నియామకాల్లో రైల్వేశాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగినపుడు హడావిడి చేయడం, సేఫ్టీ కేటగిరిలో ఉద్యోగాలను భర్తీ చేస్తామనడం, తర్వాత పట్టించుకోకపోవడం కేంద్రానికి అలవాటైపోయింది. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) ద్వారా గ్రూప్ సీ, గ్రూప్ డీ విభాగాల్లో లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు రైల్వేమంత్రి పీయూష్‌గోయల్ బుధవారం ట్విట్టర్‌లో ప్రకటించారు. వీటిలో గ్రూప్ డీ పోస్టులు దాదాపు 62,907, గ్రూప్ సీ పోస్టులు

- మిగతా 11 లో


ఇదీ లోకం!



ఇన్నర్ రింగ్ రోడ్‌లో

8 కి.మీ. సొరంగమార్గం

- రహదారి పొడవు 96.16 కిమీ, వెడల్పు 75 మీటర్లు
- 100 ఎకరాల కొండపల్లి సంరక్షిత అటవీ భూమి చేర్పు
- రాజధాని 27 రహదారులతో అనుసంధానం
- అభ్యంతరాలు, సలహాలకు చివరి తేదీ మార్చి 18
- సీఆర్‌డీఏ నోటిఫికేషన్ విడుదల



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్మించే ఇన్నర్ రింగ్ రోడ్ (ఐఆర్ఆర్)లో 8 కిలోమీటర్ల సొరంగ మార్గం రానుంది. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి సంరక్షిత అటవీ ప్రాంతం తాజా ప్రణాళికలో చోటుచేసుకుంది. కృష్ణాజిల్లాలో 25, గుంటూరు జిల్లాలో 17 గ్రామాలు కలిపి మొత్తం 42 గ్రామాల మీదుగా ఈ రహదారి వెళ్లనుంది.

ఐఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) శుక్రవారం విడుదల చేసింది. ఐఆర్ఆర్‌ను మొత్తం 3556.17 ఎకరాల్లో 75 మీటర్ల వెడల్పు, 96.16

- మిగతా 2 లో

6 నుంచి ఢిల్లీలో మోడీపై

యుద్ధ భేరి

- పవన్ కమిటీతో టీడీపీ, బీజేపీ బండారం బట్టబయలు
- అవినీతిపరులకు అండగా కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న చంద్రబాబు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



3 లో

మెక్సికోలో భూకంపం



మెక్సికోసిటీ : మెక్సికోలో శుక్రవారం భూకంపం సంభవించినట్టు అమెరికా భూగర్భ సర్వే సంస్థ తెలియజేసింది. రిక్టర్ స్కేలుపై 7.5గా భూప్రకంపనాలు నమోదయినట్టు మొదటిసారి అది ప్రకటించింది. అయితే ఆ తరువాత ప్రకంపనాల శక్తిని 7.2గా ప్రకటించింది. మెక్సికో దక్షిణ, మధ్యప్రాంతంలో భూకంపం సంభవించి ప్రజలు నివాస భవనాలనుంచి పరుగులుతీసి వీధుల్లోకి వచారు. భవనాలు కదిలిపోయాయి. రాజధాని నగరంలో అనేక ప్రభుతవ కార్యాలయాలు దెబ్బతిన్నాయి. 5 నెలలక్రితమే పెను భూకంపాన్ని చవిచూసిన ప్రజలు తాజాగా మరో భూకంపం సంభవించడంతో గిజగిజా వణికిపోయారు. హాహాకారాలు చేస్తూ వీధుల్లోకి వచ్చారు. ఒఎక్సక రాష్ట్ర రాజధానిలో అలాగే మెక్సికో సిటీలో ఎక్కువగా నష్టాలు సంభవించాయి. మెక్సికో సిటీలో భవనం వెలుపల బెంచిపై కూర్చునివున్న 57 ఏళ్ల రోజాస్‌హుయర్ట మాట్లాడుతూ ఇంట్లోకి వెళ్లటానికి భయంవేసిందని భవనం ఊగిపోవడం, కార్లు దూరంగా విసిరివేసినట్టుగా పడిపోవడం జరిగింది. వీటన్నిటినీ చూస్తూ అలా ఉండిపోయానని ఆమె అన్నారు. గత సెప్టెంబర్ 19న భూకంపం సంభవించి మెక్సికో సిటీలో 228 మంది ఇతర ప్రాంతాల్లో 141 మంది చనిపోయిన సంఘటనలను ఆమె గుర్తు చేసుకుని భయకంపితులయ్యారు. అనాటి భూకంపానికి మెక్సికో సిటీలోని అనేక భవనాలు ఇప్పటికీ శిథిలస్థితిలో కనిపిస్తున్నాయి. మెక్సికో పౌర రక్షణ విభాగం అధికారి లూయిస్‌ఫెలిప్ పుయన్టీ మాట్లాడుతూ భూకంపం వల్ల జరిగిన నష్టాలను ఇంకా అంచనా వేయవలసివుందని తెలిపారు.

మార్చి 4న ఇటలీలో ఎన్నికలు



రోమ్ : మార్చి 4వ తేదీన ఇటలీ పార్లమెంటుకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈలోపు గెలుపు ఓటములపై నిర్వహించే సర్వేలపైన నిషేధం విధించారు. గతంలో జరిగిన సర్వేల ప్రకారం మధ్యేవాద మితవాద పార్టీల కూటమి 36.8 శాతం ఓట్లతో ముందంజలో ఉన్నదని, 5స్టార్ మూవ్‌మెంట్ 28 శాతం ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నదని తెలుస్తోంది. 5స్టార్ మూవ్‌మెంట్ మొదటిసారిగా ఎన్నికలలో పాల్గొంటున్నది. ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో పాల్గొనేందుకు నూతనంగా ఏర్పడిన ఈ పార్టీ తిరస్కరించింది. ఫోర్స్ ఇటలీ 16.4 శాతం, లీగ్ విత్ సల్విని, బ్రదర్స్ ఆఫ్ ఇటలీ 4.6 శాతం, ఉయ్ విత్ ఇటలీ 2.3 శాతం ఓట్లు పొందగలవని గతంలో జరిగిన సర్వేలో తెలియజేస్తున్నాయి. మధ్యేవాద వామపక్ష కూటమిడెమోక్రటిక్ పార్టీ నాయకత్వంలో ఏర్పడింది. ఈ కూటమికి 27.4

శాతం ఓట్లు లభించవచ్చునని, మూడవస్థానమే దక్కుతుందని గత సర్వేలు తెలిపాయి. మరో పార్టీ ఫ్రీ & ఈక్వెల్‌కు 5.7 శాతం ఓట్లు ముద్రించవచ్చునని అంచనా. మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కొని నాయకత్వంలోని కూటమి 36.8 శాతం ఓట్లతో ప్రతినిధుల సభలో 288 స్థానాలను, సెనేట్‌లో 136 స్థానాలను గెలుచుకోగలదని సూపర్ మీడియా అంచనా వేసింది. మధ్యేవాద వామపక్ష కూటమి ప్రతినిధుల సభలో 150 సెనేట్లు 81 స్థానాల్లో పొందగలదని 5స్టార్ మూవ్‌మెంట్ 157, 81 స్థానాలను రెండు సభల్లో పొందగలదని అంచనాలు వెలువడ్డాయి.

40మంది పాలస్తీనా ప్రజలకు గాయాలు



రమల్లా : గాజాస్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాలలో ప్రదర్శనలు నిర్వహిస్తున్న పాలస్తీనా ప్రజలపైన ఇజ్రాయిల్ సైనికులు దాడులుచేసి ఘర్షణ పడి 40 మందికిపైగా గాయపరిచారు. గాజా స్ట్రిప్, ఇజ్రాయిల్ మధ్యప్రాంతంలోని సరిహద్దుల్లో ఘర్షణలు జరిగాయని 23 మంది పాలస్తీనా ప్రజలపై కాల్పులు జరిపారని, గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి అష్రఫ్‌అల్‌ఖిద్రా తెలిపారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా వుందని ఆయన తలపై కాల్చడంవల్ల జీవన్మరణ స్థితిలోవున్నారని ఆయన చెప్పారు. పాలస్తీనా నిరసనకారులను చంపివేసే లక్ష్యంతోనే ఇజ్రాయిల్ సైనికులు కాల్పులు జరిపారని అల్ ఖిద్రా అన్నారు. తీరప్రాంతంలో భద్రతా పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యిందని, గత 11 ఏళ్లుగా ఇజ్రాయిల్ ఈ ప్రాంతాన్ని దిగ్బంధం చేసిందని ఆయన చెప్పారు. ఇజ్రాయిల్‌కి వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలు తమ జాతీయ జెండాలను చేతపట్టుకొని నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ సైనికులు బాష్పవాయువు గోళాలను, రబ్బరు బుల్లెట్లను ఆ తరువాత తుపాకులను పేల్చి ప్రదర్శకులను చెల్లాచెదరు చేశారు. జెరూసలింను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన నాటినుంచి గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాలలో ప్రతి శుక్రవారం పాలస్తీనా ప్రజలు సామూహికంగా నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు.

యుద్ధానికి కాలుదువ్వుతున్న అమెరికా

చైనాపై రంకెలువేసిన ఉన్నత సైనికాధికారి

వాషింగ్టన్ : ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాతో యుద్ధానికి తలపడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా సైనిక అడ్మిరల్ హేరీహారీస్ అన్నారు. అమెరికాకు చెందిన అత్యంత శక్తివం తమైన పసిఫిక్ కమాండ్‌కు హారిస్ నాయకత్వం వహిస్తున్నారు. అమెరికా తనకు మోకరిల్లాలని చైనా భావిస్తున్నది. ప్రపంచ ఆకాంక్షలు దానికి ఉన్నాయి.

దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనా అనుసరిస్తున్న విధానాలు సరైనవికాదని అన్నారు. చైనా తమతో యుద్ధానికి తలపడబోదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఒకవేళ అవసరమైతే చైనాపై యుద్ధానికి తాము సిద్ధమేనని అన్నారు. దక్షిణ చైనా సముద్ర జలాల్లో హక్కు తమదేనని చైనా ప్రభుత్వం పదేపదే ప్రకటించింది. అయితే వాషింగ్టన్ దీనికి అంగీకరించడంలేదు. తమ సైనిక బలాన్ని ప్రదర్శించేందుకు తాజాగా దక్షిణ చైనా సముద్ర ప్రాంతానికి యుద్ధనౌకలను తరలించింది. ఆ ప్రాంతంలో దీవులను ఏర్పాటు చేసుకొని చైనా ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లను, మిస్సిలీలను, యుద్ధనౌకలను నిలిపివుంచిందని అమెరికా ఆరోపించింది. అన్ని విధాలుగా యుద్ధం చేయడానికి చైనా సైన్యం సిద్ధమైనట్టుగా హేరిస్ ఆరోపించాడు.

అయితే చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగోలియాలో స్వయం ప్రతిపత్తిగల ప్రాంతంలోని జ్యూరిచ్ సైనిక శిక్షణా స్థావరంలో సైనిక పెరేడ్‌ను నిర్వహించారు. అమెరికా కాంగ్రెస్‌లో హేరిస్ మాట్లాడుతూ చైనా సైనిక శక్తిని పెంపొందించుకోవడం ఆధునిక ఆయుధాలను తయారుచేసుకోవడం అమెరికా తనకు మోకరిల్లాలనే వ్యూహంతో ఉన్నదని చెప్పేందుకు సరైన తార్కాణాలని హారిస్ అన్నారు.




రాంఫోసాకు కమ్యూనిస్టుల సూచనలు



ప్రిటోరియా : దక్షిణాఫ్రికా అధ్యక్ష పదవికి జాకబ్‌జుమా రాజీనామాను పాలక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ తదితర పార్టీలు ఆహ్వానించాయి. అదే సమయంలో నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాంఫోసాకు కమ్యూనిస్టు పార్టీ అభినందనలు తెలియజేసింది. ఆయన ప్రకటించిన లక్ష్యాలతో పాటు మరికొన్ని సూచన లను కమ్యూనిస్టు పార్టీ చేసింది. వర్గం, జాతి, స్త్రీ పురుష అసమానతలను గణనీయంగా తగ్గించేం దుకు అధ్యక్షుడు కృషి చేయాలని పార్టీ కోరింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అసమానతలు పెరి గాయని వాటిని తగ్గించవలసిన అవసరంవుందని పార్టీ విడుదల చేసిన ప్రకటన సూచించింది. కార్మికుల, పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరి చేందుకు వారికి పని హక్కును కల్పించాలని అందరికీ గౌరవనీయమైన ఉద్యోగావకాశాలను కల్పించాలని పార్టీ సూచించింది. వీటిని సాధించేందుకు దేశాన్ని చుట్టుముట్టిన పరాన్న భుక్కులయిన నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయాలని పార్టీ సూచించింది. ప్రభుత్వంలోని అన్ని స్థాయిలలో అవినీతిని రూపుమాపాలని కోరింది. రాంఫోసా గని కార్మికుల ట్రేడ్ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. కార్మిక ఉద్యమానికి నాయకత్వం వహించారు. జాతి వివక్ష పాలన అంతమయ్యేందుకు చర్చలు జరిపినవారిలో ఆయన ఒకరు.

అవినీతిపై పోరాటం : నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాంఫోసా తన పాలనా లక్ష్యాలను ప్రకటించారు. అవినీతిని నిర్మూలించేందుకు, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికి కృషి చేస్తానని దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ అన్నారు. అద్భుతమైన నూతన వెలుగు మన జీవితాలలో ప్రవేశించిందని అన్నారు. జాకబ్‌జుమా రాజీనామా తరువాత రెండురోజుల క్రితం పాలక ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ ఎంపీలు రాంఫొసాను అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఇప్పటివరకు దేశాన్ని అలుముకునివున్న ప్రతికూలతను సభ్యులంతా విడిచిపెట్టాలని కోరారు. ప్రభుత్వ వనరులను దోమకునేందుకు అంగీకరించని, కార్పోరేట్ నేరస్తులు సామాన్య ప్రజల పొదుపు మొత్తాలను దొంగిలించేందుకు అనుమతించని సమ్మిళిత, గౌరవనీయమైన సమాజాన్ని నిర్మించేందుకు సభ్యులంతా కృతనిశ్చయంతో పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశంలో నిరుద్యోగం అత్యంత తీవ్రంగావుందని తక్షణం ఒత్తిడికి గురిచేస్తున్న పెద్ద సవాలు అని రాంఫొసా అన్నారు. 2017 తృతీయ త్రైమాసికంలో దేశంలో నిరుద్యోగం 38.6 శాతం ఉన్నది.

పుతిన్‌కే విజయావకాశాలు



మాస్కో : రష్యా అధ్యక్ష పదవికి జరగనున్న ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌కే విజయావకాశాలు ఉన్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. అధ్యక్ష పదవికి మరో 7గురు అభ్యర్థులు కూడా పోటీ చేస్తున్నారు. పుతిన్ గెలుపొందితే 4వసారి ఆయన అధ్యక్షుడిగా 2024 వరకు కొనసాగుతారు. రంగంలోవున్న వారిలో గతంలో టెలివిజన్‌లో రియాల్టీషో నిర్వహించిన నటుడు, డైరెక్టర్ ఫ్రుయిట్‌ఫార్మ్ ఉన్నారు. ప్రధాన ప్రత్యర్థిగా భావిస్తున్న అలెక్సినవల్నీ పోటీనుంచి తప్పుకున్నారు. ఆయనపైన నేరానికి సంబంధించిన కేసులు ఉండటంవలన దరఖాస్తును ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. పుతిన్‌కు ప్రధానమైన ప్రత్యర్థి అని ప్రజలు భావించారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా 57 ఏళ్ల పావెల్‌గ్రుడినిన్ పోటీ చేస్తున్నారు.

ఒట్టి కల్పనలే !

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన రెండు భాగస్వామ్య సంస్థలలో 983 సంస్థలు ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే ఇప్పటి వరకు 530 పరిశ్రమలు తమ వ్యాపార కార్యక్రమాలను ప్రారంభించగా, మరో 23 ఉత్పత్తుల ట్రైల్ దశలో ఉన్నాయి. అంటే మొత్తం ఒప్పందాలలో 28 శాతం మాత్రమే ప్రారంభమయ్యాయి. ఇక పెట్టుబడుల విషయానికొస్తే1,946 సంస్థలు రూ.14.21 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు పూర్తిస్థాయిలో వచ్చాయి. మరో 23 సంస్థలు రూ.2,506 కోట్ల పెట్టుబడులతో కార్యకలాపాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. 49 సంస్థలు రూ.84,664 కోట్ల పెట్టుబడులు పెట్టగా, ఆయా సంస్థలు మెషినరీని బిగించే దశలో ఉన్నాయి. 177 పరిశ్రమలు సివిల్ పనుల దశలో ఉన్నాయి. ఇవి రూ.1.96 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. పరిశ్రమలలో ఇప్పటి వరకు 10 శాతం మాత్రమే వ్యాపార లావాదేవీలు చేపట్టాయి. ఉత్పత్తులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న సంస్థలు, మెషినరీ బిగించినవి, సివిల్ పనుల దశలో ఉన్న వాటిని పరిగణనలోకి తీసుకుంటే 15 శాతానికి మించి కార్యరూపం దాల్చలేదనే విషయం స్పష్టమవుతోంది. అయితే ప్రభుత్వం మాత్రం 58 శాతం సంస్థలు రూ.14.21 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాయని, వాటిలో 40 శాతం సంస్థలు ఉత్పత్తిలోకి ప్రవేశించాయని లెక్కలు చూపుతోంది. ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా జిల్లాల్లో టెక్స్‌టైల్, ఆగ్రోఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలు ఉత్పత్తిరంగంలోకి దిగగా, పలు జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నట్లు గణాంకాలు చూపుతున్నాయి. పెట్టుబడులలో 40 శాతం ఉత్పత్తులను ప్రారంభించినట్లు లెక్కలు చూపించటం గమనార్హం.

10 శాతమే ఉద్యోగాలు

రాష్ట్రంలో మూడున్నర సంవత్సరాలలో పలు రకాల పెట్టుబడులు, ఎంఓయూల ద్వారా 10 శాతం మందికే ఉద్యోగాలొచ్చాయన్నది నగ్న సత్యం. ఒకవైపున ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని పూర్తిగా మరచిపోగా, ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉన్నది. అయితే ప్రభుత్వం మాత్రం పెట్టుబడుల ద్వారా సుమారు 11 లక్షల మందికి (33 శాతం) ఉద్యోగాలిచ్చినట్లు లెక్కలు చూపిస్తోంది. పెట్టుబడులు పెట్టి ఉత్పత్తిని ప్రారంభించిన సంస్థలు, త్వరలో ఉత్పత్తికి సిద్ధమవుతున్నవి, మెషినరీ బిగించిన, సివిల్ పనులు జరుగుతున్న, శంకుస్థాపనకు సిద్ధంగానూ, భూమిని తీసుకుని అనుమతుల కోసం ఎదురు చూస్తున్న సంస్థలలో కూడా ఉద్యోగాలు ఇచ్చినట్లుగా గణాంకాలను అధికారులు రూపొందిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 1,946 సంస్థలలో 60 శాతం సంస్థలు ఇప్పటికే ప్రారంభించినట్లుగా చూపిస్తున్నారు. వాస్తవానికి 28 శాతానికి మించి సంస్థలు ప్రారంభమైన దాఖలాలే లేవు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన సంస్థలలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల, ఇంధన ఉత్పత్తి, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, పర్యాటక సంస్థలు ఎక్కువగా ఉన్నాయి. పెట్టుబడులే ధ్యేయంగా చంద్రబాబు మొదలు మంత్రులు, ఉన్నతాధికారులు విదేశాల్లో పర్యటిస్తున్నారు. పదుల సంఖ్యలో దేశాలను చుట్టివస్తున్నారు. పేరుకు లక్షలాది కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నట్లు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో గ్రౌండింగ్ అంతంత మాత్రంగానే ఉంటోంది. పలు సంస్థలకు భూములను అప్పగించటం, అనుమతులు, పరిశ్రమలలో కొన్ని ఇంకా డీపీఆర్ దశలోనే ఉంటున్నాయి. ఇదంతా ఒక ఎత్తైతే, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన మొత్తం సంస్థలలో 563 కంపెనీలు ఇంకా డీపీఆర్‌నే సమర్పించలేదు. 241 సంస్థలు తమకు ప్రభుత్వం నుంచి భూమి లభించలేదనే ఉద్దేశంతో అసలు కార్యకలాపాలనే ప్రారంభించకపోవటం గమనార్హం. రెండుసార్లు విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులలో కనీసం 25 శాతం సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించలేదని కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా, సీఎం, మంత్రులు, అధికారులు మాత్రం కాకి లెక్కలు చూపుతూ ప్రజలను మసిపూసి మారేడుకాయ చేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

మూడో సమ్మిట్‌కూ విశాఖ వేదిక

సీఐఐ ఆధ్వర్యంలో విశాఖలోనే ఈ నెల 24న మూడో భాగస్వామ్య సదస్సు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఆ సదస్సులో కనీసం రూ.10 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను రాబట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఉంది. ఎన్ని లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినా, అవి ప్రజలకు అందుబాటులోకి రాకపోతే ఫలితం ఏంటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వచ్చిన పెట్టుబడులు గ్రౌండింగ్‌కాకపోవటంతో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫుడ్‌ప్రాసెసింగ్, పరిశ్రమలు, లాజిస్టిక్, పర్యాటక రంగాలలో అత్యధికంగా పెట్టుబడులు రాబట్టేందుకు కసరత్తు జరుగుతోంది. మూడు రోజులపాటు జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ప్రారంభించనున్నారు. ఇప్పటికే పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న సంస్థల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈసారి దక్షిణ కొరియా, జపాన్, జర్మనీ దేశాలకు చెందిన కొన్ని సంస్థలు కూడా ముందుకొచ్చాయంటున్నారు. ముచ్చటగా మూడోసారి నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో ఎన్ని సంస్థలు ఎంఓయూ చేసుకుంటాయి, వాటిలో ఎన్ని క్షేత్రస్థాయిలో పెట్టుబడులు పెడతాయో వేచి చూడాల్సిందే.

ముగ్గురి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలకు అధికారిక సంతకందారు హేమంత్ భట్ ఉన్నారు. ఎటువంటి రుణ పరిమితి లేకుండా లేదా నగదు మార్జిన్ లేకుండానే 'లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్' (ఎల్ఒయు) పొందేందుకు గోకుల్‌నాథ్ శెట్టి, మనోజ్ కరత్, హేమంత్ భట్‌లతో కలిసి నీరవ్‌మోడీ ఈ కుట్రకు పాల్పడ్డారని పీఎన్‌బీ తన ఫిర్యాదులో పేర్కొన్న సంగతి తెలిసిందే. వీరిని నేడు ముంబైలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. రెండు కేసుల్లోనూ దర్యాప్తు, ఇతరులను విచారించడం కొనసాగుతోంది. అక్రమాలకు పాల్పడ్డారని శుక్రవారం పీఎన్‌బీ ఇద్దరు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. గోకుల్‌నాథ్ శెట్టి, మనోజ్ హేమంత్ కరత్‌లపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీలు పీఎన్‌బీలో రూ 754.92 మిలియన్ డాలర్ల మేర అక్రమాలకు పాల్పడేలా వీరిద్దరూ ఒప్పించినట్టు ఎఫ్ఐఆర్ పేర్కొంది.

నీరవ్ మోడీకి గోకుల్‌నాథ్ శెట్టి అత్యంత సన్నిహితుడిగా ఉండేవాడని తెలుస్తోంది. ఈ క్రమంలో ముంబైలోని ఆయన నివాసంలో కూడా సీబీఐ సోదాలు నిర్వహించింది. ఈ స్కాంలో గోకుల్ శెట్టిని సహ నిందితుడిగా బ్యాంకు పేర్కొంది. దాదాపు రూ.11.400 కోట్ల కుంభకోణానికి పాల్పడిన నీరవ్ మోడీ ప్రస్తుతం విదేశాల్లో దాక్కున్నట్టు తెలుస్తోంది. ఈ కుంభకోణం బయటపడుతుందనే సమయంలోనే అంటే జనవరి 1నే నీరవ్ విదేశాలకు వెళ్లిపోయాడు. ఆయన ప్రస్తుతం న్యూయార్క్‌లోని జేడబ్ల్యూ మారియట్స్ ఎస్సెక్స్ హౌస్‌లో ఉన్నట్టు సమాచారం. నీరవ్ మోడీని పట్టుకోవడం కోసం సీబీఐ, ఈడీ అధికారులు వేట కొనసాగించారు. ఆయన్ను పట్టుకునేందుకు భారత్ ఇంటర్‌పోల్ సహాయం కోరింది. మరోవైపు పీఎన్‌బీలో స్కాం దెబ్బకు బ్యాంకులు విలవిలలాడుతున్నాయి. వేలకోట్ల రూపాయల్లో బ్యాంకులు భారీగా రుణాలు ఇచ్చాయి. దీంతో ఆ బ్యాంకులు తలలు పట్టుకుంటున్నాయి.

సీవీసీ సమన్లు : ఈ కుంభకోణంపై ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, ఆదాయం పన్ను శాఖ ద ృష్టి సారించగా తాజాగా చీఫ్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) కూడా రంగంలోకి దిగింది. ఈనెల 19న తమ ముందు హాజరుకావాల్సిందిగా పీఎన్‌బీ యాజమాన్యం, ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులకు సీవీసీ సమన్లు పంపింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు తరఫున ఎండీ, సీఈఓ వచ్చే సోమవారం ఉదయం 11 గంటలకు సీవీసీ ముందుకు హాజరవుతారని, పీఎన్‌బీ చీఫ్ విజిలెన్స్ అధికారి కూడా వీరి వెంట ఉంటారని తెలుస్తోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ తరఫున ఆ శాఖ అదనపు కార్యదర్శి హాజరయ్యే అవకాశం ఉంది. పీఎన్‌బీ కుంభకోణం ఏవిధంగా చేటుచేసుకుందనే దానిపై ఒక ప్రెజెంటేషన్‌ను కూడా సీవీసీ ముందు పీఎన్‌బీ సీఈవో ఇచ్చే అవకాశం ఉంది.

ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చే సరికి కోల్‌కతాలోని గీతాంజలి జేమ్స్‌స్టోర్స్ ఒక్కటీ విస్తరించే క్రమాన్ని ప్రారంభించిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. ఈ కోట్లాది రూపాయల కుంభకోణానికి ఈ స్టోర్ యజమాని మెహల్ చౌక్సీ సూత్రధారని భావిస్తున్నారు. ఈడీ సీనియర్ అధికారి ఒకరు పీటీఐతో మాట్లాడుతూ, తమ విభాగం అధికారులు కామక్ వీధిలోని గీతాంజలి జేమ్స్ స్టోర్‌కి వెళ్లారని, అప్పటికే స్టోర్ మూసివేసి వుందని తెలిపారు. "స్టోర్‌ని విస్తరించే క్రమాన్ని కంపెనీ ప్రారంభించినట్టు కనిపిస్తోంది" అని ఆ అధికారి తెలిపారు. దుర్గాపూర్‌లోని చిన్న స్టోర్‌కి మరో బృందం వెళ్లిందని, ఆ స్టోర్‌ని ఫ్రాంచైజీ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారని చెప్పారు.

8 కి.మీ. సొరంగమార్గం

(మొదటిపేజీ తరువాయి)

కిలోమీటర్ల పొడవుతో నిర్మించనుంది. గత నెలలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముందుగా ఐఆర్‌ఆర్ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో సీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ రహదారి నిర్మాణం వల్ల రాజధాని బృహత్ ప్రణాళికతోపాటు రాజధాని ప్రాంతంలోని 11 జోనల్ అభివృద్ధి ప్రణాళికల్లోని 35 గ్రామాల్లో మార్పులు చేయవలసి ఉన్నట్లు అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రాజధాని పరిధి నుంచి ఐఆర్‌ఆర్ వరకూ అనుసంధానించిన 27 రహదారుల ముసాయిదాను ప్రణాళికలో ప్రతిపాదించారు. బృహత్ ప్రణాళికలోని అనంతవరం గ్రామంలో మార్పులు చేయడమే కాకుండా ఏ ప్రణాళికలో లేని 5 గ్రామాలు, కొండపల్లి సంరక్షిత అటవీ భూభాగంలో 204.56 ఎకరాలను ప్రణాళికలో చేర్చారు. ముసాయిదా ప్రణాళిక ప్రకారం మొత్తం విస్తీర్ణం 2195.87 ఎకరాలలో ఐఆర్‌ఆర్‌తో అనుసంధానించిన 27 రహదారుల విస్తీర్ణం 1360.30 ఎకరాలలో ప్రతిపాదించారు. ఇక ఐఆర్‌ఆర్ రెండో దశలో భాగంగా 28.08 కిలోమీటర్ల సరికొత్త రహదారిని ప్రణాళికలో పొందుపరిచారు. ఈ అలైన్‌మెంట్ ఎక్కువగా కొండ ప్రాంతాల్లోని అడవుల మీదుగా వెళ్లనుంది. ముఖ్యంగా కొండపల్లి సంరక్షిత అటవీ భూభాగంలో 9 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ ప్రణాళికపై 42 గ్రామాల్లోని ప్రజల అభ్యంతరాలు, సలహాలను మార్చి 18వ తేదీలోపు విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో అందచేయాలని కోరారు. అలాగే సీఆర్‌డీఏ వెబ్‌సైట్ ద్వారా కూడా అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఐఆర్‌ఆర్‌కు సంబంధించిన వివరాలను సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయం, అమరావతి, దుగ్గిరాల, జి.కొండూరు, గన్నవరం, ఇబ్రహీంపట్నం, మంగళగిరి, పెనమలూరు, తాడికొండ, తుళ్లూరు, విజయవాడ రూరల్ మండలాల తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలల్లో చూడవచ్చన్నారు. ఇంకా విజయవాడ, నూజివీడు, గుంటూరు, తెనాలి ఆర్డీఓ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కృష్ణాజిల్లాలో గ్రామాలు : దాములూరు, దోనెఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, వైకుంఠపురం, కొండపల్లి, కొండపల్లి సంరక్షిత అటవీ భూభాగం, కొటికలపూడి, కొత్తూరు, నిడమానూరు, నున్న, పాతపాడు, పెనమలూరు, పోరంకి, రామచంద్రాపురం, సవరిగూడెం, కె.తాడేపల్లి, త్రిలోచనపురం, వెదురుపావులూరు, వెలగలేరు, జామి మాచవరం.

గుంటూరు జిల్లాలో గ్రామాలు : అనంతవరం, చినకాకాని, చినవడ్లపూడి, ఎంద్రాయి, హరిశ్చంద్రపురం, కంతేరు, కర్లపూడి, కాజ, మోతడక, నూతక్కి, పెదపరిమి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, తాడికొండ, తుమ్మపూడి, వడ్డమాను, చోడవరం.

మభ్యపెట్టారు

(మొదటిపేజీ తరువాయి)

మహేశ్వర్‌పెర్రి, ఎకానమిస్ట్ డా.అమీర్‌ఖాన్, జర్నలిస్టు ప్రమోద్‌రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్‌తో పాటు పలువురు మాట్లాడుతూ ప్రత్యేక హోదా అనేది ఎవ్వరి వ్యక్తిగత సమస్య కాదని, ఇది ఒక రాష్ట్ర సమస్య అయినందున ప్రతి ఒక్కరు కూడా ప్రజల పక్షాన నిలబడాల్సిన అవసరం ఉందన్నారు.

మొదటి నుండి కూడా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని మభ్యపెడుతూ వచ్చిందని, కానీ నేటికీ అది అమలు కాలేదన్నారు. ముఖ్యంగా రాష్ట్రానికి చెందిన ఎంపీలు సరిగా పని చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. అసలు వారు ఎందుకు కేంద్ర ప్రభుత్వానికి భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. అప్పటి పెద్దలు తెలంగాణాను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పి రెండు రాష్ట్రాలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చారని, కాని దశాబ్దాల తరబడి తెలంగాణకు అన్యాయం జరగడంతో ఇక్కడ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చేపట్టారని తెలిపారు. చివరకు యువత ఆత్మహత్యలు చేసుకోవడంతో పాటు ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో కేంద్రం తలొగ్గి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిందన్నారు. అదే సమయంలో ఏపీకి కూడా అన్యాయం జరగకుండా చూసేందుకు ప్రత్యేక హోదా, విభజన చట్టంలో అనేక హామీలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం హయాంలో కూడా ఏపీకి అన్యాయం జరుగుతుందని, దీని వల్ల ఏయే రాజకీయ నాయకులకు లబ్ధి చేకూరుతుందో తెలియదు కాని ప్రజలు మాత్రం నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ముందు తరాలకు ఇలాంటి సమస్యలు ఎదురవ్వకుండా నిర్దిష్ట ఆలోచనతో ముందుకు సాగడంతో భావితరాలకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు కార్యాచరణ రూపొందించే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణలో ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా చర్చించామని, వారికి కల్పించిన హామీలు, అమలు తీరు విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ప్రత్యేక హోదా విషయంలో టీడీపీ, వైసీపీలకు చిత్తశుద్ధి ఉంటే రాజీనామాలు చేయవచ్చు లేదా అవిశ్వాస తీర్మానం కూడా ప్రవేశపెట్టవచ్చని పేర్కొన్నారు.

కేంద్రంపై పోరాటమే

(మొదటిపేజీ తరువాయి)

సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించుకున్నామని అన్నారు. కొందరు ప్రత్యేక హోదా పేరుతో రాష్ట్రంలో రాజకీయం చేయాలని చూస్తున్నారని, మరికొందరు స్వలాభం కోసం ప్రయత్నిస్తున్నారని, ఎవరు ఏమనుకున్నా తాము మాత్రం రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు అన్నారు. తమ పోరాటానికి ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆశీస్సులు కావాలని కోరారు. కొందరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన లెక్కలు చూపించాలని అడుగుతున్నారని, అవన్నీ పార్లమెంట్, అసెంబ్లీలలో చర్చిస్తారని, అందరికీ చెప్పాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి అన్నారు. తాను రాష్ట్రాభివృద్ధి విషయంలో ఎవరికీ భయపడనని, రాజీపడనని పరోక్షంగా కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు హెచ్చరికలు జారీ చేశారు. లోటు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రం ఎన్నో ఇబ్బందుల్లో ఉందని, కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేసి రాష్ట్రాన్ని ఆదుకోవాలని స్పీకర్ కోడెల కోరారు. ఎంపీ రాయపాటి సాంబశివరావు, మంత్రులు గంటా శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, శిద్దా రాఘవరావు, నక్కా ఆనంద్‌బాబు, మాణిక్యాలరావు, ఎమ్మెల్సీ రామకృష్ణ, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్, మాజీమంత్రి జేఆర్ పుష్పరాజ్, జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కుమార్, రిజిస్ట్రార్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.15 వేల కోట్లతో మద్దతు ధరకు యోచన



న్యూఢిల్లీ : పంటకు కనీస మద్దతు ధర లభించేలా చేసేందుకు ప్రభుత్వం త్వరలో ఓ కొత్త పథకం తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం 12 నుంచి 15 వేల కోట్ల రూపాయల వరకు వ్యయమవ్వొచ్చని అంచనా వేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలకు పెట్టుబడి కంటే 50 శాతం ఎక్కువగా మద్దతు ధర ఉండేలా చేస్తామని ఆర్థిక మంత్రి జైట్లీ తాజా బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందుకోసం నీతి ఆయోగ్ త్వరలో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలతో ఓ సమావేశం నిర్వహించనుంది. కనీస మద్దతు ధర విషయంలో రైతులకు లబ్ధి చేకూర్చేలా తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలను ఆ సమావేశంలో చర్చించనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత వ్యతిరేక పార్టీలు

దళితులపై దాడులకు ఎట్రాసీ చట్టం అమలు చేయాలి : ఏఐడీఆర్ఏఏ

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : అధికారంలో ఉన్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను అవలంభిస్తు దళితులను అణిచివేయాని కుట్రలు పన్నుతూ అవమానకరంగా చేస్తున్న వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పలు దళిత సంఘాల నాయకులు తెలిపారు. దళితులపై,దళితక్రైస్తవులపై నిత్యం జరుపుతున్న దాడులకు నిరసనగా అల్ ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఛలో విజయవాడ పిలుపు మేరకు శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం దగ్గర ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి అలంకార్ ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో అల్ ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు కందుల ఆనందరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపి, రాష్ట్రంలోని టిడిపి పార్టీలు దళిత వ్యతిరేక పార్టీలు అవతరించి దళితులపై నిరంతరం దాడులు చేస్తు భయభ్రాంత్రులు సృష్టిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని వాపోయారు. గరగపర్రు సంఘటనలో ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నేత రాజు పాత్ర ఉందని ప్రభుత్వానికి తెలిసినా. ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇటీవల కర్నూలుజిల్లా అళ్లగడ్డ నియోజకవర్గంలో దళితులపై పెత్తందారులు దాడులకు పాల్పడి..సాంఘిక బహిష్కరణకు గురిచేశారని పేర్కొన్నారు. పెదగొట్టిపాడులో దళితులపై దాడులకు పాల్పడిన వారికి ప్రభుత్వం కొమ్ముకాస్తోందని మండిపడ్డారు. దేశంలో హిందు మతోన్మాదులుఉ గతంటకంటే ఎక్కువగా దళితులపై ప్రతి రోజు ప్రతి నిమిషం అమానుషంగా దాడులు చేస్తూనే ఉన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ,ఎ.బి.వి.పి. కార్యకర్తలు కలసి దళిత స్కాలర్ వేముల రోహిత్‌ను హత్య చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు,అందోళనలు పెద్ద ఎత్తున చేశారు. కాని మోదీ ప్రభుత్వం నిందుతులపై ఈగ కుడా వలకుండా జాగ్రత్తగా కాపాడుకుంది. నేటికి రోహిత్ కుటుంబానికి న్యాయం జరగలేదన్నారు. కృష్ణాజిల్లా నూజివీడు మండలం ఆగిరిపల్లి గ్రామంలో దళితులపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించినందుకు చదువుకున్న యువకులపై టిడిపి ప్రభుత్వం పోలీసుల ద్వారా రౌడీషీట్ కేసులు పెట్టించి జైలు పాలు చేసి వారికి భవిష్యత్తు లేకుండా చేసిందన్నారు. ఇటువంటి దాడులు ,అకృత్యాలకు పాల్పడుతున్న వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత బహుజనల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అగ్రకులాలకు కోమ్ము కాస్తూ దళితులను అణిచివేయాలని కుట్రలు పనుతుందని విమర్శించారు. విజయనగరంజిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలోని మోదవలస గ్రామంలో దళితులు జన్మభూమి కార్యక్రమంలో అర్జీ ఇవ్వడానికి వెళితే వారిపై అధికారపార్టీకి చెందిన వారు దాడికి పాల్పడడం శోచనీయమన్నారు. ఇటీవలే దళిత మహిళను వివస్త్రను చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే కర్నూలుజిల్లా మంత్రి భూమా అఖిలప్రియ నియోజకవర్గంలోని నక్కలదిన్నె గ్రామంలో దళితులను సాంఘికంగా వెలి వేసి విద్యుత్, తాగునీరు సరఫరా నిలిపివేయడమే కాకుండా అంగడుల్లో సరుకులు కూడా లభించకుండా చేయడం దారుణమన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే గరగపర్రు, మోదవలస, నక్కలదిన్నె,గుంటూరు జిల్లా గిట్టిపాడు ఘటనలలో దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వారిపై అట్రాసీ సెక్షన్‌లు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజనల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జె.వి. బ్రాకర్, రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప , జిల్లా సెక్రటరీ లింగం ఫిలిఫ్స్,ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మణిసింగ్,వర్కింగ్ ప్రసిడెంట్ బేతాళ సుదర్శన్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు,మాలమహానాడు రాష్ట్ర అద్యక్షులు నత్తా యోహనారాజు, రైల్వే ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ డివిజనల్ సెక్రటరీ వై.కొండలరావు,బత్తుల వీరాస్వామి,ఆంద్రు మాల్యాద్రి,జి.నటరాజ్,కె.రత్నం, కెవిపిసిఎస్ రాష్ట్ర కన్వీనర్ పరిశిపోగు రాజేష్ పాల్గొన్నారు.

'వేమగిరి' విద్యుత్ వివాదంలో సుప్రీం తీర్పుపై

ట్రాన్స్‌కో, డిస్కంల హర్షం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వేమగిరి గ్యాస్ విద్యుత్ వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పుతో ప్రజలపై దాదాపు రూ. 4వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం తప్పిందని వారు తెలిపారు. ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు చేసుకున్న ఒప్పందాలకు సంబంధించిన చెల్లింపులపై ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలు సాగించిన న్యాయపోరాట ఫలితంగా ఈ భారం తప్పిందన్నారు. ప్రైవేటు సంస్థలు రీగ్యాసిఫైడ్ లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఆర్ఎల్ఎన్‌జీ) వినియోగంపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) 2013 ఆగస్టు 8వ తేదీన ఇచ్చిన తీర్పునే అత్యున్నత న్యాయస్థానం ఖరారు చేసిందన్నారు. గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో సహజవాయువు (నేచురల్ గ్యాస్)కు ఆర్ఎల్ఎన్జీ ప్రత్యామ్నాయం కాదని కోర్టు స్పష్టం చేసిందన్నారు. దీని ప్రకారం గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సంస్థలైన జీఎంఆర్ కోరుతున్న దాదాపు రూ. 1200 కోట్లు, కోనసీమ, జీవీకే రెండో దశ, జీవీకే గౌతమికి భవిష్యత్తులో చెల్లించాల్సిన దాదాపు రూ. 2800 కోట్లను చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. ఏపీఈఆర్సీ ఇచ్చిన తీరును సవాల చేస్తూ జీఎమ్మార్ సహా ఆయా సంస్థలు అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయన్నారు. దీంతో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన నిధులను ఇచ్చేయాలని ట్రిబ్యునల్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ తీర్పుతో విభేధించిన ఏపీ ట్రాన్స్‌కో సుప్రీంను ఆశ్రయించి తన వాదనను బలంగా వినిపించడంతో శుక్రవారం ట్రాన్స్‌కోకు అనుకూలంగా తీర్పును వెల్లడించినట్లు స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెలిపారు.

6 నుంచి ఢిల్లీలో మోడీపై యుద్ధ భేరి

- పవన్ కమిటీతో టీడీపీ, బీజేపీ బండారం బట్టబయలు
- అవినీతిపరులకు అండగా కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రాన్ని అప్పలపాలు చేస్తున్న చంద్రబాబు

సీపీఐ రాష్ట కార్యదర్శి కె.రామకృష్ణ



విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : ప్రత్యేక హోదా సాధనకు మార్చి 6 నుంచి ఢిల్లీలో నరేంద్ర మోడీపై యుద్ధభేరి పేరుతో నిర్వహించనున్న నిరవధిక ఆందోళనకు శ్రేణులు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఆనం రోటరీ హాల్‌లో శనివారం ఉదయం సీపీఐ తూర్పుగోదావరి జిల్లా 24వ మహాసభ సందర్భంగా ప్రతినిధుల సభ నిర్వహించారు. ముందుగా సీపీఐ పతాకాన్ని మాజీ ఎమ్మెల్యే చిట్టూరి ప్రభాకర చౌదరి ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపానికి జిల్లా కార్య వర్గ సభ్యుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ నివాళి అర్పించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య ప్రారంభించారు. ప్రజానాట్య మండలి బృందం విప్లవ గీతాలు ఆలపించారు. అనంతరం సభలో ప్రారంభో పన్యాసం చేసిన రామకృష్ణ మాట్లాడుతూ అవినీతిపరులకు, కార్పొరేట్ శక్తులకు ప్రధాని నరేంద్ర మోడీ అండగా నిలిచారని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విఫలమయ్యాయని విమ ర్శించారు. మరోసారి రాజకీయాల్లో కీలక పాత్ర నిర్వహిం చేందుకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పీపుల్స్ అజెండాను తయారు చేశామన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులతో కలిసి ప్రత్యామ్నాయం రూపొందిస్తున్నామన్నారు. కార్పొరేట్ శక్తుల కారణంగా దేశంలో లంచగొండి విధానం పెచ్చుమీరు తుందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యా యం జరిగిందని, టీడీపీ, బీజేపీలు ప్రత్యేక హోదా విష యంలో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నా యన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప రాష్ట్రపతి వెంకయ్యనా యుడుల అవాస్తవ ప్రచారం కారణంగా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నెలకొల్పి నిర్వహించిన అనేక ఉద్యమాల ఫలి తంగా అన్ని రాజకీయ పార్టీలు దీనిపై గొంతు కలుపు తున్నాయని, పవన్ కల్యాణ్ చొరవతో బీజేపీ, టీడీపీల బండారం బయటపడటం ఖాయమన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో మహాసభ ఉత్సహపూరితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. చైనా నుంచి నేపాల్ వరకూ కమ్యూనిస్టు పార్టీ పాలనలో అభివృద్ధి దిశలో ముందుకు సాగుతున్నాయని గుర్తు చేశారు. విజయ్ మాల్యా, గాలి జనార్ధనరెడ్డి, నీరవ్ మోడీ లాంటి బ్యాంకు ఎగవేత దారులు, మాఫియాలను ప్రధాని మోడీ ప్రోత్సహిస్తున్నారన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ప్రభుత్వం వాగ్దానాన్ని నిలుపుకోవడంలో విఫలమైందని విమ ర్శించారు. 2016-2017 ఆర్థిక సంవత్సరంలో కేవలం మూడు లక్షల 70 వేల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగలిగారని అన్నారు. స్వయం వృత్తులకు ప్రోత్సాహం కరువైందన్నారు. నాలుగు లక్షల మంది రుణాల కోసం దరఖాస్తులు చేసుకుంటే 50 వేల మందికి కూడా ఇవ్వకపోవడం విచిత్రమన్నారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసిగివేసారి పోయారన్నారు.

సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో యువ కార్యకర్తలను తయారు చేసుకోవడం ద్వారా బలోపేతం కావాలని, తద్వారా దేశ రాజకీయాల్లో గురుతరమైన బాధ్యత పోషించగలిగే అవకాశం ఉంటుందన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం ప్రస్తుతం బాగా పెరుగుతుందని తాజాగా నేపాల్‌లో కమ్యూనిస్టు విజయం అందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరే ఒక విధానాలను తూర్పారబట్టడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర గురుతరమైందన్నారు. పోరాటాలు, ఉద్యమాలు ద్వారానే హక్కుల సాధన సాధ్యపడుతుందని తెలిపారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కార్యదర్శి నివేదికను చదివి వినిపించగా ఏకగ్రీవంగా మహాసభ ఆమోదించింది. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.రవీంద్రనాథ్, బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ళ సుబ్బా రావు, విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్, సీపీఐ నగర కార్యదర్శి నల్లా రామారావు, పార్టీ కార్యవర్గ సభ్యులు తోకల ప్రసాద్, నక్కా కిషోర్, మందా దుర్గా ప్రసాద్, కె.సత్తిబాబు, వంగమూడి కొండలరావు, జుత్తుగ కుమార్, దేవ రాజేంద్ర ప్రసాద్, కె.మంగరాజు, ఎం.నాగమణి, నల్లా భ్రమరాంబ, పి.సత్యనారాయణ, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకోసం

రేపు ఏఐవైఎఫ్ రాష్ట్రవ్యాప్త ఆందోళనలు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలు అంశాలపై 19వ తేదీన రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం శనివారం గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో జరిగింది. లెనిన్‌బాబు మాట్లాడుతూ 13 జిల్లాల్లోని జిల్లా, మండల కేంద్రాల వద్ద ధర్నాలు, నిరసనలు చేపట్టాలన్నారు. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు దాటినా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. ఏపీ పునర్విభజన చట్టం-2014 చట్టంలో పొందుపరచిన విధంగా రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇవ్వాల్సి ఉందన్నారు. హోదా అంశాన్ని పక్కనపెట్టి ప్రత్యేక ప్యాకేజీలంటూ ప్రజలను బీజేపీ-టీడీపీలు మభ్య పెట్టాయన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో నిధులు సరిగ్గా ఇవ్వలేదన్నారు. సమస్యలపై ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నిరసనలు చేపట్టాలని నిర్ణయించాయన్నారు. మార్చి 6వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగన్న, అధ్యక్షుడు ఎంపీ సుబ్బారావు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన వారు ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు చెడు అలవాట్లకు బానిసలై అసాంఘిక శక్తులుగా మారిపోతున్నారని ఆవేదన చెందారు. సమావేశంలో నాయకులు మోతుకూరి అరుణ్‌కుమార్, సాగర్, ప్రభాకర్, సుబ్బారావు, శేఖర్ పాల్గొన్నారు.

ఏపీని అన్నివిధాలా ఆదుకుంటాం



విశాలాంధ్ర-విశాఖ : ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారాన్ని అందించేం దుకు కేంద్రం సిద్ధంగా ఉందని, అన్ని విధాలా ఆదుకుంటుందని విశాఖ ఎంపీ కంభంపాటి హరి బాబు అన్నారు. శని వారం జీవీఎంసీ సమీ పంలోని రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జూట్ కార్పొరేషన్ జోనల్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రానికి అవసరమైన నిధులను కేంద్రం విడుదల చేసిందన్నారు. విభజన చట్టంలో ఉన్నవీ, లేనివి కూడా రాష్ట్రానికి అందిస్తూ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. చట్టంలో లేనివి కూడా అమలు చేస్తున్నామన్నారు. జాతీయ రహదారులకు రూ.7 లక్షల కోట్లు దేశ వ్యాప్తంగా కేటాయింపులు జరగగా, ఆంధ్రాకు రూ.లక్ష కోట్లు ఇచ్చిందని ఆయన తెలిపారు. పాస్‌పోర్టు జోనల్ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో అంశాలు పదేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా 4 ఏళ్లలోనే పూర్తి చేసిందన్నారు. కొన్ని పూర్తికావల్సి ఉందన్నారు. మిగిలిన అంశాలు కూడా త్వరగానే పూర్తిచేయడానికి కేంద్రం కృషి చేస్తుందన్నారు. విశాఖలో జూట్ జోనల్ కార్యాలయం కేంద్రం వల్లే ఏర్పడిందన్నారు. జూట్ ఉత్పత్తి, నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. దాని ద్వారా శిక్షణ పొందడానికి సహాయ సహకారాలు, ముద్రా రుణాలు అందిస్తామన్నారు. వర్షాధారిత వలసీ పంట శ్రీకాకుళం, విజయనగరంలో ఎక్కువగా పండు తుందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ వాడడం వల్ల పర్యావరణానికి హాని లేకుండా సులభంగా వస్తువులను తీసుకువెళ్లే వీలుంటుందన్నారు. ఏయూ వీసీ జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ మూడవ స్థానం దక్కించుకోవడం సంతోషదాయకమని. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 10 వేల మంది విద్యార్థులు, సిబ్బంది సహకారంతో క్లీన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దామన్నారు. జేసీఐ చైర్మన్ కె.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ కోల్‌కతాకు దూరం కావడంతో జోనల్ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో జూట్ కార్పొరేషన్ ఎండీ పాత్రుడు దాసుగుప్తా, జోనల్ మేనేజర్ సంతోష్ ఒబారే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు 64వ జన్మదిన వేడుకలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పలుచోట్ల రక్తదాన, వైద్య శిబిరాలతో పాటు ఇతర కార్యక్రమాలు నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేశారు.పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ట్విట్టర్‌లో ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి శు భాకాంక్షలు తెలిపారు. మంత్రులు, ఉన్నతాధికారులు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.మండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రులు హరీష్‌రావు, ఈటెల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్లానింగ్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ నిరంజన్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీజీపీ మహేందర్‌రెడ్డిలు కేసీఆర్‌ను కలిసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. రాజకీయ, వ్యాపార, వాణిజ్య, టీఆర్ఎస్ నాయకులు, యువజన, విద్యార్థి, కార్మిక కళారంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ప్రగతి భవన్‌కు క్యూకట్టారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పాల్గొని కేక్‌ను కట్ చేశారు.మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జలవిహార్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎంపీ కవిత పాల్గొని కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో మహిళలు, స్థానిక నేతలు హాజరయ్యారు. తన తండ్రి సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా హ్యాపీ బర్త్‌డే డియర్ ఫాదర్ అంటూ నిజామాబాద్ ఎంపీ కవిత ట్వీట్ చేశారు. మీ అనుచరురాలిగా ఉండటం గర్వకారణమని, మీ కూతురుగా పుట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానని కవిత పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని హ్యాపీ బర్త్‌డే డాడ్ అంటూ ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు ట్వీట్ చేశారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. తన తండ్రిపై ఆయన చిన్న కవితను తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశాడు.

ప్రజల తలసరి ఆదాయం పెంచేలా ప్రణాళిక

ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆర్థిక వృద్ధి రేటుకనుగుణంగా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేవిధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామ కృష్ణుడు అధికారులకు సూచించారు. 2017-18కు సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే తయారీపై శనివారం ప్రణాళిక శాఖాధికారులతో విజయవాడలోని తన నివాసంలో సమీక్షించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధి రేటు బాగుందని, పరిశ్రమల వృద్ధి రేటు దేశవ్యాప్తంగా మందగించిందని రాష్ట్రంలో కూడా ఆశించిన స్థాయిలో వృద్ధి రేటు సాధించలేక పోయామని అధికారులు మంత్రికి తెలియజేశారు.

సర్వీస్ సెక్టార్‌లో వృద్ధి రేటు ఆశాజనకంగా ఉన్నదని, భారీ, మధ్యతరహా పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకురావడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. మధ్య, చిన్న మరియు సూక్ష్మ తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రోత్సా హకాలు ఇస్తుందన్నారు. ఈ తరహా పరిశ్రమల వల్ల ఎక్కువ ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవకాశాలు ఉన్నాయి. వీటిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తయారీ రంగంలో వృద్ధి పెరగాడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సర్వీస్ సెక్టార్ వృద్ధికి టూరిజం, ఐటీ అభివృద్ధిపై దృష్టి పెటాలని, రాష్ట్రంలో ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన బాగుందన్నారు. పట్టణీకరణ పెరిగితే సర్వీస్ సెక్టార్ వృద్ధి చెందుతుందని, పట్టణాభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి పక్కా గృహం కట్టించాలనే ఉద్దేశంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరుగు తున్నాయి. దీని వల్ల నిర్మాణ రంగానికి చెందిన పరిశ్రమలు అభివృద్ధి చెంది తద్వారా సేవా రంగాల్లో వృద్ధి రేటు పెరుగుతుందని మంత్రి తెలిపారు. ప్రజల ఆరోగ్య ఖర్చులు తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు మెరుగుపడే విధంగా కృషి చేయాలని అధికారు లకు సూచించారు. ఈ సమావేశంలో ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శులు సంజయ్ గుప్తా, చలపతిరావు, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సత్యనా రాయణ, ప్రణాళిక సంచాల కులు సుదర్శన్, ఆర్థిక గణాంక శాఖ సంచాలకులు యోగేశ్వర శాస్త్రి, ఆర్థిక వృద్ధి ప్రభుత్వ సలహా దారులు దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో సొరంగం


- టోక్యో ఉత్తర, దక్షిణ భాగాల మధ్య తగ్గిన 40 కిమీ దూరం
- జపాన్ పర్యటనలో సీఆర్‌డీఏ అధికారుల బృందం



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాజధాని అమరావతి ప్రాంతంలో అత్యుత్తమ రవాణా వ్యవస్థను రూపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత ప్రాధికారసంస్థ (ఏపీసీఆర్‌డీఏ) బృందం జపాన్‌లో పర్యటిస్తోంది. సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ నేతృత్వంలో పర్యటిస్తున్న ఈ బృందం టోక్యో ఉత్తర, దక్షిణ భాగాలను కలుపుతూ 15 కిలో మీటర్ల మేర సముద్రంలో నిర్మించిన టన్నెల్‌ను పరిశీలించింది. దీంతో సుమారు 40 కిలో మీటర్ల దూరం తగ్గిందని శ్రీధర్ తెలిపారు. సముద్రంలోని బ్రిడ్జిని నెక్స్‌కో నిప్పన్ ఎక్స్‌ప్రెస్ వే కంపెనీ నిర్మించింది. కవసాకి నుంచి సాభి వరకు 20 కిలో మీటర్ల టన్నెల్‌ను భూకంపాలలను తట్టుకునే విధంగా పటిష్టంగా నిర్మించారన్నారు. టన్నెల్ మార్గంలో ప్రయాణించిన తమ బృందం మధ్యలో టూరిస్ట్ సెంటర్‌గా అభివృద్ధి చెందిన ఐలాండ్‌ను కూడా సందర్శించినట్లు తెలిపారు. సొరంగ మార్గంలో ఐలాండ్ రూపకల్పనతో టన్నెల్‌కు గాలి, వెలుతురు సమృద్ధిగా లభించడమే కాకుండా టన్నెల్‌లో ప్రయాణించే వారు మధ్యలో ఐలాండ్‌కు వెళ్లి సేదతీరే అవకాశం ఉందని, ప్రయాణికుల కోసం షాపులు, రెస్టారెంట్ తదితర సౌకర్యాలు కూడా నెలకొల్పారన్నారు. 60 మీటర్ల లోతు సముద్రంలో సొరంగం ఉందని, టోక్యో నగరంలో కమ్యూనికేషన్ల సౌకర్యం కోసం 600 మీటర్లపైగా ఎత్తున నిర్మించిన టోక్యో స్కైట్రీని కూడా సందర్శించినట్లు తెలిపారు. 350 మీటర్లు, 450 మీటర్ల ఎత్తున ప్రత్యేక డెక్‌లను ఏర్పాటు చేసి స్కైట్రీ సెంటర్‌కు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. అక్కడ నుంచి టోక్యో నగరం మొత్తం వ్యూని చూసే అవకాశం ఉందని, సముద్ర రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో రెండో వైపులా 15 నుంచి 20 అంతస్తుల భవనాలను ఆకర్షణీయంగా నిర్మించినట్లు తెలిపారు. వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటుతోపాటు చక్కని గ్రీనరీ, బోటింగ్ పాయింట్ ఉన్నాయన్నారు. ఈ బృందంలో విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్, గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ జె నివాస్, గుంటూరు కమిషనర్ అనురాధ, గుంటూరు అర్బన్ ఎస్పీ విజయరావు, మున్సిపల్‌శాఖ కార్యదర్శి మమతా బాత్రా, సీఆర్‌డీఏ ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ చీఫ్ ప్లానర్ అరవింద్ తదితరులు ఉన్నారు.

కంది రైతుల కష్టాలు

కొనుగోలు చేసే వారులేక ఆందోళన




విశాలాంధ్ర బ్యూరో కర్నూలు: గిట్టుబాటు ధరలు లేక, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించినా అనేక ఆంక్షలు పెట్టడంతో న్యాయం జరగడం లేదని కందిరైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాది జిల్లాలో 64,605 హెక్టార్ల పంటను సాగుచేస్తే ఈ ఏడాది 80వేల హెక్టార్లు సాగు చేశారు. గత ఏడాదికంటే ఈ ఏడాది అధిక దిగుబడులు వచ్చాయి. మెట్ట ప్రాంత రైతులు ఎకరాలకు 5 క్వింటాళ్లు , బోరుబావులు, వ్యవసాయ బావుల కింద రైతులు 9 క్వింటాళ్ళ నుండి 12 క్వింటాళ్ళ వరకు దిగుబడి సాధించారు. ప్రభుత్వం క్వింటా రూ. 5,450 మద్దతు ప్రకటించినా ఒక్కో రైతు నుంచి ఎకరాకు 4 క్వింటాళ్ళు కొనుగోలుకు అంగీకరించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రైతు వద్ద 25 క్వింటాళ్ళ కందులు ఉండటంతో బహిరంగ మార్కెట్‌లో క్వింటాళ్ళ కందులు రూ. 3,500 నుంచి రూ.4,300 కొనుగోలు చేస్తుండ టంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం డీసీఎం ఎస్ ద్వారా కర్నూలు, ఆత్మకూరు,డోన్ ,బేతంచెర్ల, ప్యాపిలి, నందికొట్కూరు, నంద్యాల, ఆదోని, గోనెగండ్ల, పత్తికొండ మార్కెట్‌లలో కొనుగోలు చేస్తుండగా, రైతు ఉత్పత్తి సంఘాల ఆధ్వర్యంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలలో కొను గోలు చేస్తున్నారు. గతేడాది కందిపంట అధికంగా ఉన్న రైతులు ఈ ఏడాది పంటను ఏలా విక్రయించుకోవాలో అర్థంకాక తలమునకలవుతున్నారు. పాత కందులు క్వింటా రూ. 3,800 కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది 18,516 మంది రైతులు 3.61 లక్షల క్వింటాళ్ళ కంది పంట విక్ర యించగా, ప్రభుత్వం 169.80 కోట్లు చెల్లించింది. జిల్లా రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో వారిలో ఆశలు చిగురించాయి. ప్రస్తుతం రైతులకు టోకెన్లు మంజూ రు చేస్తున్నారు. ఆధార్‌కార్డు, ఈక్రాఫ్ బుకింగ్ పంట నమోదు ధృవీకరణ ,మీసేవా ద్వారా అడంగల్ నఖలు, బ్యాంకు ఖాతా, పొలం పాస్‌పుస్తకం, సంబంధిత ధృవీకరణ పత్రంపై ఎంఇఓ, ఎంఓఇఓ, ఎఇఓ ద్వారా పత్రం తీసుకుపోవాల్సి ఉంది. గతంలో పంటను ఎక్కడైనా అమ్ముకునే వీలుండేదని ఈ సారి అలా కాకుండా వారి కేటాయించిన ప్రాంతాలలోనే విక్రయించుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.ఈ పరిస్థితుల్లో పెట్టిన పెట్టుబడులు కూడా రాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే మొత్తం కందిపంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

క్వింటా రూ.7వేలు గిట్టుబాటు ధర కల్పించాలి..

గతేడాదికూడా కందిపంట రైతు తీవ్రంగా నష్టపోయారని, ఈ ఏడాది ప్రభుత్వం కంది పంటకు 7వేల రూపాయల మద్దతు ధర ప్రకటిం చాలని ఏపీ రైతుసంఘం డిమాండు చేస్తోంది. మార్క్‌ఫెడ్ ద్వారా కందులను కొను గోలు చేసిరైతులను ఆదుకోవాలని జగన్నాథం ప్రభు త్వాన్ని కోరారు.


- కె జగన్నాథం, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి

కూలీలు డబ్బులడుగుతున్నారు..



రెండు ఎకరాలలో కందిపంటను సాగుచేశానని ,ఎకరాకు 8వేల రూపాయలు ఖర్చు అయిందన్నారు. కందిపంట పురుగును ఎక్కువగా ఆకర్షించడం వల్ల నీళ్లమందులకే ఖర్చుపెట్టాల్సి వచ్చిందని. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిన విషయం గ్రామాలలో రైతులకు తెలియ దన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసినా రెండు నెలల పాటు డబ్బుకోసం ఎదురు చూడ వలసి వస్తుందన్నారు. గ్రామాలలో కూలీలకు, పెట్టుబడు లకు, పురుగుల మందులకు పెట్టిన పెట్టుబడుల వారు డబ్బులు అడుగుతారని అన్నారు. అందువల్ల ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం కందిని కొనుగోలు చేయాలన్నారు. - అల్లీసాహెబ్, రైతు,క్రిష్ణాపురం కోడుమూరు మండలం.

రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు



మూడెఎకరాల సాగుచేశా. రూ. 25వేలు పెట్టు బడులు పెట్టా. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించినా ఈ -క్రాప్‌లో నమోదు చేసిన వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. వేరుశనగలో అంతర్‌పంటగా వేసు కుంటాం. దీని వలన ఈ -క్రాప్‌లో నమోదయ్యే అవకాశం లేదు. దీంతో అధికారులు టోకెన్‌లు ఇవ్వలేదు.
-రామాంజనేయులు, రైతు కొసనపల్లె వెల్దుర్తి మండలం

సంపాదకీయం

సంగీతం

ప్రపంచం నాదమయం. ప్రపంచ ప్రజల భాష సంగీతం. మనసును కదిలించేది, మనిషిలో చైతన్యాన్ని రగిలించేది సంగీతం. శిశువుల్ని, పశువుల్ని, పాముల్ని కూడా సంగీతం పరవశింపజేస్తుందని మనవారు ఎప్పుడో చెప్పారు. చిరుగాలి సవ్వడిలో, అలల పరవళ్లలో, సెలయేరు గలగలల్లో, ఆకుల సుత్తిమెత్తని కదలికల్లో, చినుకుల చిటికెల్లో, గువ్వల కువకువల్లో.. అంతటా సంగీత ఝరులే. రాగతాళాలు, శ్రుతిలయలతో ప్రకృతే సంగీతశోభితమే. అందుకే సంగీతం సర్వకాలీనం, సర్వజనీనం. మనిషికి దుఃఖం వచ్చినా, ఆనందం కలిగినా గుండెచప్పుడు పెదాలపై ప్రతిధ్వనిస్తోంది. పనిపాటలవేళ కష్టాన్ని మరిపించే శక్తి పాటకే ఉంది. పొలం దున్నుతున్నా, నాటువేస్తున్నా, పంటకోస్తున్నా, కుప్పనూరుస్తున్నా, శ్రమజీవులకు హుషారునిస్తూ పని సాగించేది పాటే. 'నాగస్వరమూదితే నాగులకు నిద్ర/జోలల్లు పాడితే బాలలకు నిద్ర' అంటూ అమ్మపాడే లాలిపాటా వీనులవిందే. మనకు ప్రతినిత్యం బాత్‌రూమ్ భాగవతార్లు, వంటింటి కోకిలమ్మలు ఇంటింటా దర్శనమిస్తూనే ఉంటారు. సంగీతపు సొగసు, పాటపవరూ తెలుసుకాబట్టే ఆది నుంచి తెలుగునాట సంగీత ఝరులు ప్రవహిస్తూనే ఉన్నాయి. కొండవీడు మనదేరా, కొండపల్లి మనదేరా కాదనువాడుంటే కటకందాకా మనదేరా..అన్న పశువులకాపరి పాట, రాయల భుజబలాన్ని చాటి చెప్పేలా చేసింది. 'ఆంధ్రి'రాగం ఆంధ్రుల సంగీతానికి ఉన్న పూర్వ చరిత్రకు అద్దం పడుతున్నది. తొలితెలుగు రాజులైన శాతవాహనుల కాలంలోనే పామరులు పాటలతో మైమరచినట్లు 'గాథాసప్తశతి' గ్రంథం చాటుతున్నది. పల్లవరాజు మహేంద్రవర్మ వైణిక విద్వాంసుడే. చాళుక్యరాజైన భువనైకమల్ల సోమేశ్వరుడు ఏకంగా 'అభిలాషితార్థ చింతామణి' అనే సంగీత గ్రంథాన్ని వెలయించారు. విజయనగర రాజ్యంలో 'రాల్గరిగించు విమల గాంధర్వంబు విద్యమాకు' అని వరూధిని గర్వం ఒలకపోసింది. పాట ఎంతగా విస్తరించిందో పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో తెలిపారు. 'పదముల్ తుమ్మెద పదముల్ పర్వతాపదము లానంద పదములు, శంకరపదములు, నివాళి పదములు, వాలేశుపదములు, గొబ్బి పదములు, వెన్నెల పదములు సంజవర్ణన పరిగణవర్ణన పదములు' గురించి కడు వివరంగా చెప్పారు. తాళ్ళపాక అన్నమయ్య పదం, పోతనపద్యం, త్యాగరాజు కీర్తన, రామదాసు భజన తెలుగువారికి అయాచితంగా లభించిన అపూర్వమైన, అపురూపమైన వరాలని సగర్వంగా చెప్పుకుంటున్నాం.

మంచి సంగీతానికి ఉత్తమ సాహిత్యం తోడైతే అది అమృతతుల్యమే. అక్షరకృతిపొందిన అనంత సాహిత్యం.. కరచరణాల కదలికల్లో అపూర్వ నృత్యం.. కంటివిన్యాసాల్లో నవరసాల సమ్మిళిత అభినయం.. నాడులతీగలపై సుతారంగా కదలాడే నాదం, గానం, గాలి తరంగాల మీదుగా పల్లవించే గీతం, సంగీతం మనిషి సృజనకు మణిదీప్తులు. 'కావ్యములు గీతియును చిత్రకళయు నరులకబ్బిన దివ్యాంశలవనిమీద' అన్నారు రాయప్రోలు వారు. 'ఎవరికైనా ఆస్తి ఏముంటుంది?/ సంగీతంలో సప్తస్వరాలు/ సాహిత్యంలో యాభైరెండు అక్షరాలు' అంటూ ఆరుద్ర స్వరాక్షరాభిషేకం చేశారు. పిల్లనగ్రోవికి నిలువెల్లా గాయాలున్నా అది- మోవికి తాకితే గేయాలై రవిస్తుందన్నారు వేటూరి. వాయిద్యాలమీద నాట్యమాడే చేతివేళ్లు, తీగలపై కదలాడే వేలికొసలు, ఖాళీ వెదురుగొట్టాన్ని తాకే పెదాలు.. ఇవన్నీ సంగీత సృష్టికి సాధనాలే. చెలిచూపుల్లోని మౌనరాగాల్లోనూ మధురగానాలు వినిపిస్తాయి. నిజమే, స్పందించే హృదయం, అనుభూతించే మనస్సు, ఆస్వాదించే చెవులు ఉంటే ప్రతిశబ్దం సుస్వరమే అవుతుంది. కిన్నెరసాని నడకల సోయగాన్ని సంగీతమయం చేస్తే విశ్వనాథ.. వెంకి-నాయుడు బావ సరససల్లాపాల్ని సరాగాలు చేశాడు నండూరి. 'శిశువు చిత్రనిద్రలో ప్రాచీన స్మృతులూదే చప్పుడు.. ఒక లక్ష నక్షత్రాల మాటలు, ఒక కోటి జలపాతాల పాటలు' విన్నారు మహాకవి శ్రీశ్రీ. 'మావిగున్న కొమ్మను మధుమాసవేళ/ పల్లవము మెక్కి కోయిల పాడుటేల? పరుల తనియించుటకా?/ తన బాగు కొరకా?/ గానమొనరింపక బ్రతుకు గడవబోకా?' అన్నారు కృష్ణశాస్త్రి.

నేడు మనవారికి ద్వారం ఫిడేలన్నా, చిట్టిబాబు వీణన్నా, షేక్ చినమౌలానా సన్నాయన్నా, ఘంటసాల గానమన్నా ప్రాణం. వీనులకు విందుగా మనసుకు పసందుగావుండే సంగీతమేదైనా ఉత్తమమైనదే. అవధులెరుగనిది..ఎల్లలు ఒల్లనిది..భాషాభేదాలు లేనిది..ప్రాంతీయతలు తెలియనిది సంగీతం ఒక్కటే. 'ఈ ప్రపంచంలో దివ్యత్వంతో కూడినది ఒకటే ఉంది..సంగీతం!కల్లబొల్లి న్యాయాలకూ, ధర్మాలకూ, నీతులకూ, బోధలకూ అతీతమైంది.' అని కొడవటిగంటి పేర్కొన్నారు. తన సంగీతం ద్వారా మేఘాలను ద్రవింపజేసి పుడమితల్లి గుండెలపై చిరుజల్లులు కురిపిస్తానన్నారు మంగళంపల్లి బాలమురళీకృష్ణ. సంగీతం వల్ల పసివారి మెదళ్ళలో కొన్నికణాలు త్వరితంగా ఉత్పత్తి అయి వారి మెదడు అభివృద్ధి చెందుతుందని శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో గుర్తించారు. సంగీతానికి మెదళ్ళకు పదునుబెట్టే సామర్థ్యం కలిగిఉంటే మన సినీసంగీత చక్రవర్తులు వజ్రాన్ని వజ్రంతోనే కోయమన్నట్లు ఆ సంగీతం ద్వారానే మన యువతరం మెదళ్ళను మొద్దుబారుస్తున్నారు. సినీ సంగీతం పేరిట రణగొణధ్వనులూ, హింసధ్వని రాగాలు వినిపిస్తున్నారు. ఆడియోల వ్యాపారం జోరందుకుంది. పైరసీల వ్యవహారమూ ఊపందుకుంది. ఇటీవల హీరోలు, పెద్దలు, పైరసీల పురాణం విప్పిచెప్పి, దాన్ని అడ్డుకోవాలని, అభిమానులను అర్థించడమో, ఆజ్ఞాపించడమో చేస్తున్నారు. ప్రేక్షకుల చెవులు చిల్లులు పడుతున్నాయన్న చింత మాత్రం వారికి ఏకోశానా కలగడం లేదు. అరుపులు, కేకలు, డబ్బామోతలు ఇదేనా సంగీతం అంటే అని భవిష్యత్తుతరాల వారు ప్రశ్నించినా, సంగీతాన్ని చీదరించుకున్నా ఆశ్చర్యం చెందాల్సిన పనిలేదు. పాపమంటామో, పుణ్యమంటామో గానీ ఇదంతా నేటి సినీసంగీత స్రామాట్టులకే దక్కుతుంది. సంగీతమంటే రాగతాళ లయయుక్తమైన శబ్దం అనే భావంపోయి పట్టిసాద, గులకరాళ్ళ మోత అనే ఏవగింపు కలుగుతుంది. శబ్దకాలుష్యాన్ని మిగుల్చుతోంది. 'సంగీత సాహిత్య కళావిహీనం సాక్షాత్తు పశుపుచ్ఛ విషణహీనం' అంటారా, రాగంతాళం లయ లోపించిన సంగీతం కంటిచూపు, హృదయ స్పందన లేని మనిషిలాంటిదేనంటాను.

చురక

పంజాబ్ బ్యాంకులోన
ప్రజల డబ్బు కోట్లకొద్ది
వలవేసి కొల్లగొట్టె
వ్యాపారి మోడీ బుద్ధి

బ్యాంకులకు స్వేచ్ఛగ
బలిసినోల్లు కన్నం
రాజులాగ వేస్తున్నరు
రాలకుండ సున్నం

- వేల్పుల నారాయణ

భవిష్యత్తు సౌరశక్తిదే
భాగం 3

ఖనిజ ఇంధనాలు-బొగ్గు


మర్ల విజయ కుమార్

లక్షల, కోట్ల సంవత్సరాలలో భూగర్భంలో కలిసిపోయిన జీవరాశులలోని జీవపదార్థాలు, భూమి పొరలమధ్యన అధిక వత్తిడికీ, ఉష్ణోగ్రతలకు, కాలం గడిచిన కొద్దీ, కార్బన్ మిశ్రమాలుగా మారిపోతాయి. ఎందుకంటే, భూమిపై ఉన్న సమస్త జీవరాశీ కార్బన్ ఆధారిత మిశ్రమాలతో తయారయినవే. భూగర్భానికి చేరిన వృక్ష సంపద, ఖనిజ బొగ్గుగా మారి, భూమి పొరలలో చిక్కుకుని ఉంటుంది. పారిశ్రామిక విప్లవం కారణంగా, అధిక శక్తివంతమైన యంత్రాల వాడకం పెరగటంతో, బొగ్గుతో నడిచే ఆవిరియంత్రాలు ప్రపంచ వ్యాప్తమయ్యాయి. రైళ్ళు, ఓడలు, ఫ్యాక్టరీలూ సమస్తం ఆవిరియంత్రాలతో నడుస్తుండటంతో, ప్రపంచ వ్యాప్తంగా బొగ్గు నిక్షేపాలకై అన్వేషణ ప్రారంభమయింది. విద్యుత్ వాడకం పెరగటంతో, ఆవిరియంత్రాల స్థానంలో విద్యుత్ తో నడిచే యంత్రాల వాడకం విస్తృతమయ్యింది.

ఇక మనదేశం విషయానికి వస్తే, మనకు అపారమైన ఖనిజ బొగ్గు నిల్వలు నిక్షిప్తమై ఉన్నాయి. పెరుగుతున్న శక్తి అవసరాలను దృష్టిలో ఉంచుకుని లెక్కవేస్తే, మన ఖనిజబొగ్గు నిల్వలు మన దేశ శక్తి అవసరాలలో సగానికి పైగా రానున్న 25 ఏళ్ళలో తీర్చగలవని ప్రభుత్వం లెక్కలు చెప్తున్నాయి. అయితే, మనదేశంలో తయారయే విద్యుత్తు శక్తిలో 67% శాతం బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలనుండే లభిస్తోంది. రాబోయే కాలంలో, పునరుత్పాదక వనరుల నుండి, అందునా, సౌర, వాయు ఆధారిత విద్యుత్తు వాడకం పెరిగి, అవి మొత్తం శక్తి అవసరాలలో 28% వరకూ తీర్చగలిగినా, బొగ్గు ఆధారిత విద్యుత్తు మాత్రం సగానికి పైగా దేశ శక్తి అవసరాలను తీర్చటానికి ప్రధానమైన వనరుగా ఉపయోగపడనున్నది. ప్రస్తుతం మన దేశ బొగ్గు ఉత్పత్తి సాలీనా 60 కోట్ల టన్నులుగా ఉన్నది. ఈ బొగ్గు ప్రధానంగా విద్యుత్తు ఉత్పత్తికి, ఇతర పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడుతోంది. రానున్న 20 ఏళ్ళలో బొగ్గు వాడకం సాలీనా 150 కోట్ల టన్నులకు చేరవచ్చునని ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయి. అయితే, మన దేశంలో అపారమైన బొగ్గునిల్వలు ఉన్నా, మన దేశం ప్రపంచంలో మూడవ పెద్ద బొగ్గు ఉత్పత్తి దేశమైనా, మన బొగ్గు నాణ్యత తక్కువేనని చెప్పాలి. భూగర్భంలోనుండి వెలికి తీసిన బొగ్గులో ఉన్న లవణాలు, ఇసుక తదితర పదార్థాలను లెక్కవేసి, బొగ్గు నాణ్యతను నిర్ణయిస్తారు. నాసి రకం బొగ్గు కాల్చటం వలన విషపూరితమైన, పర్యావరణానికి హానిని కలిగించే కాలుష్య పదార్థాలు పెద్ద మోతాదులో విడుదల అవుతాయి. ఇటువంటి నాసిరకం బొగ్గును కాల్చటం ద్వారా వెలువడే కాలుష్య పదార్థాలను అరికట్టటం కోసం వాడే టెక్నాలజీలు అత్యంత ఖర్చుతో కూడుకున్నవి. ఆ అధిక ఖర్చును తప్పించుకునేందుకు, ప్రైవేటు విద్యుత్తు ఉత్పత్తిదారులు అడ్డగోలుగా విదేశాల నుండి నాణ్యమైన బొగ్గును దిగుమతి చేసుకుని, తమ లాభాలను పెంచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. దీనితో, ఆ భారం అంతా వాడకందారులపై పడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా కాలుష్య నివారణకు అనేక ఒప్పందాలు (క్యోటో, పారిస్ తదితరాలు) జరిగి, కొత్త కాలుష్య నిబంధనలు అమలులోకి వస్తున్నాయి. దానితో, ఇప్పుడున్న విద్యుత్తు స్టేషన్లలో, పరిశ్రమలలో, మరిన్ని సమర్థవంతమైన కాలుష్య నియంత్రణ పరికరాలను అమర్చవలసి రావటంతో, బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తి ఖర్చు పెరిగిపోయి, దాని కంటే, సౌర, వాయు విద్యుత్ ఉత్పాదన చవక అయ్యే పరిస్థితి నేడు తలెత్తింది. పైగా, ఈ సౌర, వాయు ఆధారిత విద్యుత్తు ఉత్పాదక యంత్రాల పెట్టుబడి ఖర్చు ఈ మధ్యకాలంలో గణనీయంగా పడిపోతుండటంతో, రాబోయే కాలంలో బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తికి ఆదరణ తగ్గిపోవచ్చును.

ఈనాడు పర్యావరణ కాలుష్యం మానవాళి మనుగడకు అతిపెద్ద ప్రమాదంగా పరిణమించింది. మన పరిశ్రమల పొగగొట్టాలనుండి వెలువడే కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫూరిక్, హైడ్రో క్లోరిక్ ఆమ్ల వాయువులు, ఆర్సెనిక్ వంటి విష పదార్థాలు పర్యావరణంలోని గాలిని, నీటిని, నేలను కలుషితం చేస్తున్నాయి. ముఖ్యంగా బొగ్గు ఆధారిత ఉష్ణోవిద్యుత్ కేంద్రాలలో పెద్దస్థాయిలో బొగ్గును నిల్వచేసి, బాయిలర్లలో మండించటం ద్వారా ఉత్పత్తి అయిన వేడితో నీటిని ఆవిరిగా మార్చి, ఆ ఆవిరి సహాయంతో టర్బయిన్లు నడపటం ద్వారా విద్యుత్తు ఉత్పత్తి జరుగుతుంది. కొన్ని వందల కిలోమీటర్ల దూరాన ఉన్న బొగ్గు గనులనుండి, గూడ్స్ రైళ్ళలో ఈబొగ్గును విద్యుత్ కేంద్రాలకు తరలించటంలో, దారిపొడవునా నేల, నీరు బొగ్గు నుండి వెలువడిన నుసితో కాలుష్యమవుతున్నాయి. చిన్నచిన్న కొండల సైజులో వేలటన్నుల బొగ్గును నిల్వ ఉంచిన కారణంగా, పవర్ ప్లాంటు పరిసరాలలోని గాలి, నేల, నీరు కలుషితమవుతాయి. ఇక బొగ్గులో ఉన్న సల్ఫర్, క్లోరీన్, ఆర్సెనిక్ తదితర పదార్థాలను బొగ్గుతోసహా బాయిలర్లలో కాల్చటం వలన కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డైఆక్సైడ్, హైడ్రో క్లోరిక్ ఆమ్ల పదార్థాలు, ఆర్సెనిక్, బోయిలర్ చిమ్నీలనుండి గాలిలోకి వెలువడుతున్నాయి. ఇక బొగ్గుకాల్చటం కారణంగా ఉత్పత్తి అయిన వేల టన్నుల బూడిద గాలిని, నేలను, నీటిని కలుషితం చేస్తోంది. పొగగొట్టాలనుండి వెలువడిన వాయువులు, ధూళి ఆకాశంలో మేఘాలతో కలిసి ఆమ్ల వర్షంగా కురియటంతో పంటలకూ, ముఖ్యంగా సమస్త జీవజాలానికి తీవ్రమైన నష్టం జరుగుతోన్నది.

ఈ కాలుష్యం ఒక్క ప్రాంతానికో, దేశానికో మాత్రమే పరిమితం కాదు. ఈవిధంగా వెలువడిన వ్యర్థాలు గాలిలోకి, నదులద్వారా సముద్రంలోకి చేరిన కారణంగా ప్రపంచం మొత్తానికి విస్తరిస్తోంది. ఈ కాలుష్యం నదులలోని, సముద్రాలలోని జీవరాశికి తీరని నష్టాన్ని కలగజేసి, ఆ జీవరాశులు అంతం అయ్యే పరిస్థితి ఈ కాలుష్యం కారణంగా ఏర్పడింది. ఆకారణంచేత, అంతర్జాతీయ ఒప్పందాలద్వారా కాలుష్యాన్ని అరికట్టటానికి ప్రపంచదేశాలు చర్యలు చేపట్టాయి. ఈ ఒప్పందాలపై సంతకాలు చేసిన మన దేశం వ్యర్థాల నియంత్రణకు చర్యలు చేపట్టవలసి ఉన్నది. విద్యుత్ కేంద్రాలనుండి వెలువడే వ్యర్థాలను, విష పదార్థాలను ఫిల్టరు చేసి, పర్యావరణంలోకి విడుదల కాకుండా చేయటం అనేది అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. బోయిలర్ల తరువాత ఈ పరికరాలను అమర్చి, ఫిల్టర్ల ద్వారా లభించిన వ్యర్థాలను ఇతర పారిశ్రామిక అవసరాలకు వాడటం జరుగుతుంది. మరొక టెక్నాలజీ సహాయంతో, గనులనుండి వెలికి తీసిన బొగ్గు నుండి అక్కడే వ్యర్థాలను వేరుచేసి, ఆవ్యర్థాలు పర్యావరణంలోకి వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చును. వీటినే వాషరీస్ అని సంబోధిస్తారు. ఇక బోయిలర్ల డిజైన్ లో మార్పులద్వారా, బొగ్గులోని శక్తిని వీలయినంత ఎక్కువగా వెలికి తీయగలిగితే, తక్కువ బొగ్గు కాల్చటం ద్వారా ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి చేయటానికి వీలు కలుగుతుంది. మరొక సమస్య ఏమిటంటే, నేడు బొగ్గులో ఉన్న ప్రతి వంద యూనిట్ల శక్తిలో 30 యూనిట్లు మాత్రమే విద్యుత్తుగా మారుతున్నది. అంటే బొగ్గులోని 70 శాతం శక్తి పర్యావరణంలోకి వృధాగా పోయి, వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలకు కారణమవుతున్నది. ఇక మన హై టెన్షన్ లైన్లలో 7, 8 శాతం విద్యుత్తు వృధా అవుతున్నది. అంటే, బొగ్గులోని ప్రతి వంద యూనిట్లలో 22 శాతం మాత్రమే విద్యుత్తుగా వాడకందార్లకు చేరుతోంది. ఇక మనం వాడే మోటార్ పంపు సెట్లు, ఫ్యానులు, ఇతర పరికరాలలో వృధా అయ్యే శక్తిని కూడా లెక్కవేస్తే, నిజానికి 10 శాతానికి కూడా మనకు అందు బాటులోకి వచ్చే శక్తి మించదు. "ఇంతహెచ్చు స్థాయిలో వ్యర్థాలను పర్యావరణంలోకి విడుదల చేస్తూ, 90 శాతం శక్తిని వృధాగా పోగొట్టుకుంటూ మనం ఇంకా ఎన్నాళ్ళు బొగ్గు కాల్చి, విద్యుత్తు తయారు చేసే టెక్నాలజీలపై ఆధారపడి ఉండగలము?" అనే ప్రశ్న నేడు ఆర్థిక, పర్యావరణ, ఇంజనీరింగ్ నిపుణులకు, విధాన నిర్ణేతలకు ముందున్న ప్రధాన సమస్య.


ఓపెన్ కాస్ట్ బొగ్గు గని

ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనటానికి అనేక ఇంజనీరింగ్ ఆవిష్కరణలు చేయబడుతున్నాయి. ఉదాహరణకు టర్బైన్ల, విద్యుత్ జనరేటర్ల సామర్థ్యాన్ని పెంచటంద్వారా వ్యర్థంగా పోయే శక్తిని అరికట్టవచ్చును. ఇక విద్యుత్తు కేంద్రాల టర్బైన్ల నుండి 120, 130 డిగ్రీల ఉష్ణోగ్రతలో వ్యర్థజలాలు బయటికి వస్తాయి. ఈ వ్యర్థజలాలలోని తక్కువ స్థాయి వేడి నీటిని ఇతర పారిశ్రామిక అవసరాలకు వాడగలిగితే, ఆశక్తి వృధాగా పోకుండా అరికట్టవచ్చును. అయితే, ఈ తక్కువ స్థాయి వేడినీటిని విద్యుత్తు కేంద్రంలోనే ఇతర అవసరాలకు వాడటంద్వారా ఆశక్తి వృధాగా పోకుండా అరికట్టగలిగిన టెక్నాలజీలు ఈనాడు విస్తృతంగా వాడకంలోకి వచ్చాయి. అసలు బాయిలర్లలో బొగ్గును కాల్చకుండా, ఆబొగ్గును గ్యాసుగా మార్చగలిగితే, వ్యర్థాల విడుదలను అరికట్ట వచ్చును, బొగ్గును కాల్చటం ద్వారా ఉత్పన్నమవుతూన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అయితే, ప్రస్తుతానికి ఈ బొగ్గును గ్యాసుగా మార్చే టెక్నాలజీలు చాలా ఖర్చుతో కూడుకున్నవి. మన దేశంలో లభించే బొగ్గులో అధిక శాతం తక్కువ నాణ్యత కలిగిఉండటం కారణాన, ఆ బొగ్గును గ్యాసుగా మార్చటంద్వారా, మన ఆబొగ్గు నిల్వలను ఎక్కువ సమర్థవంతంగా ఉపయోగించగలుగుతాము. బొగ్గు గనులలోని బొగ్గును వెలికి తీయకుండానే, భూగర్భంలోనే ఆబొగ్గును గ్యాసుగా మార్చే టెక్నాలజీలు అభివృద్ధి అవుతున్నాయి. ఈ టెక్నాలజీ సహాయంతో, బొగ్గునే కాకుండా, మురుగు నీటిని, ఇతర వ్యర్థ పదార్థాలను కూడా మనం గ్యాసుగా మార్చగలిగితే, పర్యావరణ కాలుష్యాన్ని చాలావరకూ తగ్గించగలుగుతాము. శుద్ధిచేయబడిన గ్యాసును మండించటం వలన, కాలుష్య పదార్థాలు విడుదల కావు. ఇక పరిశ్రమలనుండి విడుదల అయ్యే పొగను, అందునా బూడిదను, కార్బన్ డైఆక్సైడ్ ను మనం పట్టి, తిరిగి భూమి పొరలలో బంధించగలిగితే, వాటిద్వారా జరిగే కాలుష్యాన్ని అరికట్టవచ్చును. ఈ ప్రక్రియను "కార్బన్ సీక్వెస్ట్రేషన్" గా వ్యవహరిస్తారు. ఇది అత్యంత రిస్కుతో కూడుకున్నది. ఎందుకంటే, భూమి పొరలలో అత్యధిక వత్తిడితో కార్బన్ ను నింపితే, భూమిలో వత్తిడిపెరిగి, భూకంపాలు సంభవిస్తే, ఆ కార్బన్ మళ్ళీ పర్యావరణంలోకి విడుదల అయ్యే ప్రమాదమున్నది.అయితే, ఇప్పటి వరకూ చర్చించిన పద్ధతులన్నీ బొగ్గును కాల్చటానికి సంబంధించిన టెక్నాలజీలు. అసలు బొగ్గునుండి తయారైన గ్యాసును బాయిలర్లలో కాల్చకుండా, ఆ గ్యాసునుండి తిన్నగా విద్యుత్తును గాని ఉత్పత్తిచేయగలిగితే, బొగ్గులోని శక్తిలో అధిక భాగాన్ని మనం ఉపయోగంలోకి తేగలుగుతాము.

బొగ్గును కాల్చటంద్వారా శక్తిని విడుదలచేసే టెక్నాలజీలు 19, 20 శతాబ్దాలకు చెందినవి. ఈ 21వ శతాబ్దంలో ఒక సరికొత్త టెక్నాలజీ ఆవిష్కరణకు నాంది జరిగింది. వీటినే ఫ్యూయల్ సెల్స్ అని పిలుస్తారు. ఈ ఫ్యూయల్ సెల్స్ లో కదిలే భాగాలు గాని, మండే పదార్థాలుగాని ఏవీ ఉండవు. ఒక సాధారణ బ్యాటరీలాగా ఉండే ఈపరికరాలలో మీథేన్ వంటిటి గ్యాసులోని అణువులను విడదీయటంద్వారా విద్యుత్ శక్తిని పొందగలుగుతాము. ఈ క్రమంలో విద్యుత్తుతో బాటు, అధిక స్థాయిలో వేడిమి కూడా విడుదల అవుతుంది. ఈవేడిమితో ఆవిరిని తయారుచేసి, టర్బైన్లలో వాడితే, కాలుష్యాలు లేకుండా ఉష్ణ విద్యుత్తును పొందవచ్చును. ఇక కొన్ని రకాల ఫ్యూయల్ సెల్స్ లో హైడ్రోజన్ వాయువుకూడా తయారవుతుంది. ఈ హైడ్రోజన్ వాయువును ఇంజిన్లలో కాలిస్తే, నీరు విడుదల అవుతుంది. నాలుగు హైడ్రోజన్ అణువులు, రెండు ఆక్సిజన్ అణువులు సంయోగం చెందితే నీరు తయారు అవుతుంది. ఈక్రమంలో విడుదల అయిన శక్తిని మనం ఉపయోగించుకోగలుగుతాము. ఈవిధంగా మొత్తం బొగ్గులోని శక్తిలో 90 శాతం వరకూ మనం ఉపయోగంలోకి తేగలుగుతాము. ఈ సామర్థ్యాన్ని 100 శాతానికి అతిదగ్గరగా తీసుకు వచ్చి, అసలు వ్యర్థమే లేకుండా చేయగలిగిన పద్ధతులకోసం అన్వేషణ జరుగుతోన్నది. మీథేన్ వాయువులోని కార్బన్ ను నానో కార్బన్ ఆధారితమైన అనేక హైటెక్ వస్తువులను తయారుచేయటానికి వినియోగించవచ్చును. ఇక అప్పుడు మనం అసలు వ్యర్థాలు, కాలుష్యం లేకుండా విద్యుత్తు శక్తిని పొందగలుగుతాము. 2 మెగావాట్లవరకూ సామర్థ్యం కలిగిన ఫ్యూయల్ సెల్స్ ఈనాడు అమెరికా, యూరప్ మార్కెట్లలో ఉన్నాయికాని, వాటి ధర ప్రస్తుతానికి ఎక్కువగానే ఉన్నది.

మన దేశ శక్తి అవసరాలకు బొగ్గు అత్యంత కీలక మైనది. మనదేశంలోని అపారమైన బొగ్గునిల్వలను ఉపయోగించి, పాత టెక్నాలజీ సహాయంతో విద్యుత్తు ఇక ముందు కఠినమైన కాలుష్య నియంత్రణ చట్టాలకారణంగా విస్తృతంగా వాడటం సాధ్యం కాదు. మరొక ప్రక్కన, ఒక్క ఉష్ణ విద్యుత్ కేంద్రాలనుండే మనకు రోజులో 24 గంటలు, సంవత్సరంలో 365 రోజులు మన శక్తి అవసరాలలో 67 శాతానికి పైగా తీర్చగలుగుతున్నాము. సోలార్, పవన వనరుల నుండి లభించే విద్యుత్తు రోజులో ప్రతినిముషానికి మారిపోతుండటం కారణంగా, ముఖ్యంగా రాత్రిపూట, వర్షపు దినాలలో మనం ఉష్ణ విద్యుత్తు పైననే ఆధార పడక తప్పదు. ఇక వేసవిలో రిజర్వాయర్లలో నీరు అడుగంటే కారణంగా, జలవిద్యుత్తు లభించదు. ఒకవేళ లభించినా, అది అతి తక్కువ స్థాయిలోనే ఉంటుంది. పైగా మనదేశంలోని అపారమైన బొగ్గు నిల్వలు, నానాటికీ పెరుగుతున్న విద్యుత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకున్నా, మరొక 150 సంవత్సరాలు మన ప్రధాన వనరుగా ఉపయోగ పడగలవు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టుతూనే, మన పెరుగుతూన్న శక్తి అవసరాలను తీర్చటానికి ఇతరులపై ఆధారపడకుండా మనమే స్వయంసమృద్ధిగా తీర్చుకునే పద్ధతి ఈ నూతన టెక్నాలజీల ద్వారా మనం సాధించగలుగుతాము. వీటికోసం పరిశోధన, నూతన టెక్నాలజీల అభివృద్ధికి మన ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇవ్వగలిగితే, మన భవిష్యత్తు అంధకార బంధురం కాకుండా, దేశాభివృద్ధికి మార్గం సుగమం చేయగలుగుతాము.

(4వ భాగం వచ్చేఆదివారం)

- వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు. సెల్ : 09848933545

ప్రకృతి సాగు ఫలితాలు సరే! కౌలు రైతుల పరిస్థితేమిటి?

దాసరి అళ్వారస్వామి

ప్రకృతి సాగు శిక్షణా తరగతుల్లో పాలేకర్ వ్యాఖ్యలు వ్యవసాయ రంగ నిపుణులకు మనస్తాపం కలిగించాయి. ఆ సాగు విధానం కౌలు రైతులను భయపెడుతోంది. గతం పునరావృతమవుతుందేమోనని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

మనది వ్యవసాయ దేశం. దేశంలో 70 శాతం ప్రజలు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి వున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి వున్నారు. వ్యవసాయం లేకుండా వ్యవస్థ లేదు. మానవజాతికి మనుగడ లేదు. సేంద్రియ వ్యవసాయం మనకు అనాధిగా వస్తుంది. ఆ సాగువల్ల దిగుబడులు పెంచలేకపోయాం. ఉత్పత్తయ్యే ఆహార పదార్థాలు వినియోగానికి సరిపోయేవి కాక, పెరిగే జనాభాకు ధీటుగా ఆహార పదార్థాల ఉత్పత్తిని సేంద్రియ సాగు పెంచలేకపోయింది. ఆకలి చావులు కూడా చరిత్రలో కనిపిస్తాయి. కాలగమనంలో మార్పులు అనివార్యమయ్యాయి. సస్య విప్లవం మొదలైంది. రసాయనాలు రంగప్రవేశం జరిగింది. దిగుబడులు పెరిగాయి. ఆహార ధాన్యాల కొరత తీరింది. ఎగుమతి చేసే స్థాయికి పెరిగాము. అధిక రసాయనాల వాడకం అనర్థాలకు హేతువైంది. అవశేషాలు ఆహార పదార్థాలపై తిష్టవేశాయి. దిగుబడులు పెరిగిన దామాషాతోనే అనారోగ్యాలు పెరిగాయి. రైతులకు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ప్రత్యామ్నాయంగా సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించక తప్పలేదు. సేంద్రియ ఆధారిత పంటలవల్ల ప్రజల ఆరోగ్యం కుదుటపడుతుంది. రైతుకు పెట్టుబడి తగ్గుతుంది. ఆ దామాషాలో తొలిదశలో దిగుబడులు తగ్గుతున్నాయి. ఇలాంటి దశలో ప్రకృతి వ్యవసాయం విస్మరిస్తే ఎలాంటి ఫలితాలు ఎదురవుతాయో ఆలోచించాలి.

జనవరిలో నిర్వహించిన ప్రకృతిసాగు శిక్షణా తరగతుల సందర్భంగా సుభాష్ పాలేకర్ వ్యాఖ్యలు వ్యవసాయరంగ నిపుణులకు మింగుడు పడటంలేదు. మనస్తాపం కలిగించటమే కాదు. ఆగ్రహం కూడా తెప్పించాయి. పాలేకర్ మాటలకు నొచ్చుకొన్న వ్యవసాయ నిపుణులు నిరసన గళాలు వినిపించారు. అంచెలంచెలుగా అవి ముఖ్యమంత్రి దృష్టికి కూడా వెళ్ళినట్లు వార్తలు వెలువడ్డాయి. "దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, వ్యవసాయ పరిశోధనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలకోట్లు ఖర్చు చేస్తున్నాయి. వాటివల్ల రైతులకు పైసా ప్రయోజనం వుండటం లేదు. వాటిని మూసేస్తే ప్రభుత్వాలకు లక్షల కోట్లు మిగులుతాయి" అన్నది పాలేకర్ ప్రసంగాల సారాంశం. ఈ మాటలు వ్యవసాయరంగ నిపుణులకే కాదు చివరకు శాసనసభాపతి డా॥ కోడెల శివప్రసాద్‌కి కూడా రుచించలేదు. "పాలేకర్ వ్యాఖ్యలు సరికావు" అని సభాపతి కూడా అనటం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళడం గమనార్హం. వ్యవసాయ పరిశోధనల వల్ల ఫలితం వుండదు. అనే మాట పాలేకర్ ఇపుడు అనటమే కాదు, గతంలో తిరుపతి, కాకినాడ శిక్షణా తరగతుల్లో కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. అప్పటికీ ఇప్పటికీ కొంచెం వ్యత్యాసం వుంది. అవి రెండూ ప్రయివేటు కార్యక్రమాలు. ఇపుడు జరిగింది ప్రభుత్వ కార్యక్రమం. వారి వ్యాఖ్యలతో మనస్తాపానికి గురైన ఈ రాష్ట్ర వ్యవసాయరంగ నిపుణులు పాలేకర్‌ని సూటిగా ప్రశ్నించే ప్రయత్నం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌కి వచ్చి, ఆయన యిచ్చే ఉచిత సలహాలు, వారి సొంత రాష్ట్రమైన మహారాష్ట్రకు ఎందుకివ్వలేదు? అక్కడెందుకు అధిక దిగుబడి సాధించలేదు? అక్కడ రైతుల ఆత్మహత్యలను ఎందుకు అదుపు చేయలేదు? రైతుల ఆత్మహత్యల సంఖ్యలో మహారాష్ట్ర ముందుంది కదా?" అనే స్థాయికి ఇక్కడి వ్యవసాయ రంగ నిపుణులు పెరిగిన వాస్తవం. మీడియా సమావేశాలు కూడా ఏర్పాటు చేసి పాలేకర్ వ్యాఖ్యలపై నిరసన గళం వినిపించారు.

తిరుపతి, కాకినాడ మాట ఆయన చేసిన వ్యాఖ్యలకు పెద్దగా స్పందన లేకపోవచ్చు. ఇప్పుడిది ప్రభుత్వపరంగా చేపట్టిన కార్యక్రమం. ప్రకృతి వ్యవసాయ విశ్వవిద్యాలయ ఏర్పాటు బాధ్యతను ముఖ్యమంత్రి స్వయంగా పాలేకర్‌కి అప్పగించినపుడు, ఆ హోదాకు తగ్గట్టు సహనంతో, సమన్వయంగా మాట్లాడాలి. అందుకు భిన్నంగా దేశంలోని వ్యవసాయ పరిశోధనా వ్యవస్థనే కించపరచటం సమంజసంగా లేదని మేధావులు సైతం అభిప్రాయపడుతున్నారు. "ఒక్క ఆవు - 30 ఎకరాల సాగుతో పైసా ఖర్చులేకుండా ఆదాయం పొందవచ్చు. అన్నది పాలేకర్ సిద్ధాంతం. "ఎంత ఆదాయం? ఎంత కాలం ఆ ఆదాయం?" వాటికి కూడా పాలేకర్ సమాధానం చెప్పాల్సి వుంటుంది. ఎద్దు ఈనింది అంటే దూడను కట్టేయండి" అనే అర్భక స్థితిలో ఆంధ్రులు లేరు. కొంచెం ఆలోచనాపరులున్నారు. ప్రారంభదశలో ప్రకృతిసాగు దిగుబడులు తక్కువగా ఉంటాయని, క్రమేపీ పుంజుకుంటాయని పాలేకర్‌గారే వివరిస్తున్నారు. ఆయన రాసిన కొన్ని పుస్తకాలు పరిశీలిస్తే మొదటి ఏడాది 10 శాతం దిగుబడితో మొదలై, 8 సంవత్సరాలకు పూర్తిస్థాయి ఆహారధాన్యాల దిగుబడి సాధించవచ్చన్నది వాటి సారాంశం. ప్రస్తుతం ఖర్చునే మనం పరిగణనకు తీసుకోకూడదు. దిగుబడులు విషయం కూడా ఆలోచించాలి. ఒక్కసారిగా దిగుబడులు పడిపోతే ఆహార కొరత ఏర్పడదా? దిగుమతి చేసుకోవలసిన దుస్థితి దాపురించదా? ఆకలి చావులు సంభవించవా? పాలేకర్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు మనిషి ఆరోగ్యాన్ని పెంచేవి కావచ్చు. పెట్టుబడి లేనిదే కావచ్చు. అంతమాత్రాన దిగుబడులు కుప్పకూలి, ఆహార కొరత ఏర్పడితే పరిస్థితి ఏమిటి? అంతేకాదు. నిన్న మొన్నటి వరకు ఎంతో అభిమానించిన సేంద్రియ విధానాలు కూడా ఆయన దృష్టిలో లోపభూయిష్టంగా మారటం గమనార్హం. అలానే వానపాముల ఎరువు, సేంద్రియ సాగుకు, వర్మీ కంపోస్టు కేంద్రాల ఏర్పాటుకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్న దశలో, పాలేకర్ ఇప్పుడారెండు అర్థరహితాలనటం ప్రభుత్వ వర్గాలకే మింగుడు పడటం లేదు. అందుకే ముఖ్యమంత్రి కూడా "ఇతరులు చేసేది మంచిది కాదు" అనలేం అని అన్నారు.

కౌలు రైతు పరిస్థితి ఏమిటి?

కౌలు రైతుల ఆధారంగానే నేడు వ్యవసాయం కొనసాగుతోంది. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల వరిధాన్యం కౌలుగా చెల్లించే కౌలు రైతులున్నారు. అలాంటిచోట ప్రకృతి వ్యవసాయం ప్రారంభిస్తే, దిగుబడి తగ్గితే ఆ కౌలుదారు ఆసామికి కౌలు ఎలా చెల్లించాలి? ప్రకృతి వ్యవసాయంలో ఎక్కువ కౌలు చెల్లించటం సాధ్యమా? సాగుకు దూరంగా జరగాల్సిన దుస్థితి కౌలుదారుకు దాపురించదా? కౌలుదారులు లేకుండా సొంతదారులు సాగును కొనసాగించటం సాధ్యమా? ఒక్క వరి ధాన్యం విషయంలోనే కాదు, ఆహార పంటలన్నింటి విషయం ఇంచుమించుగా ఇంతే! వెంటనే ఫలితాన్ని ఆశించని తోటల పెంపకంలో ప్రకృతిసాగు ఉపయోగకారి కావచ్చు. ఆహార ధాన్యాల సాగు విషయంలో ఒక్కసారిగా ప్రకృతి సేద్యం అమలు అసాధ్యం. క్రమక్రమంగా రైతులను ఆవైపుకు మళ్లించటం అవసరం.

- వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు, సెల్ : 9393818199

ఐ-మెయిల్

రంగురాళ్లు అమ్ముకునేవాడికి 11 వేలకోట్లు ఎలా ఇచ్చారు.?

ప్రజలు కష్టపడి సంపాదించుకున్న రూపాయి రూపాయి భవిష్యత్ అవసరాల కొరకు బ్యాంకులో దాచిపెట్టుకుంటారు. అయితే ఈ రకంగా దాచిన ప్రజల డబ్బును గద్దల్లా కొంతమంది తన్నుకుపోతున్న పరిస్థితి నేడు నెలకొని వుంది. నిన్ననే మా ఇంటిపక్కవాళ్ళు 50 వేలు కావాలని బ్యాంకుకి వెళ్లగా అంతలేదు పదివేలు న్నాయి తీసు కెళ్లండి అన్నారు. మనడబ్బు మన అవసరాల కొరకు ఇవ్వకుండా ఇంక బ్యాంకులు ఎందుకు? బ్యాంకింగ్ వ్యవస్థ ఇంతగా దిగజారటానికి తయారుకావటానికి ఏమిటి కారణాలు? మరి ఈ రోజు ఒకరంగురాళ్లు అమ్ముకునే నీరవ్ మోడీ అనే ఒక మోసకారి పంజాబ్ నేషనల్ బ్యాంకులో 11,346 కోట్లరూపాయలు తీసుకుని దేశం వదలి పారిపోయాడంటే ఎవరు బాధ్యత వహించాలి? ఒక సామన్యుడు తను దాచి పెట్టు కున్న డబ్బు అడిగితే ఇవ్వని బ్యాంకు వారు ఒక రంగురాళ్ళ వ్యాపారికి ఎలా ఇచ్చారు ? ఇం దులో బ్యాంకు అధికారుల పాత్రవున్నది. కమీ షన్స్ తీసుకుని బ్యాంకులను దివాళా తీయిస్తున్న అధికారుల ఆస్తులనుకూడా జప్తు చెయ్యాలి. అంతేకాదు జేబు దొంగల ఫోటోలను బస్టాండ్స్, రైల్వేస్టేషన్స్‌లో పెట్టినట్లుగా బ్యాంకుల్లో వేలకోట్లు తీసుకున్న వారి ఫోటోలను, వారికి సహకరిం చిన అధికారుల ఫోటోలను బస్టాండ్స్, రైల్వేస్టేషన్స్‌లో పెట్టాలి. బ్యాంకుల దోపిడీకి అంతులేదా? అందుకే తమ అవసరాలకు అడిగినప్పుడు బ్యాంకు ఇవ్వదని తెచ్చి ఇళ్ళలో పెట్టుకుంటున్నారు. కానీ పరిస్థి తిని అదుపు చేయాలి. కారకులపై కఠిన చర్యలు వుండాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య, ఏపీ హేతువాదసంఘం అధ్యక్షుడు



విశాలాంధ్ర

బతుకు
The Life

ఆదివారం
18 ఫిబ్రవరి 2018



ప్రతి మనిషికి ఓ అడ్రస్ ఉంటుంది. ఆయనకు మాత్రం హైదరాబాద్‌లోని మఖ్దూం భవనే చిరునామా. ప్రతి వ్యక్తికి ఓ తల్లి ఉంటుంది. ఆయనకు మాత్రం కన్నతల్లి, దత్తతతల్లి ఉన్నారు. వీరిద్దరికీ మించిన తల్లీ ఉంది.. అదే పార్టీ. భారత కమ్యూనిస్టు పార్టీనే తల్లిగా భావించి ఆమె సేవే జీవిత గమనం, గమ్యంగా ఎంచి ఐదు దశాబ్దాల పాటు సీపీఐ రాష్ట్ర సమితి కార్యాలయ బాధ్యతలకే జీవితాన్ని అంకితం చేసిన నిజమైన కామ్రేడ్ ఆయన. ఈ సుదీర్ఘకాలంలో ఎనిమిది మంది పార్టీ కార్యదర్శుల వద్ద తలలో నాల్కులా పనిచేసి శభాష్ అనిపించుకున్న కార్యదీక్ష ఆయన ప్రత్యేకత. పార్టీ ఎదుర్కొన్న ఒడుదొడుకులను, నేతల ఆవేశకావేశాలను, వ్యూహప్రతివ్యూహాలను దగ్గర్నుంచి చూసి.. అన్నింటినీ తన మదిలో, హృదిలో నిక్షిప్తం చేసుకున్న నిఖార్సయిన ఉద్యమ కార్యకర్త. ఆయనే ధూళిపాళ రామచంద్రరావు. 'నాకు పార్టీయే తల్లి. పార్టీయే సర్వస్వం. బతికున్నంతకాలం ఈ జీవితం పార్టీకే అంకితం' అంటూ ఎంతో తన్మయత్వంతో, అభిమానంతో, సగర్వంగా చెప్పకుంటారాయన. ఎనభైరెండేళ్ల వయస్సులోనూ, అదే చలాకీతనం, అదే కలుపుగోలుతనం.....వయసు రీత్యా పార్టీ కార్యాలయ కార్యదర్శి బాధ్యతలనుంచి తప్పకున్నా... మఖ్దూంభవన్‌కు అడుగులు వేయకుండా రోజు గడవని నిబద్ధత ఆయనది. ఎప్పటికైనా ఎర్రజెండా నీడలోనే కార్మిక, శ్రామిక కష్టాలు తీరుతాయనీ, అవినీతిరహిత, లౌకికభారతం వర్ధిల్లుతుందన్న విశ్వాసంతో ఎదురుచూస్తున్న కమ్యూనిస్టు భీష్మాచార్యుడాయన. ఈ ఆదివారం 'బతుకు'లో ఆయన జీవిత, పార్టీ ప్రస్థానం ఆయన మాటల్లోనే...

పార్టీయే ఆయన ప్రపంచం

పార్టీకి పట్టుగొమ్మలా !

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం అప్పట్లో కమ్యూనిస్టు పార్టీకి మంచి పట్టుకొమ్మలా ఉండేది. యువ మేధావులు, న్యాయవాదులు, విద్యావంతులు, డాక్టర్లు మొదలైన వర్గాల వారు పార్టీపట్ల సదభిప్రాయం, గౌరవం కలిగి ఉండేవారు. పార్టీ కార్యక్రమాలకు సహకరించేవారు. అప్పటికే జిల్లా వ్యాప్తంగా పేరొందిన డాక్టర్ చెలికాని రామారావుగారు 1952లో కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో కమ్యూనిస్టు అభ్యర్థిగా గెలుపొందారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొసలికంటి తిరుమలరావు, ఇతర పార్టీలనుంచి పోటీచేసిన మహర్షి బులుసు సాంబమూర్తి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌లను ఆ ఎన్నికల్లో ఆయన ఓడించారు. నేను రామచంద్రపురంలో ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్న రోజులవి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలవి. అప్పుడు పార్టీ ఎంత బలంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఆ ఎన్నికల్లోనే అమలాపురం రిజర్వుడు పార్లమెంటరీ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా కానేటి మోహనరావుగారు గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క గోదావరి జిల్లాలోనే సీపీఐ తరపున ఐదుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయినట్లు నాకు గుర్తు. ఇటువంటి వాతావరణంలో నేను పార్టీపట్ల ఆకర్షితుడనయ్యాను. ఆనాడు కమ్యూనిస్టులు ప్రజలకోసం, ప్రజాసమస్యల పరిష్కారం కోసం, భూస్వామ్య పెత్తందారీ అమానుషత్వాలపై తిరుగుబాటులో వారు చూపిన త్యాగాలు, వీరగాథలు, వారిలోని సామాజిక స్పృహ నన్నెంతగానో ఆకర్షించాయి. నామీద బలంగా ప్రభావం చూపాయి. రోజూ ఉదయం పార్టీ కార్యాలయానికి వెళుతుండేవాడిని. అలా పార్టీ ఆఫీసువైపు తొంగిచూడ్డం ఒక అలవాటుగా మారిపోయింది. అలా అప్పటి పార్టీ నాయకులు జె.బి. ఆనంద్, పెదపాటి వెంకట్రావు, డి.వి.ఎన్. శర్మ వంటి వారితో పరిచయమూ ఏర్పడింది. అప్పటికే పెదపాటి వెంకట్రావు జిల్లా పార్టీ నాయకులుగా ఉన్నారు. పార్టీ నిషేధ సమయంలో ఆయనను పోలీసులు చిత్రహింసలు పెట్టారు. ఆయన చాలా త్యాగాలు చేశారు. ఆయనను రోడ్డుమీద కొట్టుకుంటూ పోలీసులు తీసుకు వెళ్లిన ఘటనలున్నాయి. జె.బి. ఆనంద్‌గారు మేధావి. ఆనాటి పార్టీపై నిర్బంధం వల్ల ఆయన ఆంధ్రాయూనివర్సిటీలో ఎం.ఏ. పరీక్షలు కూడా రాయలేకపోయారు....

రాయలసీమ కరవు....యువజన సంఘం



వై.వి. కృష్ణారావు

1951-52 ప్రాంతాల్లో రాయలసీమలో తీవ్రమైన కరవు తలెత్తింది. అక్కడి ప్రజలను ఆదుకోవడానికి కమ్యూనిస్టు పార్టీ కామ్రేడ్ వై.వి.కృష్ణారావుగారి నాయకత్వాన కరవు నివారణ సంఘాన్ని ఏర్పాటు చేసింది. దానికి ఆయన కన్వీనర్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో నేను, సోదర కామ్రేడ్స్ దీక్షితులు, భానోజీరావు, తదితరులం.. జె.బి. ఆనంద్‌గారి నాయకత్వాన ఒక యువజన సంఘంగా ఏర్పడ్డాం. మాకున్న పరిమితమైన పరిచయాలతో శక్తి మేరకు విరాళాలు సేకరించి వై.వి. కృష్ణారావుగారికి మనీయార్డర్ ద్వారా పంపేవాళ్లం.

'రామచంద్రపురంలో స్కూల్‌ఫైనల్ (ఎస్.ఎస్.ఎల్.సి.) అయ్యాక నేను ఇంటర్ (1952-54) చదవడానికి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని సి.ఆర్.రెడ్డి కాలేజీలో చేరాను. కృష్ణాజిల్లా గుడివాడలో (1954-57) బి.ఏ., చదివాను. తరువాత ఎం.ఏ(లిట్) చదువుదామని నాగపూర్ యూనివర్సిటీలో చేరాను కానీ, అనారోగ్యంతో మధ్యలోనే తిరిగి వచ్చేశాను. నేను ఇంటర్ చదువుతున్నప్పుడే ధూళిపాళ పాపమ్మగారికి దత్తత వెళ్లాను. వారు పశ్చిమగోదావరి జిల్లా తణుకు దగ్గర మళ్లేశ్వరంలో ఉండేవారు. అసలు నేను రామచంద్రపురం శివారు గ్రామమైన నదురుబాదలో 17 సెప్టెంబరు 1935లో జన్మించాను. నాన్నపేరు తోపల్లి వెంకట్రావు, అమ్మ పేరు సూరమ్మ. స్కూల్‌ఫైనల్ వరకూ నా చదువంతా రామచంద్రపురంలోనే సాగింది. నేను ఇంటర్ చదువుతున్నప్పుడే పాపమ్మగారు అంటే నా దత్తత తల్లిగారు తన మేనగోడలు హేమలతతో నా పెళ్లి చేసేశారు. నా సొంత నాన్న వెంకట్రావుగారు రామచంద్రపురం, తరువాత బిక్కవోలులో స్కూలు టీచర్‌గా పనిచేశారు.

సనాతన కుటుంబం



'నిజానికి మాది ఇటు నాన్న వైపుగానీ, అటు దత్తత వారి వైపుగానీ సనాతన కుటుంబాలే. మడులు, ఆచారాలు ఎక్కువగా ఉండేవి. ఆ ప్రభావాన్నుంచి బయట పడడానికి నేను చాలా ఓర్పుగా నడచుకోవాల్సి వచ్చింది. త్యాగాలు చేయాల్సి వచ్చింది. దీనికి తోడు అప్పట్లో కులతత్వం బాగా ఉండేది. జనంలో సామాజిక స్పృహ కూడా బాగానే ఉండేది. అన్ని కులాలవారూ ప్రశ్నించడం నేర్చుకున్నారు. ప్రత్యేకించి తూర్పుగోదావరి జిల్లాలో భాష, కట్టుబాట్లు చాలా సౌమ్యంగా ఉండేవి. ఈ నేపథ్యంలో ఇక్కడ ఒక విషయం చెప్పాలి-వాస్తవానికి రామచంద్రపురంలోని కాంగ్రెస్ వారిలో చాలా మంచివారుండేవారు. ఎవరో ఒకళ్లిద్దరు మాత్రం పైకి ప్రేమ నటిస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తూండేవారు. కమ్యూనిస్టు వ్యతిరేక, పేదల అణచివేత చర్యలకు పాల్పడుతూండేవారు. అలాంటి ఒక దుర్మార్గ కాంగ్రెస్ నేతను ఒకరోజు కొందరు హత్య చేశారు. అప్పుడు జనం, స్వాతంత్ర్య యోధులు సహితం పండుగ చేసుకున్నారు. అప్పట్లో నాకిదంతా ఆశ్చర్యంగానూ, అయోమయంగానూ అనిపించింది. ఇప్పటికీ ఇది నాకు మరిచిపోలేని ఒక చేదు జ్ఞాపకం!

ఎంఏ మధ్యలో ఆపేసి మళ్లీ రామచంద్రాపురం వచ్చాను. మళ్లీ నా పాత స్నేహితులు, పాత కార్యక్రమాలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. ఖాళీగా ఉండకుండా జె.బి. ఆనంద్‌గారు నడుపుతున్న ట్యుటోరియల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాను. ఆయనకి అన్నివిధాలుగా సహకారం అందించేవాడిని. ఈ సమయంలో కమ్యూనిస్టుపార్టీ నాయకులు పెదపాటి వెంకట్రావుగారు ఓ రోజు ఆనంద్‌గారిని పిలిచి ఇలా అన్నారు: 'రామచంద్రరావు చురుకైన కుర్రాడు. మంచి కార్యకర్త అవుతాడు. ఆ కుర్రాడిని పార్టీకిగానీ, లేదా విజయవాడ విశాలాంధ్ర పత్రికకుగానీ వదిలిపెట్టు' అని చెప్పారు. ఇలా అప్పుడప్పుడు నా గురించి వారిద్దరి మధ్య చిన్నపాటి ఘర్షణ కూడా జరుగుతుండేవి. నన్ను పంపాలని వెంకట్రావుగారూ, అప్పుడేకాదు అని ఆనంద్‌గారూ సౌమ్యంగానే ఘర్షణ పడుతూండేవారు. ఒకరోజు నా సమక్షంలోనే ఇద్దరూ ఘర్షణపడ్డారు నా గురించి. 'నేను ఇంటికొచ్చి మాట్లాడుతాను' అని ఆనంద్‌గారు సర్దిచెప్పి పెదపాటివారిని పంపేశారు.

'నువ్వు పార్టీలో ఉంటావు. కానీ ఇప్పుడు సమయం కాదు. ప్రస్తుతం పార్టీలో అంతర్గత పోరు నడుస్తోంది. నా తరువాత ఈ ట్యూటోరియల్ నువ్వు నడుపుతావన్న స్వార్థం ఏ మాత్రం నాకు లేదు..... నీదా లేత వయస్సు. ఇప్పుడు వెళ్లడం అంతమంచిది కాదు..ఎందుకంటే రాజకీయాలనుంచి వెనక్కి పోకూడదు......కొంతకాలం అయ్యాక పంపుదాం అంటున్నాను....' అని నాకు ఆనంద్‌గారు వివరించారు. అలా కొంతకాలం గడిచింది.

పార్టీకి ఒక పెద్ద టర్నింగ్‌పాయింట్ అనిపించేలా 1962లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ 62 స్థానాల్లో గెలుపొందింది. కానీ ఆ సంతోషం ఎంతోకాలం లేదు. 1964 జూలై-ఆగస్టు ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. మనది మాతృ సంస్థ అన్నారు. సీపీఐ వైపు 32 మంది ఎం.ఎల్.ఏలు వచ్చారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా దక్కింది. ప్రతిపక్ష నాయకునిగా సీపీఐ నేత పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో కారు మాత్రం ఇవ్వలేదుగానీ, ఇతర హంగులన్నీ ఇచ్చారు. పార్టీ చీలిన సమయంలో కేంద్రంలో చంద్ర రాజేశ్వరరావు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. రాష్ట్ర సమితికి నీలం రాజశేఖర రెడ్డి కార్యదర్శిగా ఉన్నారు. సీపీఎంకి సుందరయ్యగారు రాష్ట్ర కార్యదర్శి అయ్యారు.

పార్టీకా....విశాలాంధ్రకా...?

పార్టీలో చీలిక వచ్చిన తరువాత 1964లోనే కేడర్‌లో చైతన్యం తీసుకురావడానికి, పార్టీ పునర్నిర్మాణానికి నీలం రాజశేఖరరెడ్డిగారు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు వచ్చి రామచంద్రపురంలో పార్టీ జనరల్‌బాడీ సమావేశం, బహిరంగ సభ నిర్వహించారు. 'ఈ క్లిష్ట పరిస్థితిలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలనీ, పార్టీని పునర్నిర్మించుకోవాలని వారు ఉద్బోధించారు. ఈ సమయంలోనే ఆనంద్‌గారి చొరవతో పెదపాటి వెంకట్రావుగారు నన్ను, డాక్టర్ చెలికాని రామారావుగారి ఇంటివద్దనున్న నీలం రాజశేఖర రెడ్డి, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు వద్దకు తీసికెళ్లి వారికి పరిచయం చేశారు. నా గురించి వారికి చెప్పారు. అప్పుడు రాజశేఖర రెడ్డిగారు: 'పెదపాటీ! మనకి నమ్మకస్తుడైన వాడు కావాలి. పార్టీ చీలిక కారణంగా స్టాఫ్‌లేరు. కొందరు అటువైపు వెళ్లిపోయారు' అన్నారు. పెదపాటివారూ, ఆనంద్‌గారూ నా గురించి చెప్పడంతో 'రామచంద్రరావుగారూ హైదరాబాద్ వస్తారా, లేదా విజవాడ విశాలాంధ్ర పత్రికకు వెళ్తారా? నా బహిరంగ సభ పూర్తయ్యేసరికి ఆలోచించుకుని ఏ విషయమూ చెప్పండి' అని రాజశేఖర రెడ్డిగారు నన్ను అడిగారు. అంతేకాదు-'విజయవాడలోని విశాంలాంధ్రలో అయితే ఒక సమయం, పనిగంటలు, సెలవులు ఉంటాయి. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం, లేదా పిల్లలమర్రివారి కార్యాలయంలో అయినా ఒక సమయం అంటూ ఉండదు. పనీ ఎక్కువే.. ఆలోచించుకోండి' అని కూడా వివరించారు. తరువాత నా విషయమై నీలంవారూ, పిల్లలమర్రివారూ తర్జనభర్జన పడ్డారు-పార్టీ ఆఫీసులో అయితే కుర్రాడు తట్టుకోగలడా అని. నేనయితే చివరికి పార్టీ ఆఫీసుకు వెళ్లడానికే నిర్ణయించుకున్నాను. ఆ విషయం వారికి చెప్పాను.

వారిద్దరూ హైదరాబాద్ వెళ్లిపోయారు ఒక వారం లోపునే నాకు యలమంచిలి చంద్రంగారి నుంచి లెటరు వచ్చింది-'మీరు హైదరాబాద్ ఎప్పుడు వస్తున్నారు?' అన్నది ఆ లెటరు సారాంశం. దాంతో నేను హైదరాబాద్ బయలుదేరాను. అప్పుడు రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కి టికెట్ 16 రూపాయాలు! అలా 20 సెప్టెంబరు 1964న హైదరాబాద్‌లోని పార్టీకార్యాలయంలో చేరాను. అప్పుడు చంద్రంగారు పార్టీ

(తరువాయి 7వ పేజీలో)

రాజబహదూర్ గౌడ్, మఖ్దూం గజల్స్...






ఇక రాజబహదూర్ గౌడ్‌గారి విషయానికొస్తే ఆయన చాలా సరదా మనిషి. అధికారికంగా ఆయన పార్టీకి సహాయ కార్యదర్శిగా ఉండేవారు. ఒకటిరెండు సందర్భాల్లో ఆయన యాక్టింగ్ సెక్రటరీగా పనిచేశారు. హైదరాబాద్ సిటీలో పార్టీ నిర్మాణానికి ఆయన చాలా కృషి చేశారనే చెప్పాలి. పార్లమెంట్ మాజీ సభ్యులు విఠల్‌రావుగారి మరణానంతరం సింగరేణి కాలరీస్ యూనియన్‌కు ఆయన పిసి ఇన్‌చార్జిగా ఉండేవారు. ఆ యూనియన్‌ని పటిష్టపరచడంలో చాలా శ్రమించారు. అలాగే మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్‌కి, ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌కు కూడా ఆయన పార్టీ తరపున ఇన్‌ఛార్జిగా ఉండేవారు. గౌడ్‌గారు రాష్ట్రపార్టీ కార్యాలయాన్ని ఎంతో హుందాగా నిర్వహించారు. ఆయనలో మంచి క్రియేటివిటీ ఉంది. తరువాత ఆయన సెంట్రల్ పార్టీ కార్యకలాపాలకు వెళ్లారు. నీలం రాజశేఖర రెడ్డిగారూ, రాజబహదూర్ గౌడ్‌గారు సిటీలోని ప్రసిద్ధ డాక్టర్లను పార్టీకి సానుభూతిపరులుగా, సహాయకులుగా తీసుకురావడంలో చాలా కృషిచేశారు. ఆ కృషి వల్ల ఆయా డాక్టర్లు పార్టీ వారికి ఫీజు లేకుండా వైద్యం అందించేవారు......


'గౌడ్‌గారు చాలా ఫాస్ట్‌గా రాసేవారు. బ్యాంక్ ఎంప్లాయీస్‌కి సంబంధించినదిగానీ, మెడికల్ ఎంప్లాయీస్‌కి సంబంధించినదిగానీ పదేసి పేజీలు ఇంగ్లీషులో వేగంగా రాసినా ఎక్కడా కొట్టివేతలు ఉండేవి కావు. అలా రాశాక నాకు పని అప్పజెప్పేవారు. నేను ఆ పని చేస్తూ అలసిపోతున్నానని ఆయన గ్రహిస్తే.. చాలు చాయ్ తాగుదాం రా అంటూ తీసుకెళ్లేవారు. అప్పుడు మఖ్దూం మొహియుద్దీన్‌గారు కూడా మాతో వచ్చేవారు. అప్పుడు పార్టీ కార్యాలయం ఇప్పటి ఏఐటీయూసీ భవన్ స్థలంలో ఉండేది. అక్కడికి దగ్గరలోనే కేఫే హిమాయత్ అన్న ఇరానీ హోటల్‌కి వెళ్లేవాళ్లం. అక్కడ బిస్కట్‌లు తిని, చాయ్ తాగుతూంటే, గౌడ్‌గారు, మఖ్దూంగారూ గజల్‌ను అందుకునేవారు. కాస్సేపు అక్కడో అందమైన ముషాయిరా సాగేది. ఇప్పుడు తలచుకుంటే నేనెంత అదృష్టవంతుడినో కదా అనిపిస్తుంటుంది. ఇక్కడ మఖ్దూం మొహియుద్దీన్ గురించి రెండు మాటలు-మఖ్దూంగారు చాలా సౌమ్యుడు. చాలా ఔన్నత్యం ఉన్న మనిషి. పాత ముస్లిం సంస్కృతికి ఆయన ప్రతీక. ఆయన మంచి కవి కూడా! అప్పట్లో ప్రముఖ హిందీనటి మీనాకుమారి అప్పుడప్పుడు పనిగట్టుకుని హైదరాబాద్ వచ్చి ఉర్దూహౌస్‌లో గజల్స్ ముషాయిరా ఇచ్చేది. గౌడ్‌గారు ఆ కార్యక్రమానికి వెళుతుండేవారు. పొద్దన్నే ఆఫీసుకు వచ్చి ఆ ముచ్చట్లు చెప్పేవారు. 'రాత్రి నిద్రలేదు....ఆఫీసు పని నువ్వు చూసుకో....మాట రానియ్యకు' అని చెప్పి గౌడ్‌గారు వెళ్లిపోయేవారు. ఆ ముషాయిరాలు దాదాపు రాత్రి పది గంటలకు ప్రారంభమయ్యేవట. ఆ తరువాత గానాభజానా....కావలసినంత సందడి....

తమ్మారెడ్డి మితభాషి



తమ్మారెడ్డి సత్యనారాయణగారి విషయానికొస్తే ఆయన చాలా మితభాషి. ఏదైనా సరే విశ్లేషణాత్మకంగా ఆలోచించేవారు. పార్టీ కార్యకలాపాలకు సంబంధించినంత వరకు ఎవరికి ఏ పని చెప్పాలో నిర్దిష్టంగా ఉండేవారు.. కపర్ది, విజయ్‌కుమార్‌ల మధ్య పని విభజన చేసి ఒక పద్ధతి ఏర్పాటు చేశారు. అప్పుడు గిరిప్రసాద్‌గారు సహాయ కార్యదర్శిగా ఉండేవారు. స్టాఫ్‌కి స్వేచ్ఛనిచ్చి పనిచేయించేవారు. ఇప్పుడున్న మఖ్దూం భవన్, ఏఐటీయూసీ భవన్ నిర్మాణాలకు తమ్మారెడ్డిగారు చాలా దోహదపడ్డారు. మఖ్దూం భవన్ పునాది రాయి దగ్గరనుంచి ఆయన ప్రతి విషయం పర్యవేక్షించేవారు. మఖ్దూం భవన్ నిర్మాణానికి అప్పట్లో ప్రముఖ ఆర్కిటెక్ట్ రతీలాల్ చుక్కావటీగారిని రాజబహదూర్ గౌడ్‌గారు పిలిపించారు. ఆయన అలహాబాద్ నుంచి విమానంలో వచ్చి భవన నిర్మాణంలో అప్పడు సూపర్ వైజర్‌గా ఉన్న యలమంచిలి చంద్రంగారికి తగిన సూచనలిచ్చి వెళుతూండేవారు. అలాగే అప్పట్లో ఎం.ఎల్.సి.గా ఉన్న కె.ఎల్. మహేంద్రగారు, భవన నిర్మాణానికి కావలసిన ఐరన్, సిమెంట్ కంట్రోలు ధరకు ఇప్పించి లక్షలాది రూపాయలు ఆదా చేయగలిగారు. అదేవిధంగా పశ్చిమ గోదావరి జిల్లా కామ్రేడ్స్ సహాయంతో తమ్మారెడ్డిగారు రాజమండ్రి రేవులో కలప తక్కువ ధరకు కొనిపించి భవన నిర్మాణంలో ఉపయోగించారు. మఖ్దూం భవన్‌లో లిఫ్ట్.. గౌడ్‌గారు, తమ్మారెడ్డిగార్ల విజ్ఞప్తి మేరకు సింగరేని కార్మికుల విరాళంతో ఏర్పాటయింది.

రాజశేఖరరెడ్డి గొప్ప సృజనాత్మక నేత



కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డిగారు గొప్ప సృజనాత్మకత ఉన్న వారు. ఒక పక్క పార్టీకి ఆస్తుల్ని, మరోపక్క పార్టీ కార్యకర్తల్ని బాగా పెంచారు. ఇప్పటికీ ఆ క్యాడర్ పార్టీకోసం నిబద్ధతతో పనిచేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అలా తయారైన వారిలో కె. నారాయణ, కె. రామకృష్ణలాంటి వారున్నారు. అలాగే ఢిల్లీలో పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ (పి.పి.హెచ్.)కి కూడా రాజశేఖర రెడ్డిగారు ఆస్తులను సమకూర్చి పెట్టారు. వీటన్నింటికీ మించి ఆయన మంచి కార్యనిర్వాహకుడు. నిరాడంబరుడు. ఆయన ఆఫీసుకే పరిమితం కాకుండా పార్టీని సామాన్య జనంలోకి తీసుకెళ్లడంలో చాలా కృషి చేశారు. ఎప్పుడూ ఎవర్నీ పరుషంగా మాట్లాడేవారు కాదు. నవ్వుతూ పలుకరించే వారు. నీలంవారి కుటుంబం దేశానికి ఒక రాష్ట్రపతిని, ఒక ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడిని, ఒక ప్రముఖ పార్లమెంటేరియన్ని, విద్యావంతులు, సమాజం అంటే గౌరవం ఉన్న సోదరసోదరీమణుల్ని ఇచ్చింది. నీలం సోదరులకు బావ అయిన తరిమెల నాగిరెడ్డిగారు పార్లమెంటులో మాట్లాడుతుంటే ఆయన వాగ్ధాటికి ఎవరూ నిలిచేవారు కాదు. మేము చదువుకునే రోజుల్లోనే ఆయనను సిల్వర్ వాయిస్ నాగిరెడ్డి అని పత్రికలు, విద్యావంతులు ప్రశంసించేవారు.

గిరిప్రసాద్ మంచి ఆర్గనైజర్



'తమ్మారెడ్డిగారి తరువాత అప్పటిదాకా సహాయ కార్యదర్శిగా ఉన్న గిరిప్రసాద్‌గారు రాష్ట్రపార్టీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. సహాయ కార్యదర్శిగా ఉన్నప్పుడు గిరిగారు మన పార్టీ రాజకీయ ఖైదీల ఇబ్బందుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారు. వారితో నేనూ వెళ్లి ముషీరాబాద్ జైల్లోని మన కామ్రేడ్‌లను కలుసుకునే వాళ్లం. వారికి కావాల్సిన సామగ్రిని అందజేసేవాళ్లం. ఆయన మంచి డ్రైవర్ కూడా. బండి కుదుపు అనేది లేకుండా డ్రైవ్ చేసేవారు. ఆయన మంచి ఆర్గనైజర్. ఖమ్మంలో ఆయన 'లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్' పేరిట ఒక వేదికను చాలాకాలం సమర్థవంతంగా నిర్వహించారు. రాష్ట్రపార్టీ సహాయ కార్యదర్శిగా, కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఆయన పదిహేనవయేటకే పార్టీ సభ్యుడయ్యారు. తెలంగాణా సాయుధపోరాట కాలంలో ఆయన పార్టీ పనిపై అడవుల్లో, కొండల్లో తిరిగేవారు. ఆ సందర్భంలో కొండజాతి వారు ఆయనను ఉంగరాల ప్రసాద్ అనీ, గిరిప్రసాద్ అనీ పిలిచేవారు. అలా నల్లమల ప్రసాదరావు కాస్తా గిరిప్రసాద్‌గా సుపరిచితుడయ్యారు. ఆయనకు టీ, స్ట్రాంగ్ కాఫీ, గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్ పెట్టె ఉంటేచాలు గంటల తరబడి పార్టీపనిలో మునిగిపోయేవారు. అనారోగ్యాన్ని సహితం ఆయన లెక్కచేసేవారు కాదు. ఆయన మోకాలికి ఒక స్పెషలిస్టు ట్రీట్‌మెంటు చేసి మూడురోజులు కదలకుండా విశ్రాంతి అవసరం అని చెప్పినా సరే గిరిప్రసాద్‌గారు మరునాడే పార్టీపనిమీద ఊరు వెళ్లిపోయారు. ఆయన బాగా స్మోకింగ్ చేస్తూండడం వల్ల కూడా కొన్ని అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. అయినా సరే వాటిని ఆయన లెక్కచేసేవారు కాదు. ఆయనకి పార్టీపనే ముఖ్యం! ఎన్టీఆర్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఆయన తరచూ ప్రకటనలు చేసేవారు. ఈరోజు గిరిప్రసాద్‌గారు ఏం ప్రకటన చేస్తారో అని సాయంత్రం రేడియోల వద్ద జనం ఎదురు చూసిన సంఘటనలున్నాయి.....





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

అప్పుడు నేను యేకంగా - హనుమంతుడు ఒక్క గెంతున వారధి దాటి లంకాపట్నంలో పడ్డట్టు - హైకోర్టు ఫెడరల్ కోర్టు సుప్రీంకోర్టు అన్నీ ఒక్క లఘువులో దాటేసి ప్రివీ కౌన్సిలు బెంచి మీదే - మధ్యే తిష్టతి మాధవః అన్నట్టు - బైఠీయించొచ్చు: అప్పుడు శాంతం మాత్రం యేమంటుంది? శభాష్ అని మెచ్చుకుంటుంది:

రైలు నట్టడివిలోంచి పోతూంది. కీకారణ్యం, దండ కారణ్యం, సెలయేరు, యేటి మధ్యని చాపరాయి, విశ్వనాథవారి కిన్నెరసాని పాట జ్ఞాపకం వచ్చింది: "వనరులను దాటి - వన్నెల బయలుదాటి - తోటపులనుదాటి - దుర్గమాద్రులనుదాటి-పులుల యడుగులు నడుగులు కలుపుకొనుచు రాళ్ళవాగుదాటి పథాంతరములు దాటి"...

(నిన్నటి సంచిక తరువాయి)

పాట తల్చుకుంటే కళ్ళంట నీళ్ళొస్తున్నాయి. శాంత, నేను! పదేళ్ళయింది - కోరి వరించి పెళ్ళిచేసుకొని, కష్టం సుఖం అనుభవించాం. ఒకరి ప్రేమకు ఒకరం పాత్రులం అయాం. కొంగు కొంగూ పట్టి సరిగంగ స్నానాలు చేశాం - సంసారం ఈదుతున్నాం - ఈ జీవయాత్ర చేస్తున్నాం...ఈ ఇంగ్లండు యాత్ర మళ్ళీ రెండో తేనె వెన్నెల రోజుల్లాగు అనుభవించాలి.

థాణా స్టేషను దాటిపోయాం. ఇంకేముంది - మరో గంటకల్లా బొంబాయి - మరో అరగంటకల్లా - శాంతం ...... స్టీమరు "రూరిటేనియా"...చీకటి పడపోయింది. చీకటిలో హిందూ దేశం మాయం అయిపోయింది. నడిసముద్రం, వెచ్చనిగాలి, వసారా అంచున ఇనుపస్థంబాలని ఆనుకుని నిలబడ్డాం. శాంతం నా చేతిలో తన చెయ్యి వేసింది. ఆ చెమ్మగాలిలో - శాంతం తల వెంట్రుకలు నా మెడని పెనవేసుకున్నాయి. సముద్రం ప్రశాంతంగా కొల్లేరు సరస్సులాగుంది. మత్స్యకన్యలు తళుకు తళుకు మని మెరుస్తూ జలకం ఆడుకుంటున్నాయి. మా ప్రక్క నుంచి స్టీమరొకటి వెళ్ళింది.

వేరా జాన్స్టన్ ఎప్పుడూ పద్యం ఒకటి చదివేది. అదే జ్ఞాపకం వచ్చింది. శాంతం చెవిలో చెప్పా:

"నడిరేయి నడి సముద్రంలో, కారు చీకటిలో నౌకలు రెండు కలుసుకున్నాయి. అంధకారంలో రెండు నౌకలు కనుసైగ చేసుకున్నాయి. మిణుగరు దీపాలతో ఒకదాని నొకటి పలుకరించుకున్నాయి. ఒక్కక్షణమే రెప్పపాటే. తిరిగి చీకటిలో లీనమైపోయాయి."

శాంతం ఒక గీతం పాడింది:

"అనంత సముద్రం అట్టడుగున
ఆణిముత్యాల జోడు
సముద్రపుటొడ్డున ఆల్చిప్పల జత
కాలవాహినిలో పిల్లకెరటాల జంట
సూర్యరేఖలో రెపరెపలాడే రేణువుల రెండు
తామరకొలనున తలలూనే తెల్లకలువ ఎర్రకలువ
గగనపథాన్న మెరుపుల మెరిసే తారాద్వయం
ఈ విశ్వరూప ప్రపంచంలో - నువ్వూ నేనూ!"

2 వ భాగం

1 ఆమె

సూర్యోదయం, వెండి కిరణాల్లో పిల్లకెరటాలు తళుకులు మెరుస్తూ - పాలసముద్రం పొంగుతే - అందుమీద తేలుతూన్న మీగడ తరకలేమో అనిపించింది. ఆ మీగడ తరకల్లో నుంచి వెండిచేపలు అంతర్లేస్తున్నాయి. వెండిచచేపలని కబళించడానికి సముద్రపు పక్షులు కెరటాలమీద వలయాలు తిరుగుతున్నాయి. ప్రకృతి యెంత రమణీయంగా వుందో మానవుడంత అసహ్యంగా వున్నాడనిపించింది. మానవులందరిలోను మదనగోపాలం మరీ అధముడనిపించింది!

"లాసన్సుబే" దగ్గిర కారుని ఆపేడు మదనం. "సముద్ర స్నానం చేద్దామా?" అన్నాను.

"పరగడుపున నీటిమీద పైత్యపు టెండ వొంటికి



తగుల్తే నా వొళ్ళు నల్లబడుతుంది" అన్నాడు మదనం.

"పోనీలే! ఊట గెడ్డ వరకూ పరిగెత్తుదామా?" అన్నాను.

"కలక్టరు షికారు బయలుదేరే వేళ, అతను చూస్తే బాగుండదు" అన్నాడు.

"ఎర్రమంటి దిబ్బలు ఎక్కుదాం - ఏం" అన్నా.

"అబ్బే! సబుకలక్టరు హోదాకి తగిన వ్యాయామం కాదు. నా తెల్ల పంట్లాం, కట్టు కమీజు మట్టి అయిపోవూ?" అన్నాడు.

"సరేలే! 'స్కేండల్ పాయింటు' వరకూ నేను కారు నడపనా?" అన్నాను.

"ఆడది కారు నడుపుతూంటే మగవాడిని నేను కారులో కూర్చోడానికి చిన్నతనంగా వుంటుంది నాకు. అయినా - ఈ రోడ్డంట మిలిటరీ లారీలు చాలా తిరుగుతూంటాయి. మరి యేదేనా ప్రమాదం సంభవిస్తే, నాది సరికొత్త కారు కూడాను" అన్నాడు మదనం.

దాంతో నాకు విసుగేసి "అయితే - మాధవా మన రథంబు మరల నిమ్ము" అన్నాను. అతని గోటు చూసి నాకు అసహ్యం వేసింది! తను కారు నడిపిస్తున్నంతసేపు నన్ను రాసుకునే కూర్చున్నాడు. 'జోగి జోగి రాసుకుంటే బూడిదరాలిందన్న' శాస్త్రం జ్ఞాపకంవొచ్చి - నా మనసులో నవ్వుకొని - సరే ఇతని వాలకమేదో చూద్దాం అని - నేనూ దగ్గిరగానే కూర్చున్నాను.

కారు దిగి గుమ్మంలో అడుగు పెట్టాడో లేదో - మదనం మాలతిని హడావుడిగా పిలిచి "రేడియో విశేషాలేమిటే అక్కా?" అని అడిగేడు.

"ట్యునేసియాలో మాంటుగోమెరీ, రొమ్మెలని వెనక్కి తరిమేశాడనీ - బర్మాలో వేవెలు జయప్రదంగా వెనక్కి మళ్ళుతూన్నాడని - బి.బి.సీ. చెప్పాడు" అంది మాలతి.

"ఆ అబద్ధాలకేంగాని, సింగపూరు వాడేమన్నాడో ముందు చెబ్దు!" అన్నాడు ఆత్రంతో.

"సుభాషు మణిపురం కొండలుదాటేసి అస్సాంలో ప్రవేశించాడుట. జపానువాడ బర్మాలో వేవెల్లునీ అలెగ్జాండరునీ తిప్పి తిప్పికొట్టి ముప్పు తిప్పలూ పెట్టి - మూడు చెరువుల నీళ్ళూ తాగిస్తున్నాడట. ఫిలిప్పైన్సులో మెకార్థరుని పులుసులోకి ఎముకలు మిగులకుండా మరిస్తున్నారుట. ఇక - అమావాస్య లోపున చెన్నపట్నం, విశాఖపట్నం, పూరీ, కలకత్తా రేవుల్లో వక్కపట్టాన దిగి తిన్నగా సరాసరి ఢిల్లీ చేరుకుని - ఎర్రకోటలో సుభాషుని సింహాసనం యెక్కించి - పెరిస్కోలో హిట్లరుని కలుసుకుంటారుట జపానువాళ్ళు!" అంది మాలతి.

"శభాష్! సుభాష్‌కీ జై! హైల్ - హిట్లర్! ఢిల్లీఛలో!" అన్నాడు మదనం ఆవేశంతో.

"ఓరే - బాబూ! జపానువాడొస్తే మీ ఐ.సి.యస్. వాళ్ళకేం చిక్కుండదుగద?" అన్నారు పార్వతీశంగారు.

"మనకేం భయం నాన్నా? టోజోగాడు మన హార్బరులో దిగడంతోనే - సబుకలక్టరును నేనే ముందుగా వెళ్ళి వాడిమెళ్ళో ఖద్దరుదండలేసి - 'వందేమాతరం - జపాన్‌కీ జై' అని తలచును మీద సలాం చేసి, స్వాగతప్రతం చదువుతాను. దాంతో - వాడు ఆంధ్రరాష్ట్రాన్ని వెంటనే నిర్ణయంచేసి నన్నే గవర్నరుని చేస్తాడు. మిగతావాళ్ళు యెలాపోతే మనకేం!" అన్నాడు మదనం మంచి హుషారుగా.

"అవునుగాని - ఒరేబాబూ! నా పెన్షనురాళ్ళకేం దక్కారాదుకదా?" అన్నాడాయన భయపడుతూ.

"నేను గవర్నరు నవుతూంటే - మీ పెన్షనుకేం భయం నాన్నా! ల్యాండు అక్విజిషనులో మీకు మంచి అనుభవం వుంది గనుక - ఆంధ్రరాష్ట్రం రాజధాని నగరం కట్టించడానికి మిమ్మలినే స్పెషల్ కమిషనరుగా వెయ్యమని నేను టోజోగాడి చెవిలో వూదితేపోయె: దాంతో పాపారావుగాడు ఇక చచ్చి వూరుకుంటాడు!" అన్నాడు మదనం నవ్వుతూ మంచి ఉత్సాహంగా.

"తథాస్తు!" అన్నారు పార్వతీశంగారు పరువశులైపోయి.

...పొద్దున్న ఫలహారం మాలతి నేనూ ఇద్దెను పెసరట్టు తిన్నాం. మదనం టోస్టు ఆమ్లెట్టు తిన్నాడు. కాఫీ అందరం సేవించాం. మదనం స్నానం చేసి - ఖాకీ పంట్లాం - ఖాకీ బుష్‌కోటు - భుజంమీద రెండు నక్షత్రాలు - చేత మూరెడు మంచిగంధపు బెత్తం - నోట దిండిగల్లుచుట్టతో సహా కారెక్కి కచేరీకి వెళ్ళిపోయాడు. మాజీ డిప్టీ కలెక్టరుగారు లంకపొగాకు చుట్టని పూర్తిచేసుకుంటూ బంట్రోతు తెచ్చిన గెజిటులో కొత్త ఉద్యోగాలు - బదలాయింపులు - సెలవులు - చదువుకుని 'బాలవాక్యం బ్రహ్మవాక్యం' అన్నాడు - ఎందుకేనా మంచిదని కాబోలు. గెజిటులో కొత్తగా ప్రకటించిన "ల్యాండు అక్విజిషను నిబంధనల"ని ఒకసారి నిఘాతో పఠించి - అరంగుళం వరకూ కాల్చిన చుట్టను పారేయలేక పారేయలేక - చివరికి మనసుని గట్టిచేసుకుని - చుట్టపీకవంక నాలుగుసార్లు తేరపారచూసి రెండు నిట్టూర్పులు విడిచి - రెండుసార్లు వుమ్మి - చుట్టని పారేసి - వైశ్వదేవం చేసుకొనేముందు స్నానానికని - మడి పెరట్లోకి వెళ్ళిపోయాడు.

వంట బ్రాహ్మడు లోపలినుంచి కేకేస్తున్నాడు: "శివమ్మగారూ! వంకాయముక్కలు పెద్దవి తరిగేరు - ముద్దకేనా?"

"నీ యిల్లు బంగారంగానూ - వెంకయ్య! నీ కొచ్చి నన్నేళ్ళివరికి వచ్చాయోయ్? నేడో రేపో వాడు గవర్నరు కాబోతూంటే మదనానికి వంకాయముద్ద సయిస్తుందిటోయ్? మెంతిగుండ కారంకొట్టి, శనగబద్దేసి, తపేళాలో మొదటివార్చి, తరవాత బూర్లెమూకుడులో వేయించు. అబ్బాయికోసం కచేరీకి పంపించడానికి వెండి టిఫిన్ క్యారేజీ నేను సర్దుతానులే. ముక్కల్లో యేమాత్రం గంజి వుంచేసినట్టయితే - అబ్బాయి వేలువేసి ముట్టుకోడుసుమా!" అని వెంకయ్యగారికి వంట ఫర్మాయించి - పెనిమిటి స్నానానికి నీళ్ళు తొలిపేందుకని - మొక్కలపీట చేతబుచ్చుకొని - నీళ్ళపాకలో కెళ్ళిందావిడ.

మాలతీ, నేను లోపలి వసారాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇద్దరం ఒక్కతోటివాళ్ళం. తిరుక్కోయిలూర్ రాజమాణిక్యం పిళ్ళే దగ్గిర నేను భరత నాట్యం నేర్చుకున్న రెండేళ్ళూ - మాలతి కూడా నాతో నేర్చుకుంది. ఆ రోజుల్లో పార్వతీశంగారు రెవెన్యూ బోర్డు అసిస్టెంటు డిప్టీకమిషనరు చేస్తూండేవాడు. చెన్నపట్నంలో ప్రభాశంకరు - సజిమోవా నాట్య ప్రదర్శనం చూశాక, మరి నాకు భరతనాట్యం మీద మోజుపోయి నేర్చుకోవడం మానేశాను.

- ఇంకా వుంది.

అర్థవంతమైన అభ్యసనం అంటే ఏమిటి ?





1. ఒక ఉపాధ్యాయుడు తరగతిగదిలో వైవిధ్యాన్ని ఏవిధంగా పరిష్కరిస్తాడు ?
ఎ. విలువైన తేడాలను ఆమోదించడం ద్వారా.
బి. బోధనాశాస్త్ర వనరుగా, పిల్లల సామాజిక- సాంస్కృతిక నేపథ్యాన్ని ఉపయోగించడం ద్వారా.
సి. వివిధ బోధనా ప్రక్రియలకు స్థానం కల్పించడం ద్వారా.
డి. ప్రమాణీకృత సూచనలు ఇవ్వడం, పనితీరు నిర్ధారణకు, ఏకీకృత ప్రమాణాలు నిర్ధారించడం ద్వారా.
1. ఎ, బి, సి 2. ఎ, బి, సి, డి
3. ఎ, బి, డి 4. బి, సి, డి

2. ఒక ఉపాధ్యాయుడు తన తరగతి గదిలో ఈవిధంగా చెబుతాడు. ఫర్నిచర్‌కు పదునుగా ఉన్న అంచులను కాటన్ గుడ్డతో కప్పి "స్పర్శ, తెలుసుకోవడం" ద్వారా నోటీసు బోర్డులను, పుస్తకాలను గుర్తించమని కోరాడు. ఇది ఏ ప్రత్యేక రకానికి చెందిన అభ్యాసకుల కోసం ఉద్దేశించినది ?
1. సామాజికంగా వెనుకబడిన అభ్యాసకులకు.
2. దృష్టి-లోపం ఉన్న అభ్యాసకులకు.
3. వినికిడి-లోపం ఉన్న అభ్యాసకులకు.
4. అభ్యసన-లోపం ఉన్న అభ్యాసకులకు.

3. ప్రతిభావంతులైన విద్యార్థులను ఏ విద్యా కార్యక్రమాల ద్వారా ఉత్తమంగా తీర్చిదిద్దుతారు ?
1. అతని దూకుడు ప్రవర్తనను నియంత్రించడం
2. బహుమతులు, ప్రశంసల ద్వారా కనీస అభ్యసన ప్రమాణాలను పాటించడం
3. పునః స్మరణ ద్వారా తమ పాండిత్య జ్ఞానాన్ని ఉద్ఘాటించడం
4. వారి ఆలోచనలను గౌరవించడం, వారు విభిన్నంగా ఆలోచించేందుకు అవకాశం కల్పించడం

4. దిగువన పేర్కొన్న వ్యాఖ్యల్లో పాఠశాల విద్యార్థుల వైఫల్యానికి సంబంధించి ఏది నిజం ?
ఎ. కొన్ని కులాలు, వర్గాలకు చెందిన విద్యార్థులు తగిన సామర్థ్యాలు లేకపోవడం వల్ల వైఫల్యం చెందుతారు.
బి. తమ అభ్యసనానికి తగినవిధమైన రివార్డులు లేకపోవడం పాఠశాల విద్యార్థుల వైఫల్యానికి కారణం.
సి. బోధన తమకు అర్థవంతమయ్యే రీతిలో లేకపోవడం వల్ల విద్యార్థులు వైఫల్యం చెందుతారు.
డి. పిల్లల వ్యక్తిగత అవసరాలు, ఆసక్తులకు అనుగుణంగా పాఠశాల వ్యవస్థ లేకపోవడం వల్ల కూడా విద్యార్థులు వైఫల్యం చెందుతారు.
1. బి, డి 2. సి, డి
3. ఎ, బి 4. బి, సి

5. ఇద్దరు విద్యార్థులు ఒకే వ్యాసాన్ని చదివారు. ఆ వ్యాసానికి సంబంధించిన అర్థాన్ని ఇద్దరూ పరస్పరం భిన్నంగా వివరించారు. వారి గురించి ఈ కిందివాటిలో ఏది నిజం ?
1. అభ్యసనం అంటే కేవలం అర్థం రూపొందించడం మాత్రమే కాదు కనుక. వారి వ్యాఖ్యానం ఒకేవిధంగా ఉండటం సాధ్యం కాదు.
2. ఇది సాధ్యం కాదు. విద్యార్థులు మరోసారి వ్యాసాన్ని చదవాలి.
3. ఉపాధ్యాయుడు వ్యాసాన్ని వివరించలేదు కనుక, ఈవిధంగా చెప్పటం సహజమే.
4. విద్యార్థుల అభ్యసనపై వివిధ కారకాలు వేర్వేరు విధాలుగా ప్రభావం చూపుతాయి కనుక ఆవిధంగా చెప్పడం సహజమే.

6. జాతీయ పాఠ్యప్రణాళిక చట్రం-2005 ప్రకారం, అభ్యసనం ------, లక్షణం విషయంలో ----- ఉంటుంది.
1. చురుగ్గా : సరళంగా 2. చురుగ్గా : సామాజికంగా
3. నిష్క్రియ : సరళంగా 4. నిష్క్రియ : సామాజికంగా

7. విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించగలిగి, నేర్చుకోవడంలో ప్రభావశీలతను కలిగి ఉండాలంటే, ముఖ్యంగా ఉపాధ్యాయుడు చేయవలసినది ?
1. వ్యవస్థీకృత మార్గంలో ప్రస్తుత సమాచారాన్ని తేలిగ్గా జ్ఞప్తికి తెచ్చుకోవడానికి అనువుగా ఉండేలా చూడాలి.
2. విద్యార్థులు సాధించిన ప్రతి విజయానికి రివార్డులు అందించాలి.
3. తమ స్వీయ అభ్యసనాన్ని ఏవిధంగా పర్యవేక్షించాలో విద్యార్థులకు బోధించాలి.
4. చిన్న యూనిట్లు లేదా ఖండాలుగా సమాచారాన్ని అందించాలి.

8. విద్యార్థులు సమస్యా పరిష్కార సామర్థ్యాన్ని పొందాలని ఉపాధ్యాయుడు భావిస్తే, విద్యార్థులకు ఏవిధమైన కార్యకలాపాలను అప్పగించాలి ?
1. విచారించడం, వివేచన, నిర్ణయం తీసుకోవడం.
2. బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు కలిగిన నిర్మాణాత్మక వర్క్‌షీట్లు.
3. జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తుంచుకోవడం, సమగ్రత
4. అభ్యసనం, సాధన

9. తరగతి గదిలోని విద్యార్థుల సహజ భావనలను తెలుసుకోవడం...
1. ఉపాధ్యాయుడి ప్రణాళిక, బోధనను దెబ్బతీస్తుంది.
2. పనిభారం పెరగడం వల్ల ఉపాధ్యయుడి నైతికతను దెబ్బతీస్తుంది.
3. ఉపాధ్యాయుడికి ఏవిధమైన ఉపయోగం ఉండదు.
4. ఉపాధ్యాయుడు తన ప్రణాళికను మరింత అర్థవంతంగా రూపొందించుకునేందుకు సహాయపడుతుంది.

10. ఈ క్రింది కారకాల్లో ఏవి అభ్యసనాన్ని దెబ్బతీస్తాయి ?
ఎ. విద్యార్థి ప్రేరణ బి. విద్యార్థి పరిణతి
సి. బోధనా వ్యూహాలు డి. విద్యార్థి భౌతిక, మానసిక ఆరోగ్యం
1. ఎ, బి, సి 2. ఎ, బి, సి, డి
3. ఎ, బి 4. ఎ, సి

11. అర్థవంతమైన అభ్యసనం అంటే ఏమిటి ?
1. వ్యక్తిగతమైన అనుభవాల నుంచి చురుగ్గా జ్ఞాన నిర్మాణాల సృష్టి.
2. ఉద్దీపనం, ప్రతిస్పందన జతగా ఏర్పడటం, వాటి మధ్య సాంగత్యం పెంపొందించడం.
3. పెద్దవారిని అనుకరించడం, మరింత సమర్థవంతమైన సహచరులు.
4. ఇచ్చిన సమాచారాన్ని ఇష్టం లేకుండానే తీసుకోవడం.

ఏపీ టెట్
చైల్డ్ డెవలప్‌మెంట్
అండ్ పెడగాజి

12. ప్రభావశీల విద్యార్థి అభ్యసనానికి సంబంధించి ఈ క్రిందివాటిల్లో ఏది ఉపాధ్యాయుడు చేయవలసిన కార్యం కాదు ?
1. ప్రయత్నం ద్వారా విద్యార్థులు తమ అభ్యసనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ మెరుగుపరచుకోవడం ఎలాగో బోధించడం.
2. శాస్త్రీయ విధానంలో విద్యార్థులకు సమాచారాన్ని బదిలీ చేయడం.
3. తరగతి గదిలో విద్యార్థుల భావనలను తెలుసుకోవడం.
4. ఉన్నతశ్రేణి ప్రశ్నలకు విద్యార్థుల నుంచి స్పందన అవసరమవుతుంది.

13. ఈ క్రింది పేర్కొన్న అభివృద్ధి సిద్ధాంతాలలో ఏది నిజం కాదు?
1. అభివృద్ధి అనేది పరిమాణాత్మక విధానం. దీన్ని ఖచ్చితంగా అంచనా వేయవచ్చు.
2. పరిణితి, అభ్యసనంపై అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.
3. అనువంశికత, వాతావరణం మధ్య నెలకొనే సుస్థిర అన్యోన్యచర్య వల్ల అభివృద్ధి చోటుచేసుకుంటుంది.
4. ప్రతిశిశువు వివిధ అభివృద్ధి దశలను దాటుకుంటూ వస్తాడు. అయినప్పటికీ పిల్లల్లో పెద్దఎత్తున తేడాలు కన్పిస్తాయి.

14. ---------- మరియు --------- మధ్య ఉండే ప్రత్యేక అన్యోన్య ప్రక్రియల వల్ల అభివృద్ధికి సంబంధించిన వివిధ మార్గాలు, ఫలితాలు కలుగుతాయి.
1. అన్వేషణ : పోషణ 2. సవాళ్లు : పరిమితులు
2. అనువంశికత : వాతావరణం 4. సుస్థిరత : మార్పు

15. పాఠశాల, సామాజీకరణకు సంబంధించి ఈ క్రింది వాటిల్లో ఏది నిజం ?
1. సామాజికీకరణలో పాఠశాల మొట్టమొదటి ప్రాథమిక కారకం
2. సామాజికీకరణకు సంబంధించి పాఠశాల ఒక ముఖ్యమైన కారకం
3. సామాజికీకరణలో పాఠశాల పాత్ర శూన్యం.
4. సామాజికీకరణలో పాఠశాల పాత్ర చాలా స్వల్పం.

16. జీన్ పియాజే ప్రతిపాదించిన సంజ్ఞానాత్మక సిద్ధాంతం ప్రకారం ఈ క్రింది వ్యాఖ్యల్లో ఏది నిజం ?
1. దశల వరుసక్రమం, పిల్లల సాంస్కృతిక నేపథ్యాన్ని బట్టి మారుతుంటుంది.
2. వివిధ దశలగుండా ప్రగతి సాధించడానికి భిన్నంగా, సంజ్ఞానాత్మక అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగుతుందనేది పియాజె వాదన.
3. జ్ఞానాభివృద్ధిలో ఐదు విలక్షణ దశలను పియాజె ప్రతిపాదించాడు.
4. దశలు అనేవి సుస్థిరమైనవి. వీటిల్లో ఏ దశను తప్పించుకొని వెళ్లడానికి వీలుకాదు.

17. జీన్ పియాజె ప్రతిపాదించిన 'సంరక్షణ' భావనకు అర్థం...
1. ఇతరుల దృక్కోణాన్ని కూడా పరిగణలోకి తీసుకోవడం ముఖ్యమైన సంజ్ఞానాత్మక సామర్థ్యం.
2. వన్యప్రాణులను, అడవుల పరిరక్షణకు ఇది చాలా ముఖ్యం.
3. బాహ్యంగా కనిపించేది మార్పు చెందినా, కొన్ని భౌతిక లక్షణాలు యధాతథంగా ఉంటాయి.
4. సిద్ధాంతాలను పద్ధతి ప్రకారం పరీక్షించడం ద్వారా వాస్తవిక నిర్ణయానికి రావచ్చు.

18. హోవర్డ్ గార్డెనర్ ప్రతిపాదించిన బహుబుద్ధి సిద్ధాంతం నేపథ్యంలో ఈ క్రిందివాటిని సరిపోల్చండి.

బుద్ధిలో రకాలు	తుదిదశ
ఎ. సంగీతం	i. థెరపిస్ట్
బి. భాషాత్మకం	ii. కవి
సి. వ్యక్తంతర	iii. క్రీడాకారుడు
డి. స్థానిక సంధి	iv. వయొలిన్
వాద్యకారుడు	v. శిల్పకారుడు

(ఎ) (బి)
(సి) (డి)
(ఎ) (బి) (సి)
(డి)
1. iv ii v iii 2. v ii iv i
3. ii iv i v 4. iv ii i v

19. లెవ్ వైగొట్స్కీ ప్రకారం..
1. పిల్లలు భాషను language acquisition devise ద్వారా నేర్చుకుంటారు.
2. పెద్దలు, సహచరులతో జరిపే అన్యోన్య క్రియల ప్రభావం భాషాభివృద్ధిపై ఉండదు.
3. భాషాభివృద్ధి, మానవుల ఆలోచనా విధానాన్ని మార్చివేస్తుంది.
4. భాషాభివృద్ధిలో సంస్కృతి చాలా తక్కువ పాత్ర వహిస్తుంది.

20. లారెన్స్ కోల్‌బర్గ్ ప్రతిపాదించిన నైతిక తర్క సిద్ధాంతం అనేక కోణాల్లో విమర్శలకు గురయింది. ఈ విమర్శకు సంబంధించి ఈ క్రింద ఇచ్చిన వ్యాఖ్యల్లో ఏది నిజం ?
1. కోల్‌బర్గ్, పురుషులను నమూనాగా తీసుకొని అధ్యయనం చేసి తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.
2. ప్రతిదశ నైతిక తర్కానికి మద్దతుగా కోల్‌బర్గ్ సంక్లిష్టమైన స్పందనలను వివరించలేదు.
4. కోల్‌బర్గ్ అతీన సైద్ధాంతిక చట్రంలో, పియాజె పద్ధతులను నకలుగా వాడుకున్నాడు.
4. చిన్నపిల్లల స్పందనపై కోల్‌బర్గ్ సిద్ధాంతం దృష్టి పెట్టదు.

21. ఈ క్రిందివాటిల్లో ఏది అభ్యసన అంచనాను నొక్కి చెబుతుంది ?
1. ఇతరులతో సరిపోల్చడం ద్వారా ఉపాధ్యాయుడు, విద్యార్థిని అంచనా వేస్తాడు.
2. ఆలోచనా విధానంపై దృష్టి కేంద్రీకరించడంతోపాటు, విద్యార్థుల భావనాత్మక అవగాహనను కూడా ఉపాధ్యాయుడు అంచనా వేస్తాడు.
3. విద్యార్థుల ప్రతిస్పందనను 'ప్రమాణీకృత' స్పందనలతో సరిపోల్చడం ద్వారా ఉపాధ్యాయుడు విద్యార్థులను అంచనా వేస్తాడు.
4. పాఠ్యపుస్తకాలలో ఇచ్చిన సమాచారం ఆధారంగా ఉపాధ్యాయుడు విద్యార్థి ఆధారిత సమాచారాన్ని అంచనా వేస్తాడు.

22. 'శిశు కేంద్రంగా' సాగే విద్యాబోధన అనగా...
1. తరగతి గదిలో ఉపాధ్యాయుడు అన్ని రకాల అభ్యసనానికి నేతృత్వం వహించడం.
2. ఏం చేయాలన్న అంశంపై ఉపాధ్యాయుడు విద్యార్థులను ఆదేశించడం.
3. పిల్లల అనుభవాలు, వారి అభిప్రాయానికి ప్రాధాన్యతనివ్వడం.
4. పిల్లలు నిర్దేశిత సమాచారాన్ని అనుసరించే విధంగా చూడటం.

23. పియాజె, వైగోట్స్కీల భాష, ఆలోచనలను ఈ క్రింద పేర్కొన్న వ్యాఖ్యల్లో సరిగ్గా వివరించింది ఏది ?
1. పిల్లల ఆలోచనలనుంచే భాష ఉద్గమించిందని ఇద్దరూ నమ్మారు.
2. వైగోట్స్కీ ప్రకారం, ఆలోచన ముందు పుడుతుంది. అదే పియాజె ప్రకారం ఆలోచనపై భాష ప్రభావం చాలా అధికం.
3. పియాజె ప్రకారం ఆలోచన మొదటగా పుడుతుంది. వైగోట్స్కీ ప్రకారం ఆలోచనపై భాష ప్రభావం అధికం.
4. శిశువు భాషనుంచే ఆలోచన ఉద్భవించిందన్న అభిప్రాయాన్ని ఇద్దరూ వ్యక్తం చేశారు.

24. పాఠశాలలో ఏర్పాటుచేసిన విహారయాత్ర గురించి, తన మనుమరాలు తండ్రితో చేస్తున్న వాదనను విన్న ఆమె బామ్మ, "మంచిపిల్లలా వినయంగా ఎందుకు ఉండవు? పిల్లవాడిలాగా ప్రవర్తిస్తుంటే నిన్నెవరు చేసుకుంటారు " అన్నది. ఈ మాటలు ఈ క్రిందివాటిల్లో దేన్ని ప్రతిఫలిస్తున్నాయి ?
1. చిన్నపిల్లల పెంపకంలో కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు.
2. లింగ స్థిరత్వం
3. బాల, బాలికల లక్షణాలపై అంచలంచెల పద్ధతిలో ఆపాదించడం
4. లింగపరంగా బాలికను సరైన రీతిలో గుర్తించకపోవడం

25. అంచనాకు సంబంధించి ఈ క్రింది పేర్కొన్న వ్యాఖ్యల్లో ఏది నిజం?
ఎ. పిల్లలు తమలోని బలాలు, బలహీనతలను తెలుసుకునేందుకు అంచనా సహకరిస్తుంది.
బి. విద్యార్థుల మధ్య సరిపోలుస్తూ చేసే అంచనా అర్థవంతమవుతుంది.
సి. అంచనా కేవలం జ్ఞాపకశక్తిని మాత్రమే కాదు, అనువర్తనాన్ని అవగాహన చేసుకోవడానికి ఉపకరిస్తుంది.
డి. భయానికి, ఆందోళనకు కారణం కానట్లయితే అంచనా నిశ్చితమైనది కాదు.
1. ఎ, సి 2. బి, సి
3. ఎ, బి 4. బి, సి



26. నిర్బంధ విద్యాహక్కు చట్టం- 2009 ప్రకారం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు తప్పనిసరిగా చదవాల్సింది...
1. జీవన నైపుణ్యాలు నేర్పే వృత్తివిద్యా శిక్షణ కేంద్రాల్లో.
2. ఇంటివద్ద తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అవసరమైన మద్దతు ద్వారా.
3. వీరికోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయడం.
4. సమ్మిళిత విద్యావిధానంలో, వ్యక్తిగత అవసరాలను తీర్చే నిబంధనలను రూపొందించడం.

27. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లలు ఉన్న తరగతి గదిలో, ప్రభావశీల ఉపాధ్యాయుడు...
1. ఒకే ఆర్థిక నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థులను ఒకే సమూహంగా ఏర్పాటు చేస్తాడు.
2. అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు గట్టిగా కృషిచేసి, ఇతర విద్యార్థులను స్థాయికి ఎదిగేలా ప్రోత్సహిస్తాడు.
3. ఒక గ్రూపులో వ్యక్తిగత తేడాలను పరిష్కరించేందుకు వారి సంస్కృతీ పరిజ్ఞానంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తాడు.
4. సాంస్కృతిక నేపథ్యాన్ని పట్టించుకోకుండా, అందరు విద్యార్థులను ఒకేమాదిరిగా చూస్తారు.

28. క్రిందివాటిలో సంజ్ఞానాత్మక, ఉద్వేగాలకు సంబంధించి ఏది నిజం?
1. ఉద్వేగం సంజ్ఞానాత్మక ప్రభావం చూపుతుంది. కానీ సంజ్ఞానాత్మక ఉద్వేగాలపై ప్రభావం చూపదు.
2. సంజ్ఞానాత్మక, ఉద్వేగాలు ఒకదానితో ఒకటి కలిసిపోయి, పరస్పర ప్రభావాన్ని కలిగి ఉంటాయి.
3. సంజ్ఞానాత్మకత, ఉద్వేగం దేనికవే స్వతంత్రమైనవి.
4. సంజ్ఞానాత్మక ఉద్వేగాలపై ప్రభావం చూపుతుంది కానీ ఉద్వేగాలు, సంజ్ఞానాత్మకత ప్రభావాన్ని చూపవు.

29. సమ్మిళితమైన తరగతి గదిలో విభిన్న విద్యార్థులతో, సహకార అభ్యసన, సహచర- బోధన...
1. అనుసరించరాదు. విద్యార్థులను సామర్థ్యాలకు అనుగుణంగా గ్రూపులుగా విడగొట్టాలి.
2. సహచర విద్యార్థుల మధ్య పోలికను ప్రోత్సహిస్తుంది కనుక దీన్ని కొన్ని సమయాలలో మాత్రమే ఉపయోగించాలి.
3. దీన్ని నిరత్సాహపరచడమే కాదు, పోటీతత్వాన్ని పెంచాలి.
4. సహచరుల ఆమోదం కోసం చురుగ్గా ప్రోత్సహించాలి.

సమాధానాలు

1. 1	2. 2	3. 4	4. 2	5. 4	6. 2
7. 3	8. 1	9. 4	10. 2	11. 1	12. 2
13. 1	14. 3	15. 2	16. 4	17. 3	18. 4
19. 3	20. 1	21. 2	22. 3	23. 3	24. 3
25. 1	26. 4	27. 3	28. 2	29. 4	

మానవ వనరులను రక్షించుకుందాం

సామాజిక అభివృద్ధికి మానవ వనరులే కీలకం. మానవ వనరులు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. వాటిని సరైన, సమర్థవంతమైన పద్ధతిలో వినియోగించడంలో జపాన్ అగ్రస్థానంలో ఉంది. జపాన్ ఆర్థికాభివృద్ధిలో మానవవనరులు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పడానికి జపానీయులే నిదర్శనం.

కీలకమైన మానవవనరులు :

మానవవనరుల వినియోగంలో భారతదేశం అత్యంత నిర్లక్ష్య పూరితంగా వ్యవహరిస్తోంది. మానవవనరుల నిర్వహణలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అత్యంతావశ్యకం. పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా విద్యార్థుల నైపుణ్యతను, ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. అపార శక్తియుక్తులున్న మన యువత చదువు పూర్తయిన తర్వాత తగిన ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగంతో కాలక్షేపం చేస్తున్న వారు ఎంతమందో...

యువ ఓటర్లు :

తాజా ఓటర్ల జాబితాలో యువ ఓటర్ల సందడి బాగా కనిపిస్తోంది. 20-30 సంవత్సరాలు వయసున్న ఓటర్ల సంఖ్య కోటిన్నర దాటింది. ఎన్నికల్లో వీరి ఓట్లు కీలకం. ఇది ముమ్మాటికీ వాస్తవం. తాజా లెక్కల ప్రకారం 1,89,239 మంది యువత కొత్తగా ఓటర్లుగా చేరారు. అయితే ఇటువంటి యువత పట్ల మన సమాజం చేస్తున్నదేమిటి..? అని ప్రశ్నిస్తే యువత భవిష్యత్తు ప్రస్తుతం అగమ్యగోచరంగా ఉంది. దేశంలో రోజురోజుకు ఆత్మహత్యలు, కులదూషణలు, నేర ప్రవృత్తి పెరిగిపోతోంది. దీనికి సమాజం, ప్రభుత్వాలు కారణం కాదా...? కార్పొరేట్ కళాశాలల చదువుల ఒత్తిడితో వెనుకబడినందుకు, ఆత్మన్యూనత, అందరిలో చులకనగా చూశారని, పరీక్షలు తప్పినందుకు, ప్రేమ విఫలమైనందుకు, ఉపాధ్యాయులు మందలించారని, ఉద్యోగం రాలేదని, ఇంకా జీవితంలో సెటిల్ కాలేదని నూరేళ్ల జీవితాన్న ఛిద్రం చేసుకుంటున్న యువత ఎంతమందో....ఈ మధ్య కాలంలో మానసిక సమస్యా కేంద్రాలు, మానసిక విశ్లేషణలు, రీహేబిలిటేషన్ సెంటర్లు వీధికొకటి పుట్టుకొస్తున్నాయి.

జీడీపీని పెంచే మనుషుల శ్రమ :

సాంకేతికతను వినియోగించుకుని పారిశ్రామిక ఉత్పత్తిని పెంచుకోవడం కన్నా దేశ జీడీపీని పెంచే మనుషుల శ్రమను బతికించుకోవడమే ఈ రోజున్న ప్రధానాంశం. పంటలకు గిట్టుబాటు ధరలు రాక అన్నంపెట్టే అన్నదాతల ఆత్మహత్యలు, బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు చెల్లించలేక, పిల్లల చదువులకు డబ్బులేక, పెళ్లిళ్లు చేయలేక నిరాధారమైన బతుకుబండి నడపలేక కరెంటుతీగలకు ఉరేసుకుంటున్న బడుగు రైతుల దీనావస్థ ఒకవైపు... కోట్లాదిరూపాయలు బ్యాంకులకు టోకరాకొట్టి విదేశాలకు చెక్కేసి డబ్బును ఎలా, ఏ విధంగా ఖర్చు చేయాలో తెలియక జల్సా చేస్తున్న పుంగవులు మరోవైపు... అప్పులు తీర్చలేక చేనేత కార్మికుల ఆత్మహత్యలు, చదువుకుని ఉద్యోగాలు లేక అర్ధాంతరంగా జీవితం ముగిస్తున్న యువత ఇంకోవైపు... ఏదైనా ఉపాధి కోసం రుణాలు అడిగితే గ్యారంటీ చూపించమనే బ్యాంకులు, నాలుగురోజులకోసారి విదేశాలకు వెళ్లి ఖరీదైన సూట్లు వేసుకుని అసందర్భ ప్రేలాపనలాడే రాజకీయ నాయకులు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తున్న యువత అసలు దేశ సమస్యలను పట్టించుకోని ఇలాంటి వ్యవస్థలోనా మనం కూరుకుపోయామని ఆగ్రహావేశాలతో రగిలిపోతోంది. ఏమీ చేయలేక నిరాశానిస్పృహలు యువతను చుట్టుముడుతున్నాయి. సామాజిక బాధ్యతలను విస్మరిస్తూ అమానవీయంగా ప్రవర్తించే ప్రజాప్రతినిధులను ఏం చేయాలి..? కేవలం మహిళలనే కాకుండా పసిపిల్లలపై కామాంధులు చేసే అకృత్యాలు వింటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఈ చర్యలు దేనికి నిదర్శనంగా మారుతున్నాయి...? నిత్యకృత్యంగా మారుతున్న ఇలాంటి తీవ్రమైన సమస్యలపై ప్రభుత్వం తక్షణం ప్రతిస్పందించవలసిన అవసరం లేదా..? వీటికి కారణాలు అన్వేషించి, పరిష్కార మార్గాలు సూచించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎటువంటి సమస్యలు వచ్చినా నిలదొక్కుకునే మానసిక స్థైర్యాన్ని ఇచ్చి హామీ ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. అయినా ప్రభుత్వమే అడ్డదారులు తొక్కుతుంటే తమ గోడు ఎవరికి వెళ్లబోసుకోవాలనేది సామాన్యుడి ఆవేదన.

సమస్య ఉత్పన్నమైనపుడే పోలీసులు రంగంలోకి దిగి తీసుకునే కంటితుడుపు చర్యలు ఎవరిని నమ్మిస్తాయి...? మనుషుల్లోని మానసిక అస్థిరతకు కారణాలను అన్వేషించి... కేసులు



విచారణ చేసి అరెస్టు చేయడంతో సరిపెట్టకుండా అసలు సమస్య మూలాల్లోకి వెళ్లి రుగ్మతలను నియంత్రించే పనులు చేయడం వల్ల సమాజానికి ఎంతోకొంత మేలు జరుగుతుంది. ఏయే రంగాల్లో ఎందుకు ఆత్మహత్యలు జరుగుతున్నాయి..? ఎందుకిలా జరుగుతున్నాయనేదానిపై పరిశోధనలు చేయాలి. మనిషి ప్రాణాలను హరిస్తున్న సమస్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. ఎన్నికల్లో గెలుపొందడానికి మనుషులను కేవలం ఓటు వేసే యంత్రాలుగా చూడకుండా అమూల్యమైన సంపదగా గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది. దేశమంటే మనుషులు అనే దానిపై ప్రభుత్వం దృష్టిపెట్టి మనుషుల్లో ధైర్యం నింపే ప్రజా ప్రయోజన కార్యక్రమాల ద్వారా మానవ వనరులను రక్షించుకోవాలి.

Sunday Special

పరీక్షల సమయం - సెల్‌తో చేటు


విశాలాంధ్ర-విశాలాంధ్ర జనరల్ డెస్క్ : సెల్‌ఫోన్, అందునా స్మార్ట్‌ఫోన్, దానికి తోడు నెట్ కనెక్షన్ ఉంటే ప్రపంచమంతా మన గుప్పెట్లోనే. దీనివల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో, దుష్ఫలితాలూ అన్నే ఉన్నాయి. పరీక్షల సమయం సమీపిస్తున్న వేళ స్మార్ట్‌ఫోన్లతో విద్యార్థులకు ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నంతవరకు అద్భుత ఫలితాలు వస్తాయి. పరీక్షలకు సన్నద్ధం కాకుండా దానితోనే కాలక్షేపం చేస్తే బోలెడు చెడు ప్రభావాలుంటాయి.

విద్యా సంవత్సరంలో మూడొంతులు గడిచిపోయింది. కొద్ది రోజుల్లో అన్ని పరీక్షలు ఒకదానివెంట మరొకటి తరుముకొస్తున్నాయి. కాలం ఐస్ లాంటిది. కరిగిపోతే నీళ్లయ్యి నేలపాలవుతాయి. పరీక్షల సమయంలో విద్యార్థులు సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి స్నేహితులతో చాటింగ్ వంటివి పెట్టుకుంటే అంతే సంగతులు. భవిష్యత్తు కోసం ఏర్పరచుకునే లక్ష్యాలు నీటి మూటలవుతాయి. ప్రతి విద్యార్థి తను మేల్కొనివుండే సమయంలో కనీసం 4 గంటల పాటు సెల్‌ఫోన్ వినియోగిస్తున్నట్లు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఒక విద్యార్థి తన పీహెచ్‌డీ కోసం దాఖలు చేసిన పరిశోధనా పత్రంలో పేర్కొన్నాడు. అతను సెల్‌ఫోన్ వినియోగిస్తున్న 600 మంది విద్యార్థులను ఇంటర్వ్యూ చేశాడు. ప్రతి విద్యార్థి సెల్‌కు 18 ఇన్‌కమింగ్ కాల్స్ వస్తే సగటున 8 అవుట్ గోయింగ్ కాల్స్ నమోదయ్యాయి. 40శాతం మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులకంటే తమ స్నేహితులతో ఎక్కువ మాట్లాడుతున్నట్లు ఆ అధ్యయనంలో తేలింది. సెలవురోజుల్లో అయితే ఏకంగా ప్రతి విద్యార్థి 6 గంటలకు తక్కువ కాకుండా సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నాడు. రాజధాని జిల్లాలైన గుంటూరు, కృష్ణాల్లో 10వ తరగతి విద్యార్థులు 70 వేలు, ఇంటర్ విద్యార్థులు లక్ష 80 వేలు, డిగ్రీ విద్యార్థులు 85 వేలు, ఇంజనీరింగ్ విద్యార్థులు 50 వేల మంది వరకు ఉన్నారు. రెండు జిల్లాల్లో రమారమిగా జనాభా 95 లక్షలుంటే అందులో 35 లక్షల మందికి సెల్‌ఫోన్లో నెట్ కనెక్షన్లు ఉన్నాయి. వారు నెలకు 45 కోట్ల రూపాయలు సెల్‌ఫోన్ చార్జీలకు చెల్లిస్తున్నారు. సెల్ వాడకంపై ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే సెల్‌ఫోన్ లేకపోవడం మనదేశంలో నామోషీగా భావిస్తున్నారు. సెల్‌ఫోన్ వాడు తున్న వారిలో 10 నుంచి 15 మంది మానసిక వైద్యులను సంప్రదించవలసిన అవసరం ఏర్పడుతుంది. తమకు ఏకాగ్రత ఉండడం లేదని డాక్టర్ల వద్ద వారు చెబుతున్నారు. భారతదేశంలో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు సెల్ వినియోగం వ్యసనంగా మారుతున్నది. కొందరు విద్యార్థులు ముఖ్యంగా ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారు తెల్లవారుజామున 2 గంటల వరకు వాట్సప్, ఫేస్‌బుక్‌లతో నిద్ర లేకుండా గడిపేస్తున్నారు. మద్యపానం, ధూమపానం మాదిరిగా సెల్‌ఫోన్ కూడా ఒక వ్యసనంగా మారిందని సర్వేలు చెబుతున్నాయి. పరీక్షలకు సన్నద్ధం కావడానికి సెల్‌ఫోన్ విద్యార్థులకు బ్రహ్మాండంగా ఉపయోగపడుతుంది. పూర్వ సమూనా ప్రశ్నపత్రాలు తదితర వాటి కోసం గూగుల్ ఎంతగానో ఉపయోగపడుతున్నది. అందుకని పరీక్షలకు ముందు విద్యార్థులు స్వయం నియంత్రణ పాటిస్తూ సెల్‌ఫోన్ వినియోగం కోసం ఒక సమయం కేటాయించుకోవాలి. అలా కాకపోతే తమ పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ మందలించాలి. ఇది తల్లిదండ్రుల మీదున్న గురుతర బాధ్యతగా భావించాలి.

వణికిస్తున్న వాయు కాలుష్యం

దేశనాగరికతకు రవాణా సౌకర్యాలే కొలమానాలు. ఒకప్పుడు పర్యావరణసహితమైన ఎండ్లబళ్లు, గుర్రాలు, ఒంటెలుతో మొదలైన రవాణా సైకిలు, మోటారు సైకిళ్లు, కార్లుగా రూపాంతరం చెందాయి. రవాణాపేరుతో సహజవనరులు తగ్గిపోవడం, వాయుకాలుష్యం పెరిగిపోవడం మానవాళికి పెనుముప్పుగా పరిణమించింది. ప్రతి వ్యక్తీ వాహన దారుడు కావడం వాహన ఉత్పత్తిదారులకు అమితా నందం కలిగించవచ్చుగానీ... వాయుకాలుష్యం పెరిగి సగటు జీవి అనారోగ్యంతో నానా అవస్థలు పడటం తీవ్ర పరిణామంగా చెప్పవచ్చు.





ఈ పరిస్థితులపై ఆందోళన చెందిన శాస్త్రవేత్తలు అనేక సూచనలు చేశారు. భారత ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణించి సీజీఎస్ బస్సులు ప్రవేశపెట్టింది. అయినా పెట్రోలు, డీజిల్ వాహనాలు కాలుష్యకారకాలైన కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు క్యూబిక్ పరిమాణ వాయువులో గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వాయుకాలుష్య నగరంగా ఢిల్లీ పేరుగాంచింది. ఒకవిధంగా చెప్పాలంటే కిక్కిరిసిన జనాభా, ట్రాఫిక్ జామ్‌లతో వాటి నుంచి వెలువడే కాలుష్యాలతో అదొక గ్యాస్ చాంబర్‌గా మారింది. ఊపిరితుత్తిల వ్యాధులు, ఆస్మాలతో ఇక్కడి జనాభా బాధపడుతుంటారు. 50 శాతం పిల్లలు అంటే సుమారు 15 లక్షల మంది వాయుకాలుష్యం కోరలకు బలై ఊపిరితిత్తుల వ్యాధులతో మృతి చెందుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. గతేదాది ఢిల్లీ వాయుకాలుష్యం ఎన్నడూ లేనంతగా పెరిగింది. క్యూబిక్ మీటర్‌కు కాలుష్యాలు 999 గా గుర్తించారు. వాస్తవానికి కొలమానం ప్రకారం 100కు మించరాదు.

ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత రాష్ట్ర రోడ్డు రవాణాలో పెనుమార్పులు సంభవించాయి. రెండేళ్లలో ఎన్నో రెట్లు వాహనాలు పెరిగాయి. ఇప్పటికే ఇక్కడ వాతావరణ కాలుష్యం పెరిగి పట్టణవాసుల జీవితాలపై ప్రభావం చూపుతోంది. విజయవాడలో రోడ్లు చాలా ఇరుకైనవి. నగరంలో వాహనాల సంఖ్య 7,10,000 కాగా జిల్లా నుంచి వచ్చేవాటితో కలిపి మొత్తం 9,80,000 వాహనాలు ఉన్నాయి. అంతేకాకుండా సచివాలయ ఉద్యోగులు, మంత్రులు, ఎమ్మెల్యేలు వారి పరివార వాహనాలతో కాలుష్యం రోజు రోజుకు పెరుగుతోంది. గాలిలో ధూళికణాలు 100 శాతానికి మించరాదు. అయితే రెండేళ్ల క్రితమే అవి 112కు చేరాయి. రాజధాని ప్రాంతాలైన గుంటూరు, విజయవాడల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టకుంటే ఢిల్లీ పరిస్థితులే తలెత్తుతాయని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ కాలుష్యం పట్ల సీనియర్ మెడికల్ ఆఫీసర్లు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని గుంటూరు, కర్నూలు, నెల్లూరు, విశాఖపట్నాల్లో నానాటికీ వాయు కాలుష్యం అధికమవుతుందని, తక్షణమే చర్యలు చేపట్టా లని సుప్రీంకోర్టు, హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు సీపీసీబీ విజ్ఞప్తి చేసింది.

ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇంజన్‌ను ఆపుచేస్తే వాయుకాలుష్యంలో గణనీయమైన మార్పులు వస్తాయంటున్నారు టీన్ సిస్టర్స్ శివానికోట్ (19), ఈశ(14). వీరి వివరణ ప్రకారం సిగ్నల్ వద్ద నీలం రంగు సిగ్నల్ పడగానే ఇగ్నీషియన్ని ఆఫ్ చేయాలి. ఎందుకంటే దాని తర్వాత ఎరుపు రంగు సిగ్నల్‌రావడానికి ఐదు సెకన్లు పడుతుంది, దాని తర్వాత ఐదు సెకన్లకు ఆకుపచ్చ రంగు సిగ్నల్ వస్తుంది. దీంతో ముందుకు సాగడానికి అనుమతి వస్తుంది. సిగ్నల్స్ వద్ద వాహనాల ఇంజన్లను ఆపుచేయకుండా ఉండటం వల్ల పెట్రోలు మరీముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాల కార్బొరేట్ ద్వారా వెలువడే కాలుష్యాలను నివారించేందుకు ముంబై సోదరీమణులు నూతన విధానాన్ని సూచిస్తున్నారు. పెట్రోలు వృథా కావడమే కాకుండా వాయుకాలుష్యం అంతకంతకూ పెరుగుతుందని వారు నివేదిస్తున్నారు. శివానీ కోట్ సైకాలజీ స్టూడెంట్. ఈ విధానాన్ని పాటించడం ద్వారా ఒక్క దేశ రాజధానిలోనే ఏడాదికి రూ. 70 కోట్ల ఇంధనాన్ని పొదుపు చేయవచ్చని సెంట్రల్ రోడ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ) నివేదికలు వెల్లడించాయని శివాని చెబుతున్నారు. అయితే ఇప్పటికే 20 శాతం మంది వాహనదారులు స్విచ్ ఆఫ్ చేస్తున్నారని, ఈ ప్రక్రియపై మరింత అవగాహన కల్పిస్తే వాయుకాలుష్యాన్ని అరికట్టడంతో పాటు ఇంధనాన్ని పొదుపు చేయవచ్చని చెబుతున్నారు. ఇందుకోసం ప్లకార్డులతో అవగాహన కల్పించాలన్న యోచనలో ఉన్నామని, కనీసం 64 శాతం మంది ప్రజలు ఇగ్నీషియాలను ఆఫ్ చేస్తే వాయుకాలుష్యం బారినుంచి రక్షింపబడతామంటున్నారు. ఢిల్లీలో నిత్యం రద్దీగా ఉండే ఎనిమిది సిగ్నల్స్ వద్ద నుంచి స్విచ్ ఆఫ్ చేయని కారణంగా 28,750 టన్నుల కార్బన్ విడుదలవుతున్నట్లు సీఆర్ఆర్ఐ నివేదికలు వెల్లడిస్తున్నాయి. శివానీ ట్రాఫిక్ సిగ్నల్స్-వాహనదారులపై అనేక పరిశోధనలు చేసి అనేక కాంపిటీషన్లలో పాల్గొన్నారు. కాలుష్య నివారణకు చట్టాలు సవరించాల్సి ఉందని, సిగ్నల్స్ వద్ద ఆటోమేటిక్‌గా ఇంజన్ ఆగిపోయే విధానాన్ని రూపొందించాలని వారు కోరుతున్నారు. ముంబై వర్సిటీ, ఐఐటీ ముంబైలో నిర్వహించిన టెక్ ఫెస్ట్‌లో ఆమె చేసిన ప్రసంగాలు ఆయా సంస్థల ఆచార్యులు, శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకున్నాయి.

పార్టీయే ఆయన ప్రపంచం

(5వ పేజీ తరువాయి)

ఆఫీసులోనే ఉండేవారు. నేనూ ఆయనతోపాటే అక్కడే ఉన్నాను. దక్కన్ హిస్టరీ రచయిత, ప్రముఖ చరిత్రకారుడు, ప్రొఫెసర్ హరూన్‌ఖాన్ షేర్వాణీగారి భవనంలో పార్టీ కార్యాలయం ఉండేది. 1965లో పార్టీ కార్యాలయం హిమాయత్‌నగర్ మెయిన్ రోడ్డు మీద ఉన్న షేర్వాణీగారిదే మరొక భవనానికి మారింది. అదే కార్యాలయంలో హైదరాబాద్ నగర శాఖ కూడా ఉండేది. తరువాత తమ్మారెడ్డిగారి చొరవతో ఆ గల్లీలోని షేర్వాణీగారి భవన సముదాయాన్ని 1974లో పార్టీ కొనుగోలు చేసింది. అదే ఇప్పటి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయ భవనం.

నా పని అంతా అసెంబ్లీలోని పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారికి సెక్రటరీగా ఆయన పనులు చూడడం. అలా ఒక సంవత్సరం గడిచింది. ఒకరోజు నీలం రాజశేఖర రెడ్డిగారు నన్ను పిలిచారు: 'నువ్వు రేపటినుంచి పిల్లలమర్రిగారి ఆఫీసుకు వెళ్లనక్కరలేదు. నీ మొత్తం సమయాన్ని పార్టీ కార్యాలయానికే పనిచెయ్యి' అని చెప్పారు. అలా నేను 1966 సెప్టెంబరులో పార్టీ ఆఫీసుకు మారాను. మొదట్లో పిల్లలమర్రివారు ఈ మార్పునకు ఇష్టపడలేదు. ఆయనను రాజశేఖర రెడ్డిగారు సమాధానపర్చారు. అప్పుడు కామ్రేడ్ వై.వి.కృష్ణారావుగారు పార్టీ కోశాధికారిగా ఉండేవారు. ఆయన నాకు పని విషయంలో కొంత శిక్షణ ఇచ్చారు. రాష్ట్రపార్టీ కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఆఫీసు కార్యదర్శిగా నేను ఏభయ్యేళ్లపాటు పనిచేశాను. 4 జూన్, 2016లో ఒక రకంగా వయసురీత్యా, మరొక విధంగా యాక్సిడెంటుకు గురై కొంత అనారోగ్యం కారణంగానూ రాష్ట్రపార్టీ ఆఫీసు బాధ్యతల నుంచి సంతోషంగానే రిటైరయ్యాను. కానీ ఈ మఖ్దూం భవన్‌లో అడుగు పెట్టకుండా నాకు రోజు గడవదు! అదీ నాకు మానసిక తృప్తే!

'రాష్ట్రపార్టీ ఆఫీసు కార్యదర్శిగా నా అర్ధశతాబ్ది ప్రస్థానంలో ఎనిమిదిమంది పార్టీ రాష్ట్ర కార్యదర్శుల దగ్గర పనిచేసే అవకాశం నాకు దక్కింది. పార్టీ చీలిన తరువాత మొదటి రాష్ట్రసమితి కార్యదర్శి కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డిగారి దగ్గరనుంచి వరుసగా-రాజబహదూర్ గౌడ్, తమ్మారెడ్డి సత్యనారాయణ, గిరిప్రసాద్, దాసరి నాగభూషణరావు, సుధాకర రెడ్డి, కె.నారాయణ, చాడ వెంకటరెడ్డిగార్ల దగ్గర నేను ఆఫీసు కార్యదర్శిగా పనిచేశాను.

సీఆర్ ఫౌండేషన్‌కు కృషిచేసిన దాసరి

'గిరిగారి తరువాత రాష్ట్రపార్టీ కార్యదర్శిగా దాసరి నాగభూషణరావుగారు బాధ్యతలు స్వీకరించారు. పార్టీ నిర్మాణరంగంపైన శ్రద్ధచూపుతూనే, పార్టీకి ఆస్తులు, వాటి పరిరక్షణ, ఫండ్ కలక్షన్ తదితర అంశాలపై దృష్టిపెట్టారు. 1994లో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావుగారు మరణించడంతో ఆయన పేరుమీద ఏదైనా ఒక చిరస్థాయిగా ఉండేటట్లు చేయాలన్న తలంపుతో దాసరిగారు సి.ఆర్.



ఫౌండేషన్ ఏర్పాటుకు గట్టిగా కృషి చేశారు. 1995-96 మధ్యకాలంలో కొండాపూర్‌లో సి.ఆర్. ఫౌండేషన్ ఏర్పాటు చేయగలిగారు. అందులో ఒక వృద్ధాశ్రమం, నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయడంలో దాసరిగారి కృషి ఎన్నదగ్గది. ఈ ఫౌండేషన్‌కి స్థల సేకరణలోనూ, భవన నిర్మాణంలోనూ ఆయన రేయింబవళ్లు కృషి చేశారు. ఇందుకోసం విజయవాడ జట్ల కార్మికులు, తదితర వనరుల నుంచి దఫదఫాలుగా విరాళాలు సేకరించి, పునాది రాయి వేయించి, భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంలో ఒక చోదకశక్తిలాగ దాసరిగారు పనిచేశారు. రెండుసార్లు ఆయన రాష్ట్రపార్టీ కార్యదర్శిగా కొనసాగారు. ఆయన రాజ్యసభకు వెళ్లిన తరువాత సుధాకర రెడ్డిగారు రాష్ట్రపార్టీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. సుధాకర రెడ్డిగారు మంచి వక్త. మంచి విశ్లేషకుడు. తన ముందుతరం అనుభవజ్ఞులు ఏర్పరచిన బాటలో పార్టీకి నిబద్ధతతో సేవలందించారు. ఇప్పుడూ ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆ బాధ్యతలు అందిస్తూనే ఉన్నారు. సుధాకర రెడ్డి చాలా సౌమ్యుడు. ఎవరినీ నొప్పించే తత్వం కాదు. నిదానంగా చెప్పి పనిచేయించుకునే తత్వం ఆయనది. కార్యకర్తలతో కలిసిమెలిసి తిరిగేవారు.

ఆయన కేంద్ర పార్టీకి వెళ్లడంతో కామ్రేడ్ డాక్టర్ కె. నారాయణగారు రాష్ట్రపార్టీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. నారాయణగారు పార్టీ కార్యదర్శి బాధ్యతలు స్వీకరించేనాటికి రాజకీయ పరిస్థితులు బాగా మారిపోయాయి తెలంగాణా వేర్పాటు ఉద్యమం ఉధృతమైంది. మారిన ఈ రాజకీయ పరిణామాల్లో తన యావత్తు శక్తి ధారవోసి పార్టీ నిర్మాణానికి అవిశ్రాంతంగా పని చేశారంటే అతిశయోక్తి లేదు. విడవమంటే పాముకు కోపం, కరవమంటే కప్పకి కోపం అన్న సామెతలాగ వేర్పాటువాద ఉద్యమ పరిస్థితిలో పార్టీ శ్రేణుల్ని ఒక తాటిమీద నడపడం అంత తేలిక కాదు. కత్తిమీద సాము లాంటిది. నారాయణ ఆ పరిస్థితిని చాలా నేర్పుతోనే అధిగమించగలిగారు. బండ్లగూడలో గిరిప్రసాద్ భవన్, టీవీ99 ఏర్పాటు, దాని భవన నిర్మాణం.. నారాయణ చూపిన చొరవే. పార్టీకార్యకర్తలతో మమేకమై తిరిగే వ్యక్తి కామ్రేడ్ నారాయణ. ఆయన కేంద్ర కమిటీకి వెళ్లిన తరువాత చాడ వెంకటరెడ్డి పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. ఈయన మితభాషి, మంచివాడు. పార్టీ నిర్మాణపరంగా చాలా కష్టపడే తత్వం ఉన్న వారు. ప్రతి కామ్రేడ్ సమస్యనీ ఓపిగ్గా వింటూ పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చీలిన తరువాత తెలంగాణ రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శిగా ఆయన ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు......ఇలా నాకు ఎనిమిదిమంది అనుభవజ్ఞులు, నిబద్ధత కలిగిన పార్టీ నాయకులతో రాష్ట్రపార్టీ కార్యాలయ కార్యదర్శిగా పనిచేసే అవకాశం రావడం నిజంగా ఒక అదృష్టంగానే ఎప్పుడూ భావిస్తుంటాను......







ఆ ఉరవడి తగ్గింది....చైతన్యం తేవాలి....

అప్పటికీ ఇప్పటికీ పార్టీ పరిస్థితి గురించి మాట్లాడవలసి వస్తే క్యాడర్‌లో క్వాలిటీ పడిపోయిందనిపిస్తుంది. ఇదివరకటిలా ఇప్పటి వారిలో అధ్యయనం అస్సలు లేదు. ఇప్పుడు కార్యకర్తలు ఉరుకులు పరుగులు మీదున్నారు. కానీ నిర్మాణపరంగా దృష్టిలేదు. ముఖ్యంగా ప్రజాసంఘాలను బాగా బలపర్చాలని నేను అనుకుంటున్నాను. అలాగే క్యాడర్‌ని పెంచుకుని వారిని ఎడ్యుకేట్ చేయాలి. పార్టీ మౌలిక సిద్ధాంతాలకు ఏ మాత్రం విఘాతం కలుగకుండా నేటి రాజకీయ పరిస్థితులకనుగుణంగా ముందుకెళ్లాలి. ఇది మన నాయకత్వానికి తెలియదని కాదు. ఎప్పటికప్పుడు కొత్త క్యాడర్‌ని తయారు చేసుకుంటుండాలి. అదే పార్టీకి జవం జీవం.....నిజానికి ఇప్పుడు వామపక్ష ఉద్యమం అప్పటితో పోల్చుకుంటే మసకబారినట్లేననిపిస్తుంది. అందుక్కారణం ప్రజల్లో వచ్చిన మార్పును మనం అలస్యంగా గ్రహించినందువల్లనే మనం వెనకబడిపోయాం అని నేను అనుకుంటున్నాను. కానీ ఈ మసక ఎంతోకాలం ఉండదు. మళ్లీ కమ్యూనిస్టు ఉద్యమం వైపునకే ప్రజలు దృష్టి పెడతారు. పెట్టక తప్పదు.

నాకు మరో ఆలోచన లేదు......

'కమ్యూనిస్టు భావజాలంవైపు వచ్చి తప్పు చేశానా అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఆ విషయంలో నాకు మరో ఆలోచన లేదు. పార్టీ నిర్మాణంలో మమేకమై, పార్టీని తల్లిగా భావించి, ఆ సిద్ధాంతాలకు అనుగుణంగానే నేను నడచుకున్నాను. సీపీఐ ఎప్పుడూ మాకు మాతృ సంస్థే. అనేక సామాజిక పరిణామాలు, అడ్డంకుల వల్ల మనం అనుకున్నంత అభివృద్ధి లేకపోవచ్చు. కానీ ఈ తల్లిని కాపాడుకోవాలి, ఎర్రజెండాను మునుముందుకు అజేయంగా, ఉజ్వలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉంది. అందుకోసం నా యీ కట్టెలో ప్రాణం ఉన్నంత వరకూ నేను చేయగలిగినంతా చేస్తాను. నాకు వేరే ప్రపంచం లేదు. పార్టీనే ప్రపంచం!

నన్ను నమ్మిన నా తల్లి

'నేను ధూళిపాళ పాపమ్మగారికి దత్తత వెళ్లిన విషయం పైన వివరించాను. నేను కమ్యూనిస్టు సిద్ధాంతాల వైపు వెళుతుండడం చూసి కొందరు ఆవిడకి 'వీడు కమ్యూనిస్టు పార్టీ అంటూ తిరుగుతున్నాడు. నిన్నేం ఉద్ధరిస్తాడు. నీ గొంతులో నీళ్లేం పోస్తాడు' అంటూ నా గురించి ఏవేవో చెప్పేవారు. అవన్నీ తెలిసిన నేను ఒక రోజు నా దత్తత తల్లిగారికి ఇలా చెప్పాను: 'అమ్మా మీ పూజలు, వ్రతాలు, తీర్థయాత్రలు చేసుకోండి. నేను దేనికీ అడ్డురాను. దానధర్మాలకు మీ ఆస్తిని ఎలాగైనా ఖర్చు చేసుకోండి. దానిగురించి నేను ఏ విధంగానూ బాధపడను. మీకు నమ్మకస్తుడైన కొడుకుగా ఉంటాను'. ఆవిడ నాకేమీ అభ్యంతరం పెట్టలేదు. అయితే ఆవిడ నన్ను కొంతకాలం పరిశీలించిన తరువాత బంధువులకి ఇలా చెప్పారు: 'కొడుకంటే వాడేరా' మాట తప్పడు' అని. అంతేకాదు ఆవిడ నా దగ్గర ఒక వాగ్దానం తీసుకున్నది 'ఒరేయ్ నేను పోయేటప్పుడు నువ్వు నా దగ్గరే ఉండాలి' అని. అలాగే ఆవిడ నా చేతుల్లోనే తృప్తిగా కన్ను మూసింది.

నా కుటుంబం గురించి.....

నేను ఇంతకు ముందే చెప్పాను....నేను ఇంటర్ చదువుతున్నప్పుడే నా దత్తత తల్లిగారు తన మేనకోడల్ని ఇచ్చి నా వివాహం చేశారు. ఆమె పేరు హేమలత. ఆదర్శ గృహిణిగా నాకు చేదోడు వాదోడుగా ఉండేది. ఆమెకూ చాదస్తాలు, దేముడి మీద భక్తీ ఉన్నాయి. ఎప్పుడూ సంతోషంగానే ఉండేది. కానీ మధుమేహ వ్యాధి తీవ్రస్థాయికి చేరుకోవడంతో 3 సెప్టెంబరు 2011లో ఆమె మరణించింది. నాకు ముగ్గురు అబ్బాయిలు. పెద్దవాడు నారాయణ యు.కె.లో ఉంటున్నాడు. రెండోవాడు చింతామణి నా దగ్గరే ఉంటున్నాడు. మూడోవాడు రవికుమార్ హైదరాబాద్‌లోనే పెద్ద ఉద్యోగంలో స్థిరపడ్డాడు. నాకు ఏ రకంగానూ అసంతృప్తి లేదు. ఫలానా పని చేయలేకపోయానే అన్న చింతా లేదు. 4 జూన్, 2016లో రోడ్డు ప్రమాదంలో కాలూ, చెయ్యూ విరిగి కొంతకాలం ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. అంతకు మించి ఏ రుగ్మతా నాకు లేదు. అదో మానసిక తృప్తి. ఒక రకంగా నేనిప్పుడు వానప్రస్థంలో ఉన్నాను. పోయేలోగా పార్టీని మళ్లీ పూర్వవైభవంలో చూడగలిగితే ఈ జన్మ ధన్యమైనట్టేనని భావిస్తాను.



విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోటక్ మహీంద్ర	1,051.75	1.04
ఇన్ఫోసిస్	1,124.85	0.96
రెడ్డీ ల్యాబ్స్	2,212.75	0.83
ఏషియన్ పెయింట్స్	1,146.15	0.62
టీసీఎస్	2,999.00	0.39

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్‌బీఐ	271.75	-2.55
ఎస్ బ్యాంక్	311.90	-2.52
ఐసీఐసీఐ బ్యాంక్	321.00	-2.31
భారతీ ఎయిర్‌టెల్	432.45	-2.07
మారుతి సుజుకి	9,076.00	-2.00

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.21	64.21
యూరో	80.06	79.69
పౌండ్	90.16	90.10
ఆస్ట్రేలియా డాలర్	51.04	50.91
సింగపూర్ డాలర్	49.01	64.39

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,280	31,315
చెన్నై	29,490	31,540
బెంగళూరు	28,850	30,695
ముంబై	30,060	32,149
విజయవాడ	29,350	31,500
విశాఖపట్నం	29,280	31,941
ప్రొద్దుటూరు	29,280	30,740
ముడి చమురు		64.33

-286.71 ▼	-93.20 ▼	-50 ▲	బంగారం (విశాఖపట్నం) 29,490	200 ▲	వెండి (విశాఖపట్నం) 41,700	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	ప్రొద్దుటూరు	వెండి (విజయవాడ)	ప్రొద్దుటూరు	
34,010.76	10,452.30	31,500	29,949	39,800	41,930	64.21
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

'ముద్ర' యోజన ద్వారా

రూ.10 లక్షల వరకూ రుణం



నిధుల కోసం ఇబ్బందులు పడే చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారికి ప్రధానమంత్రి 'ముద్ర' యోజన పథకం అందుబాటులో ఉంది. మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ (ముద్ర) తక్కువ వడ్డీ రేటుకే చిన్న వ్యాపారులకు రూ.10 లక్షల వరకు రుణాలను అందిస్తుంది. దాదాపు 12 కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న 5.75 కోట్ల పైగా లఘు, చిన్న తరహా సంస్థల ఆర్థిక అవసరాలు తీర్చడంపై ఇది దృష్టి పెడుతుంది. పెద్ద సంస్థల్లో కేవలం 1.25 కోట్ల మందే ఉపాధి పొందుతుండగా, చిన్న సంస్థలు 12 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఇలాంటి వాటికి తోడ్పాటునిచ్చేందుకే ముద్ర యోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రధాన మంత్రి ముద్ర యోజనకు రూ.20,000 కోట్ల కార్పస్ నిధి ఉంటుంది. బ్యాంకులకు గ్యారంటీగా ఉండటానికి ప్రభుత్వం ఈ మూలధనాన్ని కేటాయించింది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు ఎలా ప్రయోజనం పొందాలో, అర్హతలు ఏమి ఉండాలో తెలుసుకుందాం.

ముద్ర విధులు : మైక్రో యూనిట్ల అభివృద్ధి, రీఫైనాన్సింగ్ కార్యకలాపాల కోసం చిన్న తరహా వ్యాపారవేత్తలకు రూ. 50,000 నుండి రూ. 10 లక్షల దాకా ముద్ర రుణాలు ఇస్తుంది. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు 7 శాతం వడ్డీ రేటుపై రీఫైనాన్స్ సేవలను అందిస్తుంది. తయారీ, సర్వీసులు తదితర రంగాల్లోని చిన్న వ్యాపారులకు రుణాలు కల్పించే సంస్థల మార్గదర్శకాలు రూపొందించడం, ఎంఎఫ్ఐల రిజిస్ట్రేషన్, రేటింగ్ మొదలైన అంశాలను ముద్ర పర్యవేక్షిస్తుంది.

ఎంఎఫ్ఐ తీసుకునే రిస్కును బట్టి వడ్డీ రేటును నిర్ణయిస్తుంది. ముద్ర నిధి నుంచి తీసుకునే మొత్తాన్ని రుణంగా ఇచ్చేటప్పుడు నిర్దిష్ట వడ్డీ రేటుకు మించి వసూలు చేయకుండా పరిమితి విధిస్తుంది.

సూక్ష్మ రుణ సంస్థలు (ఎంఎఫ్ఐ), నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) కూడా ముద్ర నుంచి రుణాలు తీసుకోవచ్చు తదుపరి ఆ మొత్తాన్ని ఇతరులకు రుణాలిచ్చేందుకు ఉపయోగించుకోవచ్చు.

ఫండింగ్ దశను బట్టి 'శిశు', 'కిశోర్', 'తరుణ్' పేరిట మూడు రకాల పథకాల కింద ముద్ర యోజన నిధులు సమకూర్చుతుంది.

2. రుణ రకాలు : శిశు : రూ. 50,000 దాకా రుణాలు, కిశోర్ : రూ. 5 లక్షల దాకా, తరుణ్ : రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల దాకా రుణాలు వర్గీకరించారు.

3. రుణం పొందడానికి అర్హత : భారత పౌరుడై ఉండాలి, వ్యవసాయేతర వ్యాపార ఆదాయ ప్రణాళిక సూచించే విధంగా ఉండాలి, ఉదాహరణకు తయారీ, ప్రాసెసింగ్, వ్యాపార లేదా సేవా రంగంలో. రుణ అవసరం రూ.10 లక్షల లోపు ఉండాలి. పైన పేర్కొన్న అర్హత గల వారు దగరలో వున్న బ్యాంక్, సూక్ష్మ రుణ సంస్థ (ఎంఎఫ్ఐ), లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) అధికారులను సంప్రదించాలి.

4. ఈ- పథకం వర్తించే రంగాలు : ల్యాండ్ ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ / కార్యాచరణ - ఆటోరిక్షా, చిన్న వస్తువులు రవాణా వాహనం, 3 వాహనాలు, ఇ-రిక్షా ప్యాసింజర్ కార్లు, టాక్సీలు, మొదలైనవి వస్తువులు, వ్యక్తిగత రవాణా కోసం రవాణా వాహనాల కొనుగోలు.

కమ్యూనిటీ, సామాజిక, వ్యక్తిగత సేవలు కార్యక్రమాలు - బ్యూటీ పార్లర్స్, వ్యాయామశాల, షాపులు, టైలరింగ్ దుకాణాలు, డ్రై క్లీనింగ్, చక్రం, మోటార్ సైకిల్ మరమ్మతు దుకాణం, డిటిపి, ఫొటో సౌకర్యాలు, మెడిసిన్ దుకాణాలు, కొరియర్ ఏజెంట్లు, మొదలైనవి.

ఆహార ఉత్పత్తులు సెక్టార్ - పాపడ్ తయారీ, పచ్చడి తయారీ, జామ్ / జెల్లీ తయారీ, వ్యవసాయ ఉత్పత్తులకు పరిరక్షణకు గ్రామీణ స్థాయి, తీపి దుకాణాలు, చిన్న సేవ ఆహారం స్టాళ్లు, రోజు క్యాటరింగ్ / రోజువారి క్యాటరింగ్ సేవలకు, కోల్డ్ స్టోరేజ్, ఐస్, ఐస్ క్రీమ్ తయారీ యూనిట్లు, బిస్కట్, రొట్టె, బన్ను తయారీ మొదలైనవి.

వస్త్ర ఉత్పత్తులు సెక్టార్ / కార్యాచరణ - చేనేత, జరీ- జర్దారీ పని, సంప్రదాయ ఎంబ్రాయిడరీ, చేతిపని, సంప్రదాయ అద్దకం , ప్రింటింగ్, దుస్తులు డిజైన్, అల్లడం, పత్తి జిన్నింగ్, కంప్యూటరీకరణ ఎంబ్రాయిడరీ, బ్యాగులు, వాహనం ఉపకరణాలు మొదలైనవి.

5. రుణం పొందే విధానం, కావలిసిన డాక్యుమెంట్స్ : ప్రధాన్ మంత్రి ముద్రా యోజన (పీఎంఎంవై) కింద సహాయం పొందగోరేవారు వారి ప్రాంతంలో ఆర్థిక సంస్థల ఏ స్థానిక శాఖ అధికారులనైనా సంప్రదించవచ్చును, పి.ఎస్.యు బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, ప్రైవేట్ రంగ బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్ సేలందించే ఇన్‌స్టిట్యూషన్స్ (ఎం.ఎఫ్.ఐ.), నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్.బి.ఎఫ్.సి). సాయం మంజూరు సంబంధిత రుణ సంస్థల అర్హత నిబంధనలను ప్రకారం ఉండాలి.

6. రుజువుల కోసం ఇలా....

గుర్తింపు రుజువు : ఓటరు ఐడి కార్డ్ / డ్రైవింగ్ లైసెన్సు / పాన్ కార్డు / ఆధార్ కార్డు / పాస్‌పోర్ట్/ ప్రభుత్వం జారీచేసిన ఫొటో ఐడీ ధృవీకరణ మొదలైనవి.

నివాసం రుజువు : ఇటీవలి టెలిఫోన్ బిల్లు / విద్యుత్ బిల్లు / ఆస్తి పన్ను రసీదు (చివరి 2 నెలల లోపువి) / ఓటరు ఐడి కార్డ్ / వ్యక్తిగత / ప్రొప్రైటర్ / భాగస్వాములు బ్యాంక్ ఖాతా పుస్తకం లేదా తాజా ఖాతా స్టేట్‌మెంట్, ఆధార్ కార్డ్ / పాస్‌పోర్ట్ వెంటనే బ్యాంక్ అధికారులు / నివాస సర్టిఫికెట్ ద్వారా ధృవీకరణ / సర్టిఫికెట్ ప్రభుత్వం జారీ చేసింది / స్థానిక పంచాయితీ / మున్సిపాలిటీ మొదలైనవి.

దరఖాస్తుదారుకు చెందిన ఇటీవలి ఫొటోగ్రాఫ్ (2 కాపీలు) 6 నెలల లోపువి. మెషినరీ / ఇతర వస్తువులను కొనుగోలు కొటేషన్. సరఫరాదారు పేరు / యంత్రాలు ధర కొనుగోలు వివరాలు. వ్యాపార సంస్థ యాజమాన్యానికి సంబంధించిన సంబంధిత లైసెన్సు / నమోదు సర్టిఫికెట్లు / ఇతర పత్రాలు ప్రతులు, వ్యాపార యూనిట్ చిరునామా గుర్తింపు, వ్యాపార సంస్థ గుర్తింపు / చిరునామా రుజువు.

ఎస్సీ / ఎస్టీ / ఓబీసీ / మైనారిటీ వంటి వర్గం ప్రూఫ్.

7. ముద్ర యోజన ప్రత్యేకతలు :

అన్ని ప్రధాన్ మంత్రి ముద్రా యోజన రుణాలు పొందగోరువారు వారు ఈ క్రింది విషయాలు గమనించాలి:

ప్రాసెసింగ్ ఫీజు ఉండదు.

అదనపు హామీ ఉండదు. రుణం తిరిగి చెల్లించే కాలాన్ని 5 సంవత్సరాల వరకు పెంచారు.

అభ్యర్థి ఏ బ్యాంకు / ఆర్థిక సంస్థలో డిఫాల్టర్ ఉండకూడదు.

తొలి జీతంనుంచే

పొదుపు ప్రారంభించండి



పెట్టుబడుల విషయంలో సంపాదన మొదలైనప్పటినుంచి జాగ్రత్త వహించాలి. ఉద్యోగం లేదా వ్యాపారంలో సంపాదన మొదలైనప్పుడు ఎంత తొందరగా మదుపు ప్రారంభిస్తే.. అంత తొందరగా ధనవంతులు కావచ్చు. అంటే, కాలం గడుస్తున్న కొద్దీ మీ పెట్టుబడిపై అధిక రాబడి వస్తుందన్నమాట. జీవితంలో తొందరగా మీరు అనుకున్న ఆర్థిక లక్ష్యాలు చేరుకోవడం సులువవుతుంది. అందుకోసం ఏం చేయాలి?

చాలామంది పెట్టుబడులను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలుసా? వివాహం అయి.. పిల్లలు పుట్టాక.. కానీ, అప్పటికే ఆలస్యం అయ్యిందని వారు గుర్తించరు. యువకులుగా ఉన్నప్పుడు ఏదైనా సాధ్యం అనిపిస్తుంది. ఎందుకంటే.. వారి దగ్గర కావాల్సినంత సమయం ఉంటుంది. అసలు అదే వారికి శక్తి. ఉద్యోగంలో చేరిన కొత్తలో కొంత డబ్బును పెట్టుబడి పెట్టేందుకు కొంత ఇబ్బంది అనిపించవచ్చు. కానీ, ఇది మీరు పెట్టుబడులు ప్రారంభించేందుకు అడ్డంకిగా మాత్రం మారకూడదు. మీరు ఆర్జించిన మొదట్లో కొన్నేళ్లపాటు చేసిన మదుపు.. భవిష్యత్తులో పెద్ద ఎత్తున సంపద సృష్టించడానికి బాటలు వేస్తుందని మర్చిపోకూడదు. 20 ఏళ్ల వయసులో పెట్టుబడుల ప్రపంచంలోకి ప్రవేశించడం జీవితంలో గొప్ప మలుపునకు శ్రీకారం అని చెప్పుకోవచ్చు. తక్కువ వేతనం.. విద్యారుణంలాంటివి ఉన్నా సరే..

వ్యక్తిగత జీవితమైనా.. పెట్టుబడుల్లోనైనా అనిశ్చితి సహజం. కానీ, యువకులు గుర్తించాల్సిన విషయం ఏమిటంటే.. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ ఒకదానితో ఒకటి అల్లుకుపోయాయి. ప్రపంచంలో ఒక మూలన ఏదైనా ఇబ్బంది ఏర్పడితే.. దాని ప్రభావం రెండో వైపు ఉంటోంది. ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లూ దానికి అనుగుణంగా స్పందిస్తాయి. ఇలాంటివాటిని పట్టించుకోకుండా.. క్రమం తప్పకుండా మదుపు చేసే అలవాటు వచ్చినప్పుడు ఇలాంటివన్నీ చిన్న విషయాలే. సంపాదన మొదలు పెట్టినప్పుడే.. సరైన ఆర్థిక ప్రణాళికలు వేసుకుంటే.. మీ దగ్గర కావాల్సినంత సొమ్ము ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవచ్చు. ఇలాంటి క్రమశిక్షణ రావడానికి.. మ్యూచువల్ ఫండ్లు తోడ్పడతాయని చెప్పొచ్చు.

ఫండ్లు.. సరైనవే...

ప్రస్తుతం దేశంలో చాలామంది యువకులు తాము పెట్టుబడి పెట్టేందుకు సరైన మార్గాలేమున్నాయని అన్వేషిస్తున్నారు. వారంతా ప్రణాళికాయుతంగా, ఒక పద్ధతి ప్రకారం మదుపు చేయాలని అనుకుంటున్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే. ఈ రోజుల్లో చాలామంది యువకులు తమ ఉద్యోగం లేదా వ్యాపారం ప్రారంభంలోనే మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. తమ జీవితం పట్ల వారందరికీ ఉన్నత ఆలోచనలు ఉంటున్నాయి. తమ జీవన శైలి మరింత మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం గురించే కాకుండా భవిష్యత్తు గురించీ ఇలాగే ఆలోచిస్తున్నారు.

చిన్న వయసులో ఉన్నప్పుడు కాస్త నష్టం వచ్చినా తట్టుకునే శక్తి ఉంటుంది. కాబట్టి, పెట్టుబడుల్లో 80శాతం వరకూ ఈక్విటీలకు కేటాయించినా ఇబ్బంది ఉండదు. దీర్ఘకాలంలో పెట్టుబడి నుంచి సంపదను సృష్టించే ఆస్కారం ఉన్న నేపథ్యంలో వీటిపై కాస్త అధికంగానే దృష్టి పెట్టాలి. వీటిని ఎంత తొందరగా మనం సొంతం చేసుకుంటే.. అంత వేగంగా మన డబ్బు వృద్ధి చెందుతుంది. అయితే, ఈక్విటీల్లో నేరుగా మదుపు చేసే బదులు మ్యూచువల్ మార్గంలో వెళ్లడం ఆచరణీయం.

- మ్యూచువల్ ఫండ్లు వైవిధ్యమైన పెట్టుబడికి అవకాశం కల్పిస్తాయి. అదే సమయంలో ఇవి నిపుణుల పర్యవేక్షణలో పనిచేస్తాయి. అనేక రకాల పెట్టుబడి మార్గాలను ఎంచుకోవడంతో నష్టభయం కూడా తక్కువగా ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేలా రాబడిని అందించడంలోనూ ఇవి ముందే ఉంటాయి. వీటి గురించి నిరంతరం పట్టించుకోవాల్సిన అవసరమూ ఉండదు. అంటే, బోలెడంత సమయం మీకు ఆదా అవుతుంది. ఏడాదికి మించి దీరకాలిక పెట్టుబడులపై వచ్చే రాబడికీ పన్ను మినహాయింపులు అదనపు ప్రయోజనం.

చరిత్ర ఏం చెబుతోంది...

నిజంగా.. ఈక్విటీలు దీర్ఘకాలంలో మంచి రాబడిని అందిస్తాయా? దీనికోసం ఈ ఉదాహరణలు గమనిద్దాం.. మీరు 1979-80ల మధ్య రూ.లక్షను ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం, సెన్సెక్స్ సూచీలో మదుపు చేశారనుకుందాం.. 2017 వరకూ వీటిని అలాగే కొనసాగిస్తే.. ఈ 37ఏళ్లలో ఎఫ్‌డీలు 22 రెట్లు, బంగారం 32 రెట్లు వృద్ధి చెందగా.. సెన్సెక్స్ మాత్రం 320రెట్లు వృద్ధి చెందింది.

అయితే, పెట్టుబడుల ప్రారంభానికి ఆలస్యం అవడమంటూ ఏమీ ఉండదు. ఆలస్యంగా ప్రారంభించడం వల్ల మీ సంపద విలువ తగ్గిపోతుంది! దీనికోసం ఒక ఉదాహరణ పరిశీలిద్దాం.. 40 ఏళ్లున్న ముగ్గురు మిత్రులు వేర్వేరు చోట పనిచేస్తున్నారు.. ఇందులో ఒక వ్యక్తి తాను ఉద్యోగంలో చేరిన రోజు నుంచీ నెలకు రూ.5వేలు మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేస్తూ వచ్చాడు. అంటే గత 15ఏళ్లుగా ఇతడు మదుపును కొనసాగిస్తున్నాడు. రెండో వ్యక్తి గత ఏడేళ్లుగా నెలకు రూ.5వేలు మదుపు చేస్తున్నాడు. మూడో వ్యక్తి గత మూడేళ్లుగా నెలకు రూ.5వేలు పెట్టుబడి ప్రారంభించాడు. అంచనా కోసం వార్షిక సగటు రాబడి 16శాతం వచ్చిందనుకుందాం...

మొదటి వ్యక్తి గత 15 ఏళ్లుగా మదుపు చేస్తున్నాడు కాబట్టి.. అతని వద్ద రూ.36.5 లక్షలు, రెండో వ్యక్తి దగ్గర రూ.8.5లక్షలు, మూడో వ్యక్తి దగ్గర రూ.3 లక్షలు మాత్రమే జమ అయ్యాయి. చూశారుగా.. చక్రవడ్డీ ప్రభావం ఎలా పనిచేసిందో..

విశాలాంధ్ర సినిమా

మంచి ఓపెనింగ్స్ రాబట్టిన 'అ !'



సాధారణంగానే హీరో నాని సినిమాలంటే ఓవర్‌సీస్‌లో మంచి క్రేజ్ ఉంటుంది. ఈ మధ్య ఆయన సినిమాలు మిలియన్ డాలర్ క్లబ్‌ను ఈజీగా దాటేస్తున్నాయి. ఆ క్రేజే ఇప్పుడు ఆయన నిర్మించిన తొలి చిత్రం 'అ !'కు మంచి ఓపెనింగ్స్ వచ్చేలా చేసింది. ముందు నుండి ఉన్న ప్రీ రిలీజ్ బజ్ మూలాన ప్రీమియర్స్‌తో పాటు తొలిరోజు సినిమాకు మంచి ఓపెనింగ్స్ దక్కాయి. ఈ సినిమా తెలుగు రాష్ట్రాల్లో సైతం చిత్రానికి మంచి ఓపెనింగ్స్ లభించాయి. నూతన దర్శకుడు ప్రశాంత్ వర్మ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం ఇంతవరకు తెలుగులో ఏ దర్శకుడూ ప్రయత్నించని కొత్త జానర్ సినిమా అనే ప్రసంశను దక్కించుకుంది.

సైలెంట్ థ్రిల్లర్‌లో ప్రభుదేవా



ప్రభుదేవా డాన్స్ మాస్టర్‌గా, నటుడిగా, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. పిజ్జా దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ప్రభుదేవా నటించిన చిత్రం 'మెర్క్యురీ'. ఆసక్తికరమైన విషయమేమంటే ఇందులో డైలాగ్స్ ఉండవట. సైలెంట్ థ్రిల్లర్‌గా సినిమా రూపొందుతోంది. అప్పుడెప్పుడో కమల్ హాసన్, సింగీతం శ్రీనివాసరావు కాంబినేషన్‌లో విడుదలైన పుష్పక విమానం తర్వాత మరో సైలెంట్ మూవీ రాలేదు. ఈ సినిమాకు సంతోష్ నారాయణ్ సంగీతం అందించారు.

నారా రోహిత్ 'ఆటగాళ్లు'లో

జగపతిబాబు



హీరో నారా రోహిత్ ప్రస్తుతం 'ఆటగాళ్లు' సినిమా షూటింగ్లో ఉన్నారు. పరుచూరి మురళీ దర్శకత్వంలో రూపొందుతునున్న ఈ సినిమా యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండనుంది. ఈ చిత్రంలో రోహిత్ సరసన హీరోయిన్‌గా బెంగాలీ నటి దర్శన బానిక్ ను సెలెక్ట్ చేశారట. ఇప్పటికే ఆమె తన పాత్ర తాలూకు షూటింగ్ కూడా మొదలుపెట్టింది. ఫ్రెండ్స్ మూవీ క్రియేషన్స్ పతాకంపై వాసిరెడ్డి రవీంద్ర, వాసిరెడ్డి శివాజీ, మక్కెన రాము, వడ్లపూడి జితేంద్రలు నిర్మిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు కూడా ఒక కీలక పాత్రలో కనిపిస్తుండటం విశేషం. సాయి కార్తిక్ సంగీతం అందిస్తునాం ఈ చిత్రానికి మార్తాండ్ కె.వెంకటేష్ ఎడిటింగ్ చేయనున్నారు.

భారీ ధరకు అమ్ముడైన 'నేల టికెట్' సినిమా హక్కులు



ఇటీవలే 'టచ్ చేసి చూడు' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిన మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు. 'నేల టికెట్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్న ఈ సినిమా గత నెలలో మొదలైన ఒక షెడ్యూల్ ముగించుకుని రెండవ షెడ్యూల్ జరుపుకుంటోంది. మాస్ మసాలా ఎంటర్‌టైనర్‌గా ఉండనున్న ఈ సినిమాలో రవి తేజ సరసన మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఎస్.ఆర్.టి ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం శాటిలైట్, డిజిటల్, డబ్బింగ్ హక్కులను ప్రముఖ ఛానెల్ సన్ టీవీ రూ.25 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించి కొనుగోలుచేసింది. దీంతో నిర్మాతకు ప్రీ రిలీజ్ బిజినెస్ లాభదాయంగానే ఉండే అవకాశాలు దండిగా కనిపిస్తున్నాయి. 'ఫిదా' ఫేమ్ శక్తికాంత్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో ప్రియదర్శి, ప్రవీణ్ వంటి ప్రముఖ నటులు నటిస్తున్నారు.

నితిన్ జంటగా రాశీ ఖన్నా





యువ కథానాయకుడు నితిన్ హీరోగా దిల్‌రాజు నిర్మాణంలో శ్రీనివాస కల్యాణం సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను సతీష్ వేగేశ్న తెరకెక్కించనున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సినిమాలో ఇద్దరు హీరోయిన్స్‌లో ఒకరిగా రాశీఖన్నాను ఎంపిక చేసుకున్నారట. గతంలో ఈ సినిమాలో ముందుగా హీరోయిన్‌గా పూజా హెగ్డే నటిస్తుందని వార్తలు వినపడ్డాయి. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా నుండి పూజా హెగ్డే తప్పుకుంది. రాశీ ఖన్నాతో పాటు మరో హీరోయిన్‌గా నందితా శ్వేత నటించనుంది. ఎక్కడికి పోతావు చిన్నవాడా సినిమా తర్వాత నందిత శ్వేత నిజార్ షఫీ దర్శకత్వంలో సినిమా చేస్తుంది. ఈ సినిమాతో పాటు నితిన్ సినిమాలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది.

రంగస్థలం ప్రీ-రిలీజ్ బిజినెస్



రామ్ చరణ్ మార్కెట్ స్టామినా ఏంటో మరోసారి తెలిసొచ్చింది. సుకుమార్ దర్శకత్వంలో ఈ హీరో చేస్తున్న రంగస్థలం సినిమా తాజాగా వంద కోట్ల రూపాయల ప్రీ-రిలీజ్ బిజినెస్ పూర్తిచేసుకుంది. విడుదల సమయానికి ఈ లెక్క మరో 10 కోట్ల రూపాయలకు పెరిగే ఛాన్స్ ఉందని భావిస్తున్నారు. కాస్త కమర్షియల్ ఫార్మాట్‌కు దూరంగా, ప్రయోగాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఆశించిన స్థాయిలో బిజినెస్ జరగదని అంతా అంచనా వేశారు. కానీ టీజర్ రిలీజ్ అయిన తర్వాత లెక్కలన్నీ మారిపోయాయి. వంద కోట్ల వ్యాపారం జరిగిపోయింది.

తేజు సరసన రుక్సర్

ఎం.ఎం.కీరవాణి సోదరుడు కాంచి దర్శకత్వంలో తెరకెక్కిన ఫస్ట్ షో సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమైంది రుక్సర్ మీర్. ఈ సినిమా ఇంకా విడుదల కాలేదు. అయితే ఆశిష్‌రాజ్ హీరగా నటించిన ఆకతాయిలో హీరోయిన్‌గా నటించింది. ప్రస్తుతం హీరో నాని సరసన కృష్ణార్జునయుద్ధం సినిమాలో కూడా నటిస్తుంది. ఈ అమ్మడు ఇప్పుడు మరో మంచి అవకాశాన్ని అందిపుచ్చుకుంది. సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ హీరోగా చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో రూపొందబోయే చిత్రంలో రుక్సర్ మీర్ హీరోయిన్‌గా నటించబోతోందని ఫిలింగనర్‌లో వార్తలు వినపడుతున్నాయి.

నాగశౌర్య నెక్ట్‌మూవీస్



ఛలో సినిమా సక్సెస్‌తో ఈ సినిమా ప్రమోషన్స్ కోసం తెలుగు రాష్ట్రాల్లో పర్యటించి రీసెంట్‌గా హైదరాబాద్‌కు తిరిగి వచ్చాడు. ఈ సినిమాకు తల్లే ప్రొడ్యూసర్ అవడం.. తిరుగులేని కలెక్షన్స్ సాధిస్తుండటం నాగశౌర్య అమితానందానికి మరో కారణం. రెస్పాన్స్ చాలా బాగుందని.. చిన్న బ్రేక్ తర్వాత మార్చిలో తాను ఒక ఫిలిం స్టార్ట్ చేయబోతున్నట్టు నాగశౌర్య తెలిపాడు. ఇద్దరు డైరెక్టర్లు తన కోసం వెయిట్ చేస్తున్నారని.. ఆ రెండింటిలో తాను చేయబోయే మొదటి సినిమా 'నర్తనశాల' అని తెలిపాడు. ఈ సినిమాను శ్రీనివాస్ చక్రవర్తి డైరెక్ట్ చేయనున్నారు. కామెడి ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా దసరాకు రిలీజ్ చేస్తామని నాగశౌర్య తెలిపాడు. తన మరో సినిమా సాయి శ్రీరామ్ డైరెక్షన్‌లో చేయనున్నాడు. ఇప్పటి వరకూ సినిమాటోగ్రాఫర్‌గా ఉన్న సాయి శ్రీరామ్ ఈ సినిమాతో డైరెక్టర్‌గా మారబోతున్నారు.

మెకానిక్ పాత్రలో మహేష్



సూపర్‌స్టార్ మహేష్ ఇప్పుడు భరత్ అనే నేను సినిమాను ఏప్రిల్ 26న ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడానికి సిద్ధంగా ఉన్నారు. దీని తర్వాత మహేష్ తన 25వ సినిమాను వంశీ పైడిపల్లి దర్శకత్వంలో చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత మహేష్ ఏ సినిమా చేస్తాడనే దానిపై పలు రకాలైన వార్తలు వినపడుతున్నాయి. గత ఏడాది అర్జున్‌రెడ్డితో సక్సెస్ అందుకున్న సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాను తెరకెక్కిస్తాడట. వినపడుతున్న సమాచారం ఏంటంటే ఈ సినిమాలో మహేష్ మెకానిక్ పాత్రలో నటించబోతున్నాడని టాక్.

ఆలీవ్ గ్రీన్ డ్రస్ కోసం తహతహలాడా : జనరల్ బిపిన్ రావత్



న్యూఢిల్లీ : ఆర్మీలో చేరాలన్నదే ఆశయమని మిలటరీ జనరల్ బిపిన్‌రావత్ తెలిపారు. ఉత్తరాఖండ్ నుంచి మిలటరీలో చేరిన ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు స్కూలు యూనిఫారం వేసుకుంటున్నప్పుడు ఆలీవ్ గ్రీన్ మిలటరీ డ్రస్ ఎప్పుడు వేసుకుంటానా అని తహతహలాడేవాడినన్నారు. తన జీవితంలో నేర్చుకున్న పాఠాలను ఎప్పుడూ మరిచిపోలేదని, జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరీ విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన వివరించారు. ఫెయిలయిన వారిని జీవితంలో చిన్నచూపు చూడకూడదని, కష్టపడి పని చేయడానికి వెనుకాడరాదని ఆయన విద్యార్థులకు బోధించారు. చిన్నప్పటి సంగతులు గుర్తుచేసుకుంటూ నా సీనియర్ ఒకరు ఫెయిల్ అవడం వల్ల నాతో సమానంగా 10వ తరగతి చదివాడని అప్పుడు ఎలాకొలా గట్టెక్కినా ఇంటర్‌లో మాత్రం టాపర్ గా నిలిచాడని, తాను మాత్రం టాప్‌5లో ఉండేవాడినన్నారు.చాలా మంది విద్యార్థులు డాక్టర్లు కావాలను కుంటారని, నేను మాత్రం ఆర్మీలో చేరి దేశసేవ చేయాలనుకున్నానన్నారు. ఇండియన్ మిలటరీ అకాడమీ (ఐఎంఏ) డెహ్రాడూన్‌కు ప్రతిష్టాత్మక కరవాలాన్ని బహూకరించారు. 2016 డిసెంబరు 31లో జనరల్ దల్బీర్ సింగ్ పదవీవిరమణ అనంతరం రావత్ ఆర్మీచీఫ్ గా నియమితులయ్యారు.1978 డిసెంబరులో ఐఎంఏ నుంచి గుర్ఖారైఫిల్‌కు చెందిన 5వ బెటాలియన్‌లో నియమితులయ్యారు. 40 ఏళ్ల సర్వీసులో అత్యుత్తమ సేవలు అందించినందుకు ప్రసిద్ధి గాంచిన విల్లింగ్టన్ డిఫెన్స్ సర్వీసు స్టాఫ్ కాలేజ్‌లో నుంచి అనేక మెడల్స్ అందుకున్నారు. అయినా విజయం కొద్ది సేపే ఉంటుంది, వైభవం నిలిచేది కొన్ని క్షణాలే ఎల్లప్పుడూ కష్టపడి పనిచేయడంతోనే గెలుపు సాధ్యమవుతుందని విద్యార్థులకు ఉద్బోధించారు.

ఆశాభోంస్లేకు యాష్ చోప్రా అవార్డు ప్రదానం



ముంబై : ప్రసిద్ధ గాయని ఆశాభోంస్లేకు 5వ యాష్‌చోప్రా మెమోరియల్ అవార్డును అందించారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖనటి రేఖ ఈ అవార్డును ఆశాభోంస్లేకు అందించారు. ' వ్యక్తిగతంగా నేను ఆమె పాటలకు తిరుగులేని అభిమానిని , ఆమె అంటే మొదట చాలా భయపడేదాన్ని స్నేహితులుగా మారిన తర్వాత సినిమాల్లో ఆమె పాడిన పాటలకు కళ్లతోనే భావాలను పలికించేదాన్ని, నవ్వుతూ ఉండటం ఆమె నుంచే నేర్చుకున్నా, లత, ఆశా ఇద్దరూ తనకు మంచి మిత్రులని' నిన్నటి తరం నటి రేఖ వెల్లడించారు. అంతకు ముందే ఇదే అవార్డును ఆశాభోంస్లే సోదరి లతామంగేష్కర్, మెగాస్టార్ అమితాబచ్చన్, రేఖ, షారూఖ్‌ఖాన్ అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం తనకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని అయితే ఆయన మన మధ్య లేకపోవడం బాధకలిగిస్తుందని, ఒక వేళ ఆయన బ్రతికి ఉండి ఉంటే ఏమిటన్నది ఎప్పుడూ ఆశ్చర్యంగా ఉంటుందని ఆశా అన్నారు. ఆయన తనకు సోదరుడి వంటి వారని, చాలా జోక్స్ వేస్తుండేవారన్నారు. ఆయనతో మొదటి సినిమా 'ధూల్ కా ఫూల్' చేశానని అప్పట్లో ఆయనంటే చాలా భయపడేదాన్నన్నారు. అయితే ఆతర్వాత ఆయన రూపొందించిన 22 సినిమాల్లో నేపథ్యగాయనిగా ఉన్నానన్నారు. మహారాష్ట్ర గవర్నర్ సి. విద్యాసాగర్ రావు, జకీష్రాఫ్, పరిణితీ చోప్రా, పూనంథిల్లాన్, జయప్రద తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 2012లో యాష్‌చోప్రా మృతి తర్వాత టీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా టి. సుబ్బిరామిరెడ్డి నిర్మాత, దర్శకుడు యాష్ చోప్రా పేరుతో నెలకొల్పారు.

ప్రధాని మోడీ సూచనమేరకే విలీనం చేశా : పన్నీర్ సెల్వం



థేని/చెన్నై : ప్రధాని మోడీ సూచన మేరకే ముఖ్యమంత్రి పళనీస్వామి వర్గంతో తమ వర్గాన్ని విలీనం చేశానని ఉప ముఖ్య మంత్రి పన్నీర్ సెల్వం శనివారం వెల్లడించారు. థేని పార్టీ కార్యాలయంలో ఆఫీసు బేరర్లతో మాట్లాడుతూ న్యూఢిల్లీలో ప్రధానిని మర్యాద పూర్వ కంగా కలిసిన సమయంలో ఏఐఏడీఎంకే విష యం ప్రస్తావనకు వచ్చిందని, రెండు వర్గాలు కలిస్తే పార్టీని కాపాడిన వారవుతారని సూచిం చడంతో 2016 ఆగస్టులో తన వర్గాన్ని విలీనం చేశానన్నారు. పళనీస్వామి మంత్రి వర్గంలో చేరమని కూడా ప్రధాని సూచించారని, ఉపప్రధాని పదవితో తాను సంతృప్తి పొందాన న్నారు. నిజానికి పదవిపై ఆయనకు ఆశలేదని (జయలలిత) అమ్మదయతో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా సేవలందించానని ఆ గౌరవం తనకు చాలన్నారు. జయలలిత అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లిన రెండుసార్లు, 2001, 2014ల్లో ఆయన సీఎం పదవి చేపట్టారు. 2014లో జయలలిత, ఆమె నెచ్చెలి శశికళ రూ.66.66 కోట్ల అక్రమాస్తులు కలిగి ఉన్నారని కోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.. శశికళ ఆమె కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి పదవిని బలవంతంగా చేపట్టాలని చూడటంతో పన్నీర్ సెల్వం తిరుగుబాటు జెండా ఎగుర వేయడం అదే సమయంలో అక్రమాస్తుల కేసులో కోర్టు శశికళకు శిక్షను ఖరారు చేయడంతో ఆమె ముఖ్యమంత్రి పదవి చేపట్టలేకపోయారు.

ఏప్రిల్‌లో చంద్రయాన్-2

విజయవంతమైతే నాసా కంటే ఇస్రోనే బెస్టు

న్యూఢిల్లీ : అంతరిక్ష ప్రయోగ చరిత్రలో చంద్రయాన్-2ను ఓ మరపురాని ప్రాజెక్టుగా మార్చడానికి భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం (ఇస్రో) సిద్ధమైంది. రూ.800 కోట్ల బడ్జెట్‌తో సిద్ధం చేస్తున్న ఈ ప్రాజెక్టును ఏప్రిల్‌లో ప్రయోగించాలని నిర్ణయించింది. నాసో అపోలో మిషన్ల కన్నా చంద్రయాన్-2 చాలా శక్తివంతమైందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ప్రయోగానికి సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ఇస్రో ఇప్పటిదాకా చేపట్టిన ప్రయోగాలలో చంద్రయాన్-2 ప్రత్యేకంగా నిలవబోతోంది. ప్రపంచంలోనే ఓ అద్భుత ఘట్టంగా దీనిని తీర్చిదిద్దేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు.
ఇప్పటిదాకా అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే చంద్రుడిపై నిశితంగా స్పేస్ క్రాఫ్ట్‌లను ల్యాండ్ చేయటంలో విజయవంతమయ్యాయి. ఇప్పుడు భారత్ ఆ ఘనత సాధిస్తే ఇస్రో చరిత్ర సృష్టించినట్లే. దీనికి కారణం నాసా(అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ) కంటే ఇస్రో 20 రెట్లు తక్కువ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్టును ప్రయోగించబోతోందని జితేంద్ర వివరించారు. చంద్రుడి మీద దక్షిణ ధ్రువంలో చంద్రయాన్-2 ల్యాండ్ అయ్యే దిశగా ఇస్రో ప్రణాళికలు చేస్తోంది. 2008లో చంద్రయాన్-1 ప్రయోగం విజయవంతం కాగా, 2009లో నీటి జాడలు ఉన్నట్లు స్పేస్ క్రాఫ్ట్ గుర్తించింది. ఈ విజయం నింపిన ఉత్సాహంతో తాజాగా మరో భారీ ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతున్నది. ప్రయోగం సాగే విధానం గురించి తెలుసుకుంటే....చంద్రయాన్-2 వ్యోమనౌక, ల్యాండర్, రోవర్.. ప్రధాన, ఉప వ్యవస్థలు అనుసంధానాలు అవుతాయి. చంద్రయాన్-1 లా కాకుండా వ్యోమనౌక నెమ్మదిగా దిగేందుకు అన్ని రకాల



చర్యలు చేపట్టారు. దీని ప్రకారం వ్యోమనౌకను 100 మీటర్ల ఎత్తునుంచి కిందకు జార విడుస్తారు. వ్యోమనౌక కక్ష్య నుంచి రోవర్ చంద్రునిపై కుప్పకూలకుండా నెమ్మదిగా వాలేందుకు ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు. ప్రతిపాదిత ప్రణాళిక ప్రకారం 100 మీటర్ల ఎత్తులో చంద్రమండలంలోని గురుత్వాకర్షణ వాతావరణాన్ని సృష్టిస్తారు. 500 కిలో గ్రాముల బరువైన వ్యోమనౌకను మండించడం ద్వారా కిందకు శాటిలైట్‌ను జారవిడుస్తారు. నౌక దిగాల్సిన దగ్గర రాళ్లు, బండలు ఉంటే మరో సురక్షిత స్థానాన్ని గుర్తించి అక్కడ దిగేందుకు అడ్డం-నిలువు విన్యాసాలు సాయపడుతాయన్నారు. వ్యోమనౌక సమర్థతను తమిళనాడు మహేంద్రగిరి ఇస్రో ఇంధన కేంద్రంలో పరీక్షిస్తున్నారు. చంద్రునిపై రోవర్.. ఖనిజ వనరులు, మూలకాల్ని, మానవ జాతి మనుగడకు గల సాధ్యాసాధ్యాలను పరీక్షిస్తుంది.

మార్చిలో జమ్మూకు హజారే

జమ్ము : మార్చిలో న్యూఢిల్లీలో జన్‌లోక్‌పాల్, రైతు సమస్యలపై ఆందోళన చేపట్టనున్న నేపథ్యంలో సామాజిక కార్యకర్త అన్నా హజారే జమ్ము,కాశ్మీర్‌ను సందర్శించే అవకాశాలున్నట్లు అంతర్జాతీయ అవినీతి నిరోధక, మానవ హక్కుల కౌన్సిల్ చైర్‌పర్సన్ మంజోత్ సింగ్ కోహిల్ తెలిపారు. జమ్మూ సందర్శనకు ఆయన్ని ఆహ్వానించామని, అందుకు ఆయన అంగీకరించారని చెప్పారు. న్యూఢిల్లీలో మార్చి 23న ర్యాలీ జరగనున్న నేపథ్యంలో హజారే జమ్మూను సందర్శించి ఇక్కడి బహిరంగ సభలో ప్రసంగిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు.

అత్యాచార కేసుకు మత, రాజకీయ రంగులా...

జమ్మూ : మైనర్ అత్యాచార కేసుకు 'మత, రాజకీయ' రంగులు పులమడం సిగ్గుచేటని జమ్మూ ప్రతిపక్ష పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) మండిపడింది. మతపరమైన నేపథ్యాలతో సంబంధం లేకుండా నేరస్తులు, వారి సానుభూతిపరుల పట్ల కఠినంగా వ్యవహరించి ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌సీ స్థానిక నాయకుడు దేవేందర్ సింగ్ రాణా అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. అడవిలో తప్పిపోయిన ఎనిమిదేళ్ల బాలిక వారంరోజుల తర్వాత జనవరి 17న అటవీ ప్రాంతంలో ఆ చిన్నారి మృతదేహం లభ్యమైంది.

కావేరీపై తీర్పు నిరాశపరిచింది : పళనిస్వామి

కోయంబత్తూరు : కావేరీ నదీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు నిరాశపరిచిందని తమిళనాడు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి శనివారం అసంతృప్తి వ్యక్తంచేశారు. అయితే కోర్టు ప్రస్తావించిన కొన్ని అంశాలను స్వాగతించాల్సిందేనని, సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై తాను ఇంతకంటే స్పందించలేనని ఆయన శనివారం కోయంబత్తూర్‌లోని మానాశ్రయంలో విలేకరులతో పేర్కొన్నారు. నీరు ఏ రాష్ట్రం సొంతం కాదని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. ఇప్పటివరకూ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం, కేటాయించిన 192 టీఎంసీల జలాలను 177.5 టీఎంసీలకు తగ్గిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

బీజేపీకి అరవింద్ గుడ్‌బై

న్యూఢిల్లీ : ఢిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అరవిందర్ సింగ్ బీజేపీని వదిలి తిరిగి కాంగ్రెస్‌ల పార్టీలో చేరారు. సైద్ధాంతిక బేధాల కారణంగా తాను బీజేపీ నుంచి వచ్చేసినట్లు ఆయన చెప్పారు. బీజేపీలో చేరిన మరుసటి రోజు తాను పశ్చాత్తాపపడ్డానని, అందుకే తిరిగి పార్టీలో చేరిపోతున్నట్లు ఆయన లవ్లీ తెలిపారు. ఆయన ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ అజయ్ మకెన్‌తోపాటు పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నివాసానికి వెళ్లి కలిశారు. అనంతరం మకెన్, ఏఐసీసీ ఢిల్లీ ఇన్‌చార్జి పీసీ చాకో లవ్లీ తిరిగి పార్టీలో చేరినట్లు ప్రకటించారు.

ప్రణబ్‌ముఖర్జీకి ఐఐఈఎస్‌టీ గౌరవ డాక్టరేట్

కోల్‌కతా : భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మార్చి 4న జరిగే స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ అందజేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. 'రాజనీతిజ్ఞుడు, ప్రముఖుడు ప్రణబ్‌ముఖర్జీకి గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్నాం' అని ఐఐఈఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ అజయ్ రాయ్ తెలిపారు. గత ఏడాది డిసెంబరులో జయదేవ్‌పూర్ యూనివర్సిటీ ప్రణబ్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

బదౌన్ : ఉత్తరప్రదేశ్‌లో శనివారం బిసౌలీ- సహస్వాన్ రోడ్డు మార్గంలో చెరుకు లోడుతో వస్తున్న ట్రాక్టర్, ఎస్‌యూవీ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతోపాటు ఐదుగురు మృతిచెందారని, 11 మందికి గాయాలయ్యాయని శనివారం పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వెంటనే ఆసుపత్రికి తరలించామని చెప్పారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు.

మిజోరాంలో ఆధార్ సక్సెస్

ఐజ్వాల్ : మిజోరాంలో 94 శాతంమందికి పైగా ప్రజలు ఆధార కార్డులు కలిగి ఉన్నారని ఆ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. గత ఏడాది కంటే ఈ శాతం గణనీయంగా పెరిగిందని తెలిపింది. గత ఏడాది సెప్టెంబరు నాటికి రాష్ట్రంలో ఆధార్‌కార్డు కలిగినవారు 79.88 శాతం ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరి 10 నాటికి 94.15 శాతానికి పెరిగిందని తెలిపింది.

మాంసం దిగుమతికి రూ.2 వేల కోట్లు

జమ్మూ : పౌల్ట్రీ, మాంసం దిగుమతికి జమ్మూ, కాశ్మీర్ వార్షికంగా రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తుందని, ఆయా ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదగాలని ఆ రాష్ట్ర గవర్నర్ ఎన్ ఎన్ వోహ్రా పేర్కొన్నారు. జమ్మూలో శుక్రవారం ఎస్‌కేయూఏఎస్‌టీ యూనివర్సిటీ క్యాంపస్‌లో 'కిసాన్ మేళా' కార్యక్రమాన్ని వర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ అయిన వోహ్రా ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ, ఎస్‌కేయూఏఎస్‌టీ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ వ్యవసా య విభాగం పౌల్ట్రీ, మాంసం ఉత్పత్తు ఎగుమతికి ప్రణాళికలు తయారుచేయాలని పేర్కొన్నారు.

జైపూర్‌లో 43 భారీ వాహనాలు సీజ్

జైపూర్ : జైపూర్ జిల్లాలో గని, నిక్షేపాల అక్రమ తవ్వకాలకు వినియోగించిన 43 భారీ వాహనాలను సీజ్ చేశామని, దాదాపు రూ.4 లక్షలు జరిమానా వసూలు చేశామని ఆ జిల్లా అధికారి శనివారం తెలిపారు. జిల్లాలో శుక్రవారం జిల్లాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో రెవిన్యూ, పోలీసు అధికారులతో కూడిన నాలుగు జిల్లాల స్థాయి బృందాలు ఆకస్మిక దాడులు జరిపిందని అధికా రులు తెలిపారు. కొన్ని ట్రాక్టర్లతోపాటు 43 భారీ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్షీణ దశలో లింగ నిష్పత్తి

న్యూఢిల్లీ : దేశంలో 21 పెద్ద రాష్ట్రాలకుగాను 17 రాష్ట్రాల్లో లింగ నిష్పత్తి క్షీణించిందని, రికార్డుల ప్రకారం, గుజరాత్‌లో ఈ నిష్పత్తి 53 పాయింట్లకు పడిపోవడం ఆందోళనకరమని నీతి ఆయోగ్ వెల్లడించింది. భ్రూణ హత్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపింది. రికార్డుల ప్రకారం, 17 రాష్ట్రాల్లో పది పాయింట్లు గణనీయంగా పడిపోయినట్లు తెలిపింది. 2012-14లో గుజరాత్‌లో లింగ నిష్పత్తి ప్రతి 1,000 పురుషులకు మందికి 907 స్త్రీలు నమోదవ్వగా, 2013-15లో స్త్రీల నిష్పత్తి 854కు నమోదైనట్లు తెలిపింది.

బిమల్ గౌరంగ్‌ను కాపాడుతా : అహ్లూవాలియా

జల్పాల్‌గురి : గోర్ఖా జనముక్తి మోర్చా (జీజేఎం) అధినేత బిమల్ గౌరంగ్‌కు తాను కాపాడుతానని , వేరే ఏ ఇతర సంస్థ ఆయన్ని వేరు చేయడాన్ని అనుమతించనని కేంద్రమంత్రి ఎస్ఎస్ అహ్లూవాలియా పేర్కొన్నారు. తాను ఎల్లప్పుడూ గౌరంగ్ తరఫున నిలుస్తానని, ఆయన్ని కాపాడుతానని విలేకరులతో ఆయన తెలిపారు. డార్జిలింగ్‌లో ఇటీవల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తాను అక్కడికి వెళ్లలేదని తెలిపారు.

త్రిపురలో పోలింగ్ నేడు

- 59 స్థానాల్లో 307 మంది పోటీ
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 26 లక్షల ఓటర్లు
- మార్చి 3న ఓట్ల లెక్కింపు



అగర్తల: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలో రేపు జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 307 మంది అభ్యర్థులు ఆదివారం తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. ఓట్ల లెక్కింపు మార్చి 3న జరుగుతుంది. రాష్ట్రంలో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలునుండగా 59 స్థానాలకు మాత్రమే ఆదివారం పోలింగ్ జరగనుంది. ఛరిలామ్ అసెంబ్లీ నియోజక వర్గంలో రేపు జరగాల్సిన ఎన్నికను మార్చి 12వ తేదీకి వాయిదా వేశారు. ఆ స్థానంలో సీపీఐ(ఎం) నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి రామేంద్ర నారాయణ్ దేవ్ వర్మ ఐదు రోజుల క్రితం మృతిచెందడంతో అక్కడ ఎన్నికను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 25,73,413 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో పురుష ఓటర్లు 13,05,375 మంది కాగా.. 12,68,027 మంది మహిళా ఓటర్లు, 11 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఈ సారి దాదాపు 47,803 మంది కొత్త ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. రేపు ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4గంటలకు ముగియనుంది. పోలింగ్ నిర్వహణ కోసం 3,214 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఇందులో 47 పోలింగ్ స్టేషన్లను మహిళా ఎన్నికల సంఘం అధికారులు నిర్వహిస్తారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు భద్రత నిమిత్తం 300 కంపెనీల కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. వీరితో పాటు రాష్ట్రంలోని పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటారు. అధికార సీపీఎం 57 స్థానాల్లో పోటీ చేస్తుండగా.. మిగతా మూడు స్థానాల్లో సీపీఐ ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్ పోటీ చేస్తున్నాయి. ఇక కాంగ్రెస్ ఒంటరిగానే 59 స్థానాల్లో బరిలోకి దిగుతోంది. ప్రతిపక్ష బీజేపీ 51 స్థానాల్లో పోటీ చేస్తుండగా ఆ పార్టీతో పొత్తులో ఉన్న ఇండిజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ) తొమ్మిది స్థానాల్లో పోటీ చేస్తోంది. 25ఏళ్ల పాటు త్రిపురను పాలిస్తున్న సీపీఎం నేత ృత్వంలోని వామపక్షాలకు ఈసారి చెక్‌పెట్టాలన్న బీజేపీ కలలు నెరవేరతాయా అనేది మరికొన్ని రోజుల్లో తేలనుంది. రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ తరఫున ప్రధాని నరేంద్రమోడీ సహా పలువురు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, నితిన్ గడ్కరీ, స్మృతి ఇరానీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో సీపీఎం, బీజేపీ మధ్య తీవ్ర వాగ్యుద్ధమే నడిచింది.

దౌత్యం, రాజకీయ చొరవలతో

ప్రాంతీయ సమస్యల పరిష్కారం

భారత్, ఇరాన్ నిర్ణయం :ఇరుదేశాల ప్రధానులు భేటీ : 9 ఒప్పందాలపై సంతకాలు

న్యూఢిల్లీ : పొరుగు దేశాలు పచ్చగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. తమ పొరుగు దేశాలు ఉగ్రవాదరహిత దేశాలుగా మారాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహానీతో శనివారం మోడీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా భారత్-ఇరాన్ మధ్య 9 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఇరువురి సమక్షంలో ఎంఓయూలను ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం ఇరు వురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఇరాన్, భారతదేశం పరస్పరం గౌర వించుకుంటాయని నరేంద్ర మోడీ చెప్పారు. రౌహానీ నేతృత్వంలో ఇరు దేశాల సంబంధాలు బలోపేతమ య్యాయన్నారు. అనుసంధానతను విస్తరించాలని తాము ఆకాంక్షిస్తున్నామని, చాబహార్ నౌకాశ్రయం అభివృద్ధికి దోహదపడటానికి అనుమతించిన రౌహానీ దార్శనికతను మోడీ ప్రశంసించారు. ఆఫ్ఘనిస్థాన్ సురక్షితంగా, సౌభాగ్యవంతంగా ఉండా లని భారత్, ఇరాన్ కోరుకుంటున్నట్లు మోడీ చెప్పారు. రౌహానీ మాట్లాడుతూ భారత్-ఇరాన్ సంబంధాలు వాణిజ్యం, దౌత్యం వంటివాటికి అతీతమైనవని పేర్కొన్నారు. ఆ సంబంధాలు చారిత్రా త్మకం, నాగరికతతో కూడినవని చెప్పారు. భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయని, మరీ ముఖ్యంగా రవాణా, ఇంధనం రంగాల్లో పటిష్ట బాంధవ్యం ఉందన్నారు. ఉగ్రవాదం, అతివాదంతో పోరాడాలని ఇరు దేశాలు నిర్ణయించాయని చెప్పారు. ప్రాంతీయ సంఘర్షణలను దౌత్యం, రాజ కీయ చొరవ ద్వారా పరిష్కరించుకోవాలని పిలుపు నిచ్చారు. చాబహార్ పోర్టు అభివృద్ధిని శ్లాఘించారు.

రెండు దేశాల మధ్య వ్యాపార, ఆర్థిక సంబంధాల్లో కొత్త శకం ప్రారంభమవుతోందని రౌహానీ చెప్పారు. ఈ రెండింటి మధ్య దశాబ్దాలుగా దౌత్య సంబంధాలు ఉన్నాయని, భారత్‌తో వ్యాపార, దౌత్య సంబంధాలను మరింత మెరుగు పరచుకోవడానికే తాను ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్యా సంబంధాలు పశ్చి మాసియా దేశాల మధ్య వ్యాపార, ఆర్థిక సంబం ధాల ఎదుగు



దలకు దోహదం చేస్తాయన్నారు. భారతదేశం ఓ పుష్పగుచ్ఛంలాంటిదని, ఓ పుష్పగుచ్ఛంలో అన్ని రకాల పువ్వులూ ఉంటాయని, అలాగే భారత్‌లో ఎన్నో మతాలు, కులాలు, తెగలు ఐకమత్యంతో ఉంటున్నాయని పేర్కొన్నారు. టెక్నాలజీ, వైజ్ఞానిక రంగాల్లో ఇరు దేశాలు సహాయ, సహకారాలు అందించుకోవాలని రౌహానీ సూచించారు. భారత్‌లో అన్ని వర్గాల మధ్య శాంతి, సామరస్యం ఎప్పటికీ కొన సాగాలని ఆకాంక్షిం చారు. పలు దేశాలు ఇరాన్ ప్రజలకు వీసాల జారీలో జాప్యం చేస్తున్నాయని, ఇరాన్ మాత్రం అన్ని దేశాలు ప్రత్యేకించి భారత ప్రజలకు వీసాల జారీని సులభతరం చేసిందన్నారు.

ఇస్లామిక్ దేశాల మధ్య ఐక్యత లేకపోవడం వల్లే ఇజ్రాయెల్ రాజధానిగా జెరూసలెంను అమె రికా ప్రకటించే సాహసం చేసిందని రౌహానీ విమ ర్శించారు. ఇస్లామిక్ దేశాల మధ్య ఐక్యత లేనం దున అమాయక పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోందన్నారు. పాశ్చాత్య దేశాలు ముఖ్యంగా అమెరికాలో మానవత్వం మంటగలు స్తోందని, అమెరికాలోని విద్యాలయాలు, వ్యాపార సంస్థల్లో అమాయకులపై దాడులు సర్వసాధారణం అయ్యాయన్నారు. ఇస్లామిక్ దేశాలు తమ వ్యక్తిగత విశ్వాసాలు, నమ్మకాలను పక్కన పెట్టి ఇస్లాం ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.

ఆ స్కాంకు బీజేపీదే బాధ్యత: కాంగ్రెస్

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకులో నగల వ్యాపారి నీరవ్ మోడీ రూ.11,400కోట్ల కుంభకోణానికి పాల్పడేందుకు బీజేపీ బాధ్యత వహించాలని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ప్రధాని నరేంద్ర మోడీ ఆశ్రిత పెట్టుబడిదారి విధానాన్ని వ్యవస్థీకృతం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబల్ విమర్శించారు. మోడీ ప్రభుత్వం ఆర్థికరంగాన్ని అధ:పాతాళానికి దిగజర్చారని దీనివల్ల అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట తీవ్రంగా దెబ్బతినిపోతుందని సిబల్ అన్నారు. నీరవ్ మోడీపై సీబీఐ రెండవ ఎఫ్ఐఆర్ దాఖలు చేయడాన్ని సిబల్ ప్రస్తావిస్తూ అన్ని అవగాహన పత్రాలపై 2017లోనే అంటే ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు జరిగాయని, అయినప్పటికీ కుంభకోణం జరగకుండా ఈ ప్రభుత్వం నివారించలేకపోయిందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు రణదీప్ సర్జేవాలా, శక్తిసింగ్ గోహిల్, పవన్ ఖేరాతో కలిపి సిబల్ విలేకరులతో మాట్లాడుతూ సులభతర వ్యాపారం అంటే ఇలాం టిదేనా...? అని మోడీని ప్రశ్నించారు. యూపీఏ పాలన, ఎన్‌డీఏ పాలనపై చర్చకు రావలసిందిగా బీజేపీని ఆయన సవాలు చేసారు. వేలకోట్ల రూపాయల కుంభకోణంపై ప్రధానికార్యాలయం, ఆర్థిక మంత్రిత్వశాఖ కళ్లుమూసుకుని



ఉన్నదని సిబల్ ఆరోపించారు. ఇదంతా వారికి తెలుసు..అయినా నివారించలేదు అని సిబల్ ఆరోపించారు. మానవవ నరుల అభివృద్ధి శాఖ ఏం చేస్తున్నట్లు..?

సామాజిక న్యాయమంత్రి చేస్తున్న పనేంటి..? న్యాయమంత్రిత్వశాఖ ఈ స్కాంకు సంబంధించి ఏం చేస్తున్నది..? ఈ ప్రశ్నలకు ఆర్థికశాఖ కానీ ఆర్‌బీఐ కానీ సమాధానం చెప్పడంలేదు. మార్కెట్‌లో లిస్టు అయిన వజ్రాలు, నగల కంపెనీల పెట్టుబడులు 41.66 బిలియన్ కోట్లు ఉండగా, వాటి మొత్తం రుణం 94 బిలియన్ కోట్లు ఉన్నట్లు అంచనా..దీని అర్థం పెట్టుబడుల కంటే రుణం రెట్టింపుకుపైగా ఉంది. కుంభకోణం ఇక్కడే అర్థమవుతోంది.

కాంగ్రెస్ ప్రచారం అబద్ధం: బీజేపీ

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో వేలకోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిన నగల వ్యాపారి నీరవ్ మోడీ దేశం విడిచి పారిపోవడానికి బీజేపీదే బాధ్యత అని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ఒట్టి అబద్ధమని బీజేపీ నాయకురాలు, రక్షణమంత్రి నిర్మల సీతారామన్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేస్తున్నదని ఆమె అన్నారు. మోడీ ప్రభుత్వహయాంలోనే పంజాబ్ బ్యాంకులో నీరవ్ మోడీకి అనుకూలంగా అవగాహన పత్రాలపై సంతకాలు జరిగాయని కాంగ్రెస్ చేసిన విమర్శపై ఆమె స్పందించారు. నీరవ్ దేశం విడిచి పారిపోయాడు. అయితే ఆయనను పట్టుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కుంభకోణానికి పాల్పడే వ్యక్తులకు సహాయం చేయడానికి నేను కుట్రపన్నడంలేదు, అలాంటివారిని తమ ప్రభుత్వం పట్టుకుంటుంది అని ఆమె విలేకరులతో అన్నారు. నీరవ్ మోడీ నిర్వహించిన ప్రమోషనల్ కార్యక్రమానికి రాహుల్ గాంధీ హాజరయ్యాడని అమె ఆరోపించారు. గీతాంజలి జెమ్స్



ఆర్థికవ్యవస్థను పటిష్టం చేసేందుకు 2013లో అలహాబ్యాంకు ప్రభుత్వ డైరెక్టర్ అభ్యంతరం తెలియజేసినప్పటికీ ఆయన అభ్యంతరాన్ని నమోదుచేయలేదని మంత్రి ఆరోపించారు. చోక్సికి చెందిన గీతాంజలి జెమ్స్,నక్షత్ర,జిలీ కంపెనీలు 2017-18లో రూ.4,886 కోట్ల విలువైన 143 అవగాహన పత్రాలపై (ఎల్ఓయు) సంతకాలు చేసినట్లుగా సీబీఐ కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదుచేసిందని సంబంధిత అధికారులు తెలిపారు. సీబీఐ గతంలో రూ.280కోట్ల రూపాయల మోసానికి సంబంధించిన కేసులోనూ ఎఫ్ఐఆర్ నమోదుచేసింది.

20 మందిని పీకేసిన పిచ్చికుక్క



విశాలాంధ్ర - వినుకొండ : గుంటూరు జిల్లా వినుకొండ పట్టణ వీధుల్లో శనివారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ 20 మందిని కాటేసింది. వీరంతా గాయాలతో ప్రభుత్వాసుపత్రికి క్యూ కట్టారు. బాధితులతోపాటు కుటుంబ సభ్యులతో ఆసుపత్రి కిక్కిరిసిపోయింది. డాక్టర్ శ్రీనివాసరెడ్డి బాధితులకు వైద్యం చేశారు. ఉదయం ఏడు గంటల సమయంలో రెడ్డినగర్‌లోని తెల్ల రంగు పిచ్చికుక్క పరుగులు తీస్తూ జనంపై తెగబడింది. జనం కర్రలతో వెంటబడినా విష్ణుకుండినగర్, సీతయ్యనగర్, ఎన్నెస్పీ కాలువకట్ట, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో మరి కొందర్ని కరిచింది. తీవ్రంగా గాయపడిన వారిలో ఎస్.శంకర్(52), ఎం.రమణమ్మ(65), హనుమంతరావు(59), వెంకటనరసమ్మ (55), కె.శ్రీకాంత్(21), శ్రావణి(6), వెంకటేష్(11), మణికంఠ(15), రామాంజమ్మ(30), కళావెంకట్రావ్(31), ఎస్‌కె.మస్తాన్‌వలి (40), నాగమల్లీశ్వరి (52) ఉన్నారు. మున్సిపల్ సిబ్బంది ఈ కుక్కను హనుమాన్‌నగర్‌లో చంపినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె.ఇస్మాయిల్ తెలిపారు. వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడు, మున్సిపల్ చైర్మన్ సీహెచ్.సమీరాఖానం షమ్మీం, ఎస్.సైదా, పీవీ.సురేష్, వైద్యవిధాన పరిషత్ సభ్యులు డాక్టర్ జి.సాంబశివరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంఎస్.ప్రసాద్ తదితరులు ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు.

1,200 కిలోల గంజాయి పట్టివేత



విశాలాంధ్ర - పార్వతీపురం : విజయనగరం జిల్లా పార్వతీపురం సబ్ డివిజన్ పరిధిలోని రామభద్రపురం పోలీస్‌స్టేషన్ వద్ద వాహన తనిఖీల్లో 1,200 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు నింది తులను అరెస్టు చేశారు. పార్వతీపురంలో ని తన కార్యాలయంలో పార్వతీపురం ఏఎస్పీ దీపిక్ ఎం.పాటిల్ వివరాలను మీడియాకు వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం వాహనాల తనిఖీలో ఓ లారీలో 1200 కిలోల గంజాయితోపాటు లారీ డ్రైవర్ దీన్‌మొహమ్మద్, క్లీనర్లు జ్మషద్, అనీస్‌ను పట్టుకున్నారు. ఆ లారీ పాడేరు ప్రాంతానికి చెందిన గొండదొర శ్రీనివాస్, ఎ.సురేష్‌లకు చెందినదిగా తేల్చారు. ఈ లారీలో 42 గంజాయి బస్తాలను సుంకిలో లోడ్ చేసి ఒడిశా రాష్ట్రంలో బాలాసూరు జిల్లా బాలేస్వరు గ్రామానికి తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారన్నారు. దీని విలువ సుమారు రూ.36 లక్షలు ఉంటుందని భావించారు. నిందితులను కోర్టుకు తరలిస్తామన్నారు. సమావేశంలో సీఐ ఎస్.సంజీవిరావు, ఎస్.డీడీనాయుడు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ ఆడిట్ అధికారి రాజేంద్ర



విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరిజిల్లా కాకినాడలోని జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ ఆడిట్ అధికారి బత్తుల రాజేంద్ర శనివారం రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మత్స్యశాఖలో అటెండర్‌గా సేవలు అందించి పదవీ విరమణ చేసిన మాజీ ఉద్యోగి గండేపల్లి రామారావు 2016లో మృతి చెందారు. దీంతో తండ్రికి వచ్చే పెన్షన్ తనకు మంజూరు చేయాలని కోరుతూ కుమార్తె పద్మావతి సంబంధితశాఖకు దరఖాస్తు చేశారు. ఫైలు ఆ శాఖ నుంచి జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయానికి చేరింది. దీనిని ట్రెజరీకి పంపించాలంటే లంచం ఇవ్వాలని అసిస్టెంట్ ఆడిట్ అధికారి డిమాండ్ చేయడంతో బాధితురాలు ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. ఏసీబీ రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం.సుధాకర్ పర్యవేక్షణలో శనివారం లంచం తీసుకుంటుండగా కార్యాలయంపై దాడి చేసి పట్టుకున్నారు.

అక్రమ నిల్వలపై తెలంగాణ, ఏపీ అధికారుల దాడి



విశాలాంధ్ర - జగ్గయ్యపేటరూరల్ : తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దులో కృష్ణాజిల్లా రావికంపాడు పొలాల్లో నిల్వ చేసిన 240 క్వింటాళ్ల తెలంగాణ రేషన్ బియ్యాన్ని శనివారం అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో తెలంగాణ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆంధ్ర పౌరసరఫరాల శాఖ అధికారులు దాడిచేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. జగ్గయ్యపేట రూరల్ మండలంలోని రావికంపాడు గ్రామ పొలాల్లో కొందరు అక్రమ వ్యాపారులు రేషన్ బియ్యాన్ని పెద్దఎత్తున నిల్వ చేసినట్టు సమాచారం రావడంతో ఇరు రాష్ట్రాల అధికారులు మండల తహశీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆధ్వర్యంలో మెరుపుదాడి చేశారు. పట్టుకున్న 240 క్వింటాళ్ల బియ్యాన్ని జగ్గయ్యపేటలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించారు. దాడిలో పీడీఎస్ డీటీ రమేష్, వీఆర్వో రాంబాబు, తదితరులు ఉన్నారు.

చెప్పుల గోదాములో భారీ అగ్నిప్రమాదం



విశాలాంధ్ర - రాజానగరం : తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో హౌసింగ్ బోర్డు సమీపంలోని ఒక ప్రైవేటు కంపెనీ చెప్పుల గోదాములో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గోదాములో దట్టమైన పొగలు, మంటలు చెలరేగడంతో రెండు అంతస్తుల భవనంలోని చెప్పుల నిల్వలు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. వేసవి నేపథ్యంలో దాదాపు 5 లారీల స్టాక్ గోదాములో ఉన్నట్టు కంపెనీ సిబ్బంది తెలిపారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు



విశాలాంధ్ర-గుంటూరు సిటీ : కార్మికవర్గ ప్రయోజనాలను వదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా పారిశ్రామికవేత్తలకు తొత్తులుగా మారాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య విమర్శించారు. ఏఐటీయూసీ గుంటూరు నగర 10వ మహాసభ గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో శనివారం జరిగింది. తొలుత ఏఐటీయూసీ పతాకాన్ని ముఠా కార్మిక సంఘం నాయకులు పోనుగోటి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభకు ఏఐటీయూసీ నాయకులు బందెల రవికుమార్, రావుల అంజిబాబు, ఏ.అరుణ్‌కుమార్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాయడంలో ముందుందని దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా కార్మిక సంఘాలన్నీ ఒకే బాటలోకి వచ్చాయన్నారు. కార్మిక సంఘాల శక్తిని ఈ ప్రభుత్వాలకు చూపించే సమయం ఆసన్నమైందన్నారు. ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పరిపాలన సాగుతున్నదని, కార్మికుల శ్రేయస్సును మరచి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలోని మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, ఏఐటీయూసీ నాయకత్వం కార్మికవర్గం కోసం అనేక చట్టాలను, హక్కులను సాధించుకుందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ అనేక మంది త్యాగధనులు ఏఐటీయూసీ నాయకత్వాన ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. కార్మిక సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ ముందు భాగాన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మల్లెబోయిన పిచ్చయ్య, ఆలా గంగాధర్, బైండింగ్ బాబు, ఏ.నాగేశ్వరరావు, సాంబయ్య, లక్ష్మయ్య, పప్పుల రోశిరెడ్డి, ఏఐటీయూసీ నగర అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జర్నలిస్ట్స్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ ఫర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా (ఏజేయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ జర్నలిస్ట్స్ అవార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్టు ఏజేయూ రాష్ట్ర అధ్యక్షులు కాలే వాసుదేవనాయుడు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజంతో ప్రజా సమస్యలకు సంబంధించి వార్తలవల్ల సమాజానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అటువంటి వార్తల క్లిప్పింగ్‌లు కానీ, డీవీడీలను కానీ మార్చి 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ ఆఫీస్‌కు చేర్చితే ప్రాధాన్యతను గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తులు పంపేందుకు చిట్టిబాబు కాంప్లెక్స్, న్యూ అయోధ్యనగర్, సూర్యబాల అపార్ట్‌మెంట్ ఎదురు, విజయవాడ-3, సెల్ నెంబరు 9533392992లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో వై.శ్రీకాంత్‌బాబు, డి.శ్రీనివాసులు, అభి, చల్లా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిక్కుల్లో ఎస్కేయూ దూరవిద్య

- డీడీఈలో సమన్వయలోపం
- 30,423 మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం
- తెలుగు రాష్ట్రాల్లో 177 కేంద్రాలు
- మూడేళ్లు పూర్తయినా చలనం శూన్యం



విశాలాంధ్రప్రతినిధి - అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో దూరవిద్య బోధన మిథ్యగా మారింది. దీంతో అనంతపురం జిల్లాలోని విద్యార్థులు దూరవిద్య కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికే మూడు విద్యా సంవత్సరాలు పూర్తవుతున్నా నోటిఫికేషన్ విడుదల కాకపోవడం, 2015-16 విద్యా సంవత్సరంలో పరీక్షలు రాసిన విద్యార్థులకు సంబంధించి స్పష్టత లేకపోవడంతో దూరవిద్య కేంద్రం నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. యూనివర్సిటీ అధికారులు ఒకరిపై మరొకరు నెపం వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం 2008వ సంవత్సరంలో ఏర్పాటైంది. ఇందులో యూజీ, పీజీలతోపాటు బీఎడ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కేంద్రం నిర్వహణ కోసం ప్రతి మూడు, అయిదు సంవత్సరాలకు ఒకమారు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆఫ్ బ్యూరో (డెబ్) నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. దూరవిద్య కేంద్రం అధికారుల సమన్వయ లోపం కారణంగా 2014-15లో ఈ కేంద్రానికి 'డెబ్' అనుమతి రద్దయింది. అయినప్పటికీ అధికారులు 2015-16 విద్యా సంవత్సరంలో నోటిఫికేషన్ విడుదల చేసి అడ్మిషన్లు ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 177 స్టడీ సెంటర్ల ద్వారా యూజీ, పీజీ, బీఎడ్‌లలో 30,423 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. డెబ్ అనుమతి లేకపోయినప్పటికీ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించిన కేంద్రం సిబ్బంది ఫలితాలను సైతం విడుదల చేశారు. అయితే రెండవ సంవత్సరం తరగతులు, పరీక్షలు ఎప్పుడు నిర్వహించేదీ చెప్పేవారే కరవయ్యారు. మూడవ సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ యూనివర్సిటీ మార్చే పరిస్థితి లేకపోవడం, ప్రస్తుత దూరవిద్య కేంద్రం నుంచి సరైన సమాచారం లేకపోవడంతో 30,423 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లోని స్టడీ సెంటర్‌ల నిర్వాహకులు విద్యార్థుల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దూరవిద్య కేంద్రంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో కేంద్రం కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారింది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అందరికీ చేరువకావాల్సిన దూరవిద్య అధికారుల నిర్లక్ష్యం వల్ల మరింత దూరమవుతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

ఎంతో ప్రాధాన్యత ...

ఎస్కేయూకు పీజీ కేంద్రంగా ఉన్న రాయలసీమ విశ్వవిద్యాలయం 2008లో ఏర్పాటైంది. అప్పుడు అక్కడ కేవలం 1500 మంది విద్యార్థులు మాత్రమే దూరవిద్యలో ప్రవేశం పొందారు. తాజాగా రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎనిమిది వేలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ఎస్కేయూలో దూరవిద్య కేంద్రం లేకపోవడంతో ఇతర విశ్వవిద్యాలయాల వైపు వలసలు వెళుతున్నారనడానికి ఇదే పెద్ద నిదర్శనంగా చెప్పవచ్చు.

విద్యార్థుల భవిష్యత్ కోసం పోరాటం : ఎం.మధు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

దూరవిద్య కేంద్రం ఆరంభం నుంచి సమస్యలు ఉన్నాయి. సకాలంలో విద్యా క్యాలెండర్ ప్రకటించకపోవడం, నోటిఫికేషన్, స్టడీ మెటీరియల్ పంపిణీ ..ఇలా అన్నీ సమస్యలే. ఈ కేంద్రంలో వాస్తవ పరిస్థితులను గతంలో అనేకసార్లు జిల్లా ప్రజాప్రతినిధులు, మంత్రుల దృష్టికి తీసుకునివెళ్లాం. వారూ పట్టించుకోలేదు. ప్రస్తుతం మూడేళ్లు పూర్తవుతున్నా స్పష్టత లేకపోవడం దారుణం. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు త్వరలో యూనివర్సిటీ ముట్టడి ద్వారా పోరాటాన్ని తీవ్రతరం చేస్తాం.

మత్స్యకారుల జీవనోపాధికి గండం

చేపల వేట నిలిపివేసిన 700 బోట్లు

విశాలాంధ్ర - విశాఖపట్నం : రాష్ట్రంలో మత్స్యకారులకు చేపల వేట ప్రశ్నార్థకమవుతోంది. ఒకప్పుడు తీరంలో ఇబ్బడిముబ్బడిగా దొరికే మత్స్యసంపద నేడు కనుచూపుమేర కానరాని పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు 700 బోట్లు వేటకు వెళ్లకుండా తీరంలోనే ఉండిపోతున్నట్టు సమాచారం. నెలలు తరబడి వేటకు వెళ్లినా బోటు ఖర్చులకు సైతం రాకపోవడంతో వేటను నిలిపివేస్తున్నాయి. సముద్ర జలాల్లో కాలుష్యం పెరగడంతో మత్స్యసంపద అంతరించిపోతోంది. అధికారులు ఎటువంటి కాలుష్య నివారణ చర్యలు చేపట్టకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో వేటకు వెళ్లిన బోట్లకు నష్టాలు తప్పడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా అయిదు లక్షలకు పైగా మత్స్యకార కుటుంబాలు చేపల వేట ఆధారంగా జీవిస్తున్నాయి. ప్రస్తుతం వీరి జీవనోపాధికి పెనుముప్పు ఏర్పడింది. విశాఖ, కాకినాడ, శ్రీకాకుళం, భావనపాడు తీరంలో కాలుష్యం తీవ్రంగా పెరగడంతో సముద్రజలాల్లో మత్స్యసంపద మరో ప్రాంతానికి తరలిపోతోంది. విశాఖ కేంద్రంగా ఒక బోటు వేటకు వెళ్లి తిరిగి రావడానికి 400 లీటర్ల డీజిల్ అవసరమవుతుంది. లీటరు డీజిల్ రూ.67 చొప్పున కొనుగోలు చేయాల్సి రావడంతో ఒక బోటుకు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. 15 నుంచి 18 రోజుల పాటు సముద్రంలో వేట సాగించి తిరిగివస్తారు. ఒక్కో బోటుకు రూ.లక్షల్లో నష్టాలు రావడంతో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. ప్రభుత్వం డీజిల్ సబ్సిడీని కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో మత్స్యకారులకు కష్టాలు తప్పడం లేదు.

'బొమ్మరిల్లు' రాయల్ రాజాకు రిమాండ్



విశాలాంధ్ర - మచిలీపట్నం : పేదలు దాచుకున్న డబ్బును దోచుకున్న ఘరానా మోసగాడు, బొమ్మరిల్లు ప్రాన్స్ అండ్ విల్లాస్ అధినేత రాయల్ రాజాను అరెస్టు చేసిన సీఐడీ పోలీసులు శనివారం కృష్ణాజిల్లా మచిలీపట్నం కోర్టుకు తీసుకొచ్చారు. న్యాయమూర్తి సెలవులో ఉండడంతో స్థానిక తహశీల్దార్ ఎదుట హాజరు పర్చారు. నేర అభియోగం ఎదుర్కొంటున్న రాజాకు 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించడంతో మచిలీపట్నం సబ్‌జైలుకు తరలించారు. డిపాజిట్లకు అధిక వడ్డీలు ఇస్తామని, రుణాలు మంజూరు చేస్తామని, రియల్ ఎస్టేట్ వెంచర్లు లాంటి మోసపూరిత ప్రకటనలతో ఏజెంట్లను నియమించుకున్న రాయల్ రాజా మచిలీ పట్నం బస్టాండ్ వెనుక అట్టహాసంగా ప్రధాన కార్యాల యం ఏర్పాటు చేశారు. ఏజెంట్లలో అధిక సంఖ్యలో మహిళలను నియమించుకున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలను లక్ష్యంగా చేస్తుకుని అధిక వడ్డీ ఇస్తామంటూ పొదుపు డిపాజిట్ల పేరుతో లక్షలాది రూపా యలు వసూలు చేశాడు. నిర్ణీత గడువు దాటినప్పటికీ డిపాజిట్ దారులకు చెల్లించకుండా కాలయాపన చేశాడు. తాము మోసపోయినట్టు గ్రహించిన డిపాజిట్‌దారులు 2014లో చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో సంస్థ అధినేత రాయల్ రాజాపై కేసు పెట్టారు. దీంతో చిలకలపూడి పోలీసులు అప్పటి నుంచి గాలిస్తున్నా రాజా తప్పించు తిరుగుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా రాజా మోసాల చిట్టా బయటకు రావడంతో అతనిపై పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. మచిలీపట్నంలోనే కోటి 50 లక్షల రూపాయల వరకు ఖాతాదారులను మోసంచేశారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ సీఐడీ అధికారులు శనివారం పోలీసు బందోబస్తు మధ్య రాయల్ రాజాను మచిలీపట్నం తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న బాధితులు పెద్ద ఎత్తున కోర్టు ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా బాధితులు ఎవరినీ రాజాతో మాట్లాడటానికి అనుమతించలేదు.

టీడీపీ అంటే తెలుగు డ్రామా పార్టీ

కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్



విశాలాంధ్ర - తిరుపతి కార్పొరేషన్ : రాబోయే 2019 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ అన్నారు. నాలుగేళ్లలో విభజన చట్టంలోని ఒక్క అంశాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేని మోడీ ప్రభుత్వం, కేంద్రంతో పోరాడకుండా కాలయాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్రామాలాడుతున్నారన్నారు. టీడీపీ అంటే తెలుగు డ్రామా పార్టీ అని ఆయన అన్నారు. తిరుపతిలోని బాలాజీ కాలనీలో అంబేద్కర్ భవన్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2014 విభజన చట్టంలో కడప స్టీల్ ప్లాంట్, విశాఖలో పెట్రోలియం యూనివర్సిటీ, రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వాలని స్పష్టంగా ఉన్నాయన్నారు. చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నప్పటికీ చట్టంలో అంశాల అమలు కోసం తాడోపేడో తేల్చుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అవినీతిమయంగా మారిందన్నారు. అన్ని రాష్ట్రాలలో సామాజిక న్యాయం ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా కానరావడం లేదన్నారు. సోకు వారిది.. సొమ్ము మాది అనే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులకు ఇప్పుడు పునాదులు వేసుకుంటున్నారు. చంద్రగిరిలో రెండు ఎకరాల పేద కుటుంబంలో పుట్టి చెప్పులు లేకుండా తిరిగిన చంద్రబాబునాయుడు ఈ రోజు దేశంలోనే ధనిక ముఖ్యమంత్రి ఎలా అయ్యారో ప్రజలకు వివరించాలన్నారు. రాయలసీమకు స్పెషల్ ప్యాకేజీ పెట్టింది మేమేనని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే విభజనలోని అన్ని అంశాలను అమలు చేస్తామ న్నారు. విభజన సమయంలో చాలా బాగా ఆలోచన చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతా మోహన్, నాయకులు శ్రీదేవి, కె.ఎం.సత్యనారాయణ, తాళ్లపాక గోపాల యాదవ్, పూతలపట్టు ప్రభాకర్, ప్రమీల, శాంతియాదవ్, మునిలక్ష్మి, సావిత్రియాదవ్, రవికుమార్ పాల్గొన్నారు.

20 ఎకరాల్లో ఎన్టీఆర్ నట శిక్షణా కేంద్రం

- రూ.4 కోట్లలోపు బడ్జెట్ సినిమాలకు రాయితీలు
- త్వరలో షార్ట్ ఫిలిమ్స్‌కు నంది బహుమతులు
- నాటక కళకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ



విశాలాంధ్ర - తెనాలి : సినిమా, టీవీ రంగాలకు ఆదరణ పెరిగి నాటక రంగానికి ప్రోత్సాహం కొరవడిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కృషి చేస్తుందని ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ అన్నారు. రాజధాని పరిధిలో ఎన్టీఆర్ నట శిక్షణా కేంద్రం నిర్మాణం కోసం కేటాయించిన 20 ఎకరాల్లో భవన నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు. ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నాటకోత్సవాలు కొనసాగుతున్న క్రమంలో శనివారం ఆయన విచ్చేసి ఆంధ్ర మహావిష్ణు పద్య నాటక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం హైదరాబాద్ రవీంద్రభారతికి దీటుగా ఉందని ప్రశంసించారు. రాష్ట్రంలో 90 రోజుల పాటు నంది నాటకోత్సవాలు కొనసాగుతున్నాయని, అనంతరం టీవీ కళాకారుల నంది బహుమతులు, నాటక రంగ నంది బహుమతుల ప్రదానోత్సవ సభలు విశాఖ, విజయవాడలో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధంచేస్తున్నామన్నారు. నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. సినిమా , టీవీ, నాటక నందుల మాదిరిగానే షార్టు ఫిలిమ్స్ కూడా నంది బహుమతులు ఇచ్చే కార్యాచరణకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో సినీరంగాన్ని ప్రోత్సహించేందుకు నాలుగు కోట్ల రూపాయల లోపు బడ్జెట్ చిత్రాలకు కొన్ని రాయితీలు కల్పిస్తున్నామన్నారు. నాటక రంగ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, తెనాలి మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, ఎఫ్‌డీసీ మేనేజర్ శేషతల్ప సాయి తదితరులు పాల్గొన్నారు.

పరారీలో కిలాడీ లేడీ

భక్తి ముసుగులో రూ. కోట్ల వసూలు



విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు : భక్తి ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ అదృశ్యమైన మహిళ మెతుకు వెంకట నాగవాసవి కోసం పోలీసులు వేటను ముమ్మరం చేశారు. నెల్లూరు నగరంలోని ప్రశాంతినగర్‌లో గురుదత్తాత్రేయ ఆశ్రమం అడ్డాగా చేసుకుని ఈమె రూ.కోట్లు వసూలు చేసి పరారయ్యారు. ఒంగోలు నగరంలోని మిర్యాలపాలేని కి చెందిన మెతుకు వెంకట నాగవాసవికి తొమ్మిదేళ్ల క్రితం సునీల్ అనే వ్యక్తితో వివాహమైంది. విభేదాలతో దంపతులిద్దరూ విడిపోయారు. అనంతరం ఆంజనేయులును ఆమె రెండో వివాహం చేసుకున్నారు. కొద్దికాలానికే ఆయనకు కూడా దూరంగా ఉంటు న్నారు. ఈ క్రమంలో ఒంగోలులోని ట్రంక్ రోడ్డులో ఉన్న ఓ ఫర్నిచర్ దుకాణం యజమాని బాషా అలియాస్ మస్తాన్‌తో పరిచయం ఏర్పడింది. ఇటీవల మహామంత్ర యాగం పేరుతో నెల్లూరు ప్రశాంతినగర్‌లో కొన్ని వారాలుగా ఆశ్రమం నడుపుతున్న వాసవి భక్తుల నుంచి సుమారు నాలుగు కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం. ఈ డబ్బును కుటుంబసభ్యులకు, ఒంగోలు లోని స్నేహితులకు చేరవేసిన ఆమె పక్కా ప్రణాళికతో ఆరేళ్ల చిన్నారితో కలిసి పరారైనట్టు తెలుస్తోంది. నెల్లూరులోని ఆశ్రమాన్ని నిర్వహించే సుధాకర్‌కు, వాసవికి మధ్య సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఈ ఏడాది మామిడి ముంచినట్టే

- నెల్లూరు రైతును వెంటాడుతున్న నష్టాలు
- చెట్లకు కనిపించని పూత
- నీటి సమస్య, మంచు దెబ్బతో ముప్పు



విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు : నాలుగేళ్ల నుంచి జిల్లాలో రైతులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏ పంట సాగుచేసినా నష్టాలు రావడంతో వ్యవసాయం అంటే రైతులు భయపడుతున్నారు. మామిడి రైతులను వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో మామిడి సాగు ఉంది. 80 శాతం బంగినపల్లి రకం మామిడి సాగు ఉంటే మిగిలిన 20 శాతం బెంగళూరు, రసాలు ఉన్నాయి. సూళ్లూరుపేట, గూడూరు, రాపూరు, ఉదయగిరి, కలిగిరి, వింజమూరు, ఆత్మకూరు, కావలి ప్రాంతంలోని తుమ్మలపెంట, రుద్రకోట, మద్దూరుపాడు, కొత్తపల్లి, చింతలపాళెం, చిన్నపవని, పెద్దపవని, రామవరప్పాడు, చోడవరం, యర్రబల్లి, మునునూరు, నెల్లూరు రూరల్, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, అనంతసాగరం, సోమశిల, ఉదయగిరి, సీతారామపురం, వింజమూరు, దుత్తలూరు, కలిగిరి, కొండాపురం, మర్రిపాడు, చేజర్ల, పొదలకూరు, సైదాపురం, గూడూరు, నాయుడుపేట ప్రాంతాల్లో మామిడి తోటలు ఎక్కువ. ఏటా ఈ సమయానికి మామిడిచెట్లకు పూత పూయాల్సి ఉన్నప్పటికీ దాని జాడ కానరాని పరిస్థితి. మార్చి నాటికి పూత, పిందెతో చెట్లన్నీ కళకళలాడుతుంటాయి. తెలుగు సంవత్సరాది ఉగాది నాటికి మామిడి చెట్లన్నీ పూత, పిందెలతో ఉంటాయి. కానీ నీరు సక్రమంగా అందకపోవడం, భూగర్భజలాలు అడుగంటడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు మామిడి పంటకు ముప్పుగా పరిణమించాయి. పగలు, రాత్రి నిరంతరం మంచు, చలిగాలుల కారణంగా చెట్లకు పూత రాలేదు. కొన్ని చోట్ల చెట్లను తెగుళ్లు చుట్టు ముట్టాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పెట్టు బడులు పెరుగుతున్నాయే తప్ప.. చెట్ల ఎదుగు దలలో మార్పు కనిపించని పరిస్థితి. ఉన్నట్టుండి ఎండలు పెరగడంతో మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

దిగుబడిపై ప్రభావం తప్పదు

వర్షాభావ పరిస్థితులతో పూత రాకపోవడంతో ఈ ఏడాది దిగుబడి తగ్గుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే.. ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. డిసెంబరు, జనవరి నెలల్లో వాతావరణం అనుకూలిస్తే పూత ఉండి కాయల ఎదుగుదలతో మంచి దిగుబడులు వచ్చేవి. ఇప్పటికి పూత జాడే లేదు. ఫిబ్రవరిలో పూత వచ్చినా రెండు టన్నులకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం చెట్లకు పూత వచ్చినా నిలబడడం కష్టం. నీరు, ఇతర మందుల కోసం పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చే పరిస్థితి కానరావడం లేదు. తోటలను పరిశీలించి ఎప్పటికప్పుడు సూచనలు చేయాల్సిన ఉద్యానవన శాఖాధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశారు

మోడీపై రాహుల్ ఫైర్



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. శనివారం కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ సమావేశం అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు. పరీక్షలకు ఎలా హాజరవ్వాలో గంటలపాటు నరేంద్ర మోడీ విద్యార్థులకు బోధిస్తున్నారని, అయితే నీరవ్ మోడీ చేసిన మోసాలకు బాధ్యత ఎవరిదో చెప్పడం లేదని ఆరోపించారు. దేశం నుంచి డబ్బును నీరవ్ మోడీ తీసుకెళ్ళి పోయారన్నారు. నరేంద్ర మోడీ రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసి, ప్రజల సొమ్మును బ్యాంకుల్లో వేయించారన్నారు.

బ్యాంకుల్లో సొమ్ము భద్రంగా ఉంటుందని నరేంద్ర మోడీ చెప్పారన్నారు. కానీ రూ.22,000 కోట్ల కుంభకోణం జరిగితే కనీసం ఒక్క మాట అయినా మాట్లాడటం లేదన్నారు. ప్రజల సొమ్మును బ్యాంకుల్లో వేయించి, ఆయన స్నేహితులు, వ్యాపారవేత్తలు బ్యాంకుల నుంచి దోచుకుపోతూ ఉంటే చోద్యం చూస్తున్నారని ఆరోపించారు.

మార్చి 16 నుంచి కాంగ్రెస్ జాతీయ ప్లీనరీ

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్లీనరీ తేదీలు ఖరారయ్యాయి. మార్చి 16 నుంచి 18 వరకు ఢిల్లీలో జాతీయ ప్లీనరీ జరుగుతుందని ఆ పార్టీ వర్గాలు శనివారం ఒక ప్రకటన చేశాయి. జాతీయ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఎన్నికకు ఆమోదం తెలపడం, నూతన వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఏర్పాటు లాంటి తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించనున్నారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఈ సమావేశాలను కీలకంగా భావిస్తున్నది.

91 ప్రధాన రిజర్వాయర్లలో తగ్గిన నీటిమట్టం



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 91 ప్రధాన రిజర్వాయర్లలో నీటి మట్టం గతవారంలో ఉన్న 41 శాతం నుంచి మొత్తం సామర్థ్యం 39 శాతానికి పడిపోయి నట్లు కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపిది. ఫిబ్రవరి 15 నాటికి ఈ రిజర్వాయర్లలో నీరు 63.597 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం) ఉంది. గత ఏడాది ఇదే కాలంలో రిజర్వాయర్లలో తాజా నీటి నిల్వ స్థాయి 88 శాతంగా ఉండగా, గత దశాబ్ద కాలంలో సగటును 91 శాతం నిల్వ స్థాయి కలిగి ఉన్నట్లు ఆ ప్రకటన పేర్కొంది. పంజాబ్, రాజస్థాన్, జార్ఖండ్, ఒడిశా, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రిజర్వాయర్లలో గత ఏడాది కన్నా తక్కువ నీటి నిల్వలు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ మాత్రం గత ఏడాదికి సమాన నీటి నిల్వలను కలిగి ఉంది. హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, త్రిపుర, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లోని ప్రధాన డ్యామ్‌లు గత ఏడాదికంటే మెరుగైన నీటి నిల్వ స్థాయిలను కలిగి ఉన్నాయి. ఈ ప్రధాన రిజర్వాయర్‌ల అన్నింటి మొత్తం నిల్వ సామర్థ్యం 161.993 బీసీఎం.

ప్రయివేటు బాటలో పర్యాటకం



- పీపీపీ పద్ధతిలో హోటళ్ల నిర్వహణ
- ఇప్పటికే 113 అవగాహన ఒప్పందాలు
- సర్కార్ చర్యలపై సర్వత్రా విమర్శలు

విశాలాంధ్ర-అమరావతి : నవ్యాంధ్ర రాజధానిలో పర్యాటకానికి పెద్ద పీట వేస్తూ అభివృద్ధి చేస్తామంటూ ఊదరగొడుతున్న ప్రభుత్వం ఆతిథ్యం ఇచ్చే హోటళ్లను ప్రయివేట్ రంగానికి అప్పగించేందుకు విస్తృత ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పర్యాటక పరమైన అభివృద్ధి అంతంత మాత్రంగా ఉన్న నవ్యాంధ్రలో ప్రయివేటు రంగానికి పర్యాటక రంగంలో ప్రాధాన్యత కల్పిస్తే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టమవుతోంది. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోటళ్లను పూర్తి స్థాయిలో ప్రయివేటు పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) పద్ధతిలో ప్రయివేటీకరించాలని సర్కార్ యోచిస్తోంది. ప్రయివేటు ఆపరేటర్లకు అప్పగించి ఆర్థికంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయవచ్చనే ఆలోచనలో పర్యాటక శాఖ అధికారులు ఉన్నారు. అయితే ఇదే జరిగితే ఆర్థికాభివృద్ధి మాట అటుంచితే ఇప్పటికే పర్యాటక శాఖలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నానాఅవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సేవలందిస్తున్న హోటళ్ల ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించినట్లయితే తక్కువ వేతనాలకు పని చేసే వారిని విధుల్లోకి తీసుకొని ప్రస్తుతం ఉన్న వారిని సాగనంపే ప్రయత్నం జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే తక్కువ వేతనాలకు వచ్చే సిబ్బంది ఏ రీతిన సేవలందిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఇప్పటికే ఆదాయానికి గండి

పర్యాటక శాఖ ఆదాయంలో ప్రధాన వనరైన బస కేంద్రాలు దాదాపుగా ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వం దాదాపు 43 హోటళ్లను కలిపి హరిత హోటళ్ల చైన్‌ను గతంలో టూరిజం శాఖ ఏర్పాటు చేసింది. అయితే వాటిల్లో ఇప్పటికే రెండు హోటళ్ల ఆస్తులను ప్రయివేట్ నిర్వహణ నిమిత్తం లీజుకు ఇచ్చింది. అప్పుడే అటు ప్రతిపక్షాలు, ఇటు పర్యాటకులు తీవ్రంగా వ్యతిరేకించారు. విజయవాడ, విశాఖపట్నం, అరకు వ్యాలీ, తిరుపతి, హార్సిలీ హిల్స్, కుప్పం, కర్నూలు, ద్వారకా తిరుమల, శ్రీశైలం, నెల్లూరు, కడప, శ్రీకాళహస్తి, ఓర్వకల్లు, దిండిలో టూరిజం హోటళ్లు, రిసార్ట్‌లు ఉన్నాయి. ఇవి కాక శ్రీకాకుళం, కాకినాడ, చింతపల్లి, తుమ్మలపెంట, తిరుపతిలలో నూతనంగా హోటళ్లను, రిసార్టులను టూరిజం శాఖ ఇటీవల ప్రారంభించింది. అయితే యాత్రికులు బస చేసేందుకు అవకాశమున్న సదుపాయాలు పుష్కలంగా ఉన్న ప్రయివేట్ హోటళ్లయిన తాజ్, ఐటీసీ, నోవాటెల్ వంటి కంపెనీలకు సంబంధించిన త్రీ స్టార్ హోటళ్లలో పర్యాటకులు ఉండేందుకు వీలుగా 200 గదులను టూరిజం శాఖ ఇప్పటికే ఏర్పాటు చేసింది. శాఖ చర్యలతో ఆదాయం రావటం ఏమోకాని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడటం గమనార్హమైన అంశం. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణంలో పర్యాటకానికి పెద్ద పీట వేస్తామన్న ముఖ్యమంత్రి ఇప్పటికే పలు సంస్థలతో రూ.14 కోట్ల విలువైన 113 అవగాహన ఒప్పందాలను ప్రయివేట్ వ్యక్తులైన పెట్టుబడిదారులతో కదుర్చుకున్నారు. హైవే ప్రయాణికులకు సేవలందించాలన్న ఉద్దేశంతో జాతీయ రహదారుల పక్కన సైతం అలంకానిపల్లి, ఒంటిమిట్ట, గోపవరం, తాళ్ళపాక, లేపాక్షి వద్ద రెస్టారెంట్లు, వాష్ రూమ్స్, పార్కింగ్ స్థలాలు, క్యాంటీన్, పిల్లల ఆట స్థలాలు వంటి సదుపాయాలు కల్పించారు.

ఇదే క్రమంలో నగరి, ఉదయగిరి, కలికిరితో పాటు మరిన్ని ప్రాంతాల్లో సదుపాయాల కల్పన పనులు ముగింపు దశలో ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ నేతృత్వంలో నడుస్తున్న ఇటువంటి వాటి సేవలు ప్రస్తుతం ఉచితంగా అందుతున్నాయి. కాగా ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళితే రుసుము చెల్లించి వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే ప్రయివేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లిన పర్యాటక ప్రాంతాలలో వసూళ్ల పర్వం ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఆధునిక పరిజ్ఞానం పేరుతో ప్రభుత్వం చేపట్టిన హోటళ్ల ప్రైవేటీకరణ సుదూరాల నుంచి వచ్చే యాత్రికులకు భారంగా మారనుంది. రాజధాని అమరావతిలో పర్యాటకానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా ప్రైవేటీకరిస్తూ సామాన్యుడికి పర్యాటకం అందని ద్రాక్షగా మారుస్తారేమో అనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యాటకులకు కొన్ని సేవలు ఉచితంగా, మరికొన్ని సేవలు నామమాత్రపు రుసుముతో అందించాల్సిన ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరణ బాట పట్టడం ఆందోళనను కలిగిస్తోంది. నాణ్యత కొరవడటంతోపాటు పర్యాటకుల భద్రతపై నీలినీడలు కమ్ముకునే అవకాశం ఉందని పలువురు యాత్రికులు వ్యాఖ్యానిస్తున్నారు. మరి సర్కార్ ఏ విధమైన నిర్ణయాలు తీసుకోనున్నదో సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

జేఎన్‌యూలో మరో వివాదం



న్యూఢిల్లీ : ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) యాజమాన్యం మరో కొత్త వివాదానికి తెరదీసింది. స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు, హాస్టల్ వసతితోపాటు ఇతర సౌకర్యాలు పొందాలంటే క్లాసులకు హాజరు తప్పనిసరిగా 75శాతం ఉండాలని యూనివర్సిటీ యాజమాన్యం సర్కులర్ జారీ చేసింది. దీనితో యాజమాన్యానికి, విద్యార్థులకు మధ్య వివాదం తలెత్తింది. విద్యార్థులు క్లాసులు బహిష్కరించి వర్సిటీ ఆవరణలోనే నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. పార్ట్ టైం కోర్సులకు సైతం 75శాతం హాజరు ఉండాలని యాజమాన్యం నిబంధనలు విధించింది. ఈ సమస్యపై వైస్ చాన్సలర్‌తో మాట్లాడేందుకు అనుమతించకపోవడంతో రెండు రోజుల క్రితం జేఎన్‌యూ పాలనా భవనాన్ని విద్యార్థులు దిగ్బంధం చేసారు. ఇద్దరు అధికారులను కొన్ని గంటలపాటు పాలనా భవనం నుంచి బయటకి వెళ్లేందుకు అనుమతించని విద్యార్థులపై పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసారు. ఢిల్లీలో ఇతర యూనివర్సిటీలు తరగతులకు హాజరును తప్పనిసరి చేసినప్పటికీ ఎంఫిల్, పిహెచ్‌డీ విద్యార్థులకు నిబంధనలను సడలించారు. ఢిల్లీ యూనివర్సిటీలో, దాని అనుబంధ కాలేజీల్లో గ్రాడ్యుయేషన్ లోపు విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షకు హాజరు కావాలంటే 66శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన ఉంది. పిహెచ్‌డీ విద్యార్థులకు ఈ నిబంధన లేదు. నిబంధనలు ఒక కాలేజీకి, మరో కాలేజీకి వేరువేరుగా ఉన్నాయి. తాజా ఆందోళన ప్రారంభమైన రోజు నుంచి విద్యార్థులకు వర్సిటీ ఆవరణలోనే లాన్లు, ఇతర ప్రదేశాలలో లెక్చెరర్లు స్వచ్ఛందంగా క్లాసులు నిర్వహిస్తున్నారు. నిబంధనలను తాము వ్యతిరేకించడంలేదనీ అయితే అర్థం లేకుండా నిరంకుశమైన విధానాలను అమలు జరపడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని విద్యార్థి యూనియన్ అధ్యక్షురాలు గీతా కుమారి చెప్పారు.



మతోన్మాదులపై పోరాడుదాం

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి: ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-కడప జిల్లా పరిషత్: కడపలో సీపీఐ 26వ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 6 నుంచి 10 వరకు జరుగుతున్నాయని వీటిని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి, కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని, ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమతో కేంద్రీయ విశ్వ విద్యాలయం, ఎయిమ్స్ ఉర్దూ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు నిధులు కేటాయించడం లేదన్నారు. ఈ తరుణంలో సీపీఐ 26వ రాష్ట్ర మహాసభలు కడపలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో నియంతృత్వ పాలన కొన సాగుతోందని, విభజన చట్టంలో ఉన్న ఏ ఒక్క హామీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయక పోవడం శోచనీయమన్నారు. చంద్రబాబు ఓటుకు నోటు కేసుకు భయపడుతున్నాడని, అందుకే కేంద్రాన్ని అడగటం లేదని దుయ్యబట్టారు. కడప ఉక్కు పరిశ్రమపై అనేక ఉద్యమాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చలనం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం హిందుత్వ రాజకీయాలు చేస్తోందని, మతం పేరుతో, దేశభక్తి పేరుతో మేధావులు, జర్నలిస్టులను హత్య చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ ప్రణాళిక రూపొందించడం కోసం సీపీఐ రాష్ట్ర మహాసభలు వేదిక కాబోతున్నాయని ఆయన వివరించారు. ఏప్రిల్ 6న సాంస్కృతిక కార్యక్రమాలు, 7న భారీ ప్రదర్శన, బహిరంగ సభ , 8, 9, 10 తేదీలలో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, జాతీయ కార్యదర్శి డి.రాజా, నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొంటున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, జిల్లా సమితి సభ్యులు రాము, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు బషీరున్నిసా, కార్యదర్శి విజయలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగాసురేష్, అంకుశం, మద్దిలేటి పాల్గొన్నారు.

జీఎస్టీ కేసులో వర్మను విచారించిన పోలీసులు

సోమవారం మరోమారు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండే ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ ఇటీవల జీఎస్టీ సినిమాతో మరోమారు అనేక వివాదాలకు తెరలేపారు. తాజాగా వెబ్‌లో విడుదల చేసిన ఈ జీఎస్టీపై పెనుదూమారం లేపిన విషయం తెలిసిందే. చిత్రంలో అశ్లీలతపై మహిళా సంఘాల తీవ్రస్థాయిలో మండిపడడంతో పాటు అందోళనలు చేశారు. మహిళలను కించపరిచేలా వర్మ ఇలాంటి సినిమాలు తీసి దేశ సంస్కృతిని అవమానిస్తున్నారని మహిళా సంఘాలు హైదరాబాద్‌లో సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐటీ చట్టం ఐపీసీ సెక్షన్లు 506,509 కింద ఆయనపై రెండు కేసులను పోలీసులు నమోదు చేశారు. ముఖ్యంగా సామాజిక కార్యకర్త దేవిపై వర్మ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మహిళా సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేసుకు వ్యక్తిగతంగా హాజరుకావాలని పోలీసులు పలుమార్లు ఆర్జీవీకి నోటీసులు పంపారు. ఈ సందర్భంగా శనివారం సీసీఎస్ కార్యాలయానికి ఆయన తన అడ్వకేట్‌తో కలిసి వచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు సీసీఎస్‌కు చేరుకున్న అయన్ని పోలీసులు 3.20 గంటల వరకు విచారించారు. ఈ సందర్భంగా ఆయన్ని పలు అంశాలపై పోలీసులు ప్రశ్నించినట్లు తెలుస్తుంది. అయితే ఆర్జీవీ మాత్రం ఈ సినిమా చిత్రీకరణ మొత్తం విదేశాల్లోనే జరిగిందని, అప్‌లోడ్ కూడా విదేశాల నుండే జరిగిందని తెలిపినట్లు తెలుస్తుంది. విదేశాల్లో తీసిన చిత్రాలకు మన దేశ చట్టాలు వర్తించవని ఆర్జీవీ వాదించినట్లు తెలుస్తుంది. సోమవారం మరోమారు విచారణకు హాజరు కావాలని పోలీసులు ఆయనకు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.అదే సమయంలో వర్మ మొబైల్‌ఫోన్‌తో పాటు ఆయన ల్యాప్‌టాప్‌లను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా సైబర్ డీసీపీ రఘువీర్ విలేఖరులతో మాట్లాడుతూ, ఈ కేసును అన్ని కేసుల్లా విచారించలేమని దీన్ని సాంకేతికంగా చాలా అధారాలు సేకరించాల్సి ఉందన్నారు. ఈ కేసులో వర్మ దోషిగా తెలితే మాత్రం అతనికి కనీసం రెండేళ్ల నుంచి ఏడేళ్ళ వరకు శిక్ష పడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కోర్టులో ప్రవేశపెట్టేందుకు అవసరమైన అధారాలను సేకరించామని, ఇంకా అవసరమైన ఆధారాలు సేకరించిన తర్వాతే అరెస్టుపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

మరో చిరులా మారుతున్న పవన్ - ఏపీ ప్రజలు మేల్కొవాలి : ఆర్జీవీ

రాంగోపాల్‌వర్మ మరోమారు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, ప్రముఖ నటుడు చిరంజీవిపై విరుచుకుపడ్డారు. ఇద్దరు అన్నదమ్ములను టార్గెట్ చేస్తూ ట్విట్టర్‌లో వర్మ కామెంట్లను పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ, రాజకీయవేత్త ఉండవల్లి అరుణ్‌కుమార్ వంటి మేధావులతో చేతులు కలపడం ద్వారా పవన్ కల్యాణ్ మరో ఘనతను సాధించారని ఆయన పొగిడారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఇదే ఆత్మస్థైర్యంతో అన్ని నియోజకవర్గాల్లో పవన్ పార్టీ పోటీ చేయాలని లేదంటే ఆయన సోదరుడు చిరంజీవి కన్నా పెద్ద తప్పు చేసినవాడవుతారని హెచ్చరించారు. చిరంజీవిలా పవన్ కల్యాణ్ మారిపోక ముందే ఏపీ ప్రజలు మేల్కొనాలని, లేకపోతే ప్రజారాజ్యం కన్నా దారుణంగా జనసేన తయారవుతుందని వ్యాఖ్యానించారు.

మోడీ విధానాలతో ఆర్థిక వ్యవస్థ ఛిద్రం

- మితవాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్యపోరు
- నల్లధనంపై మాట్లాడేందుకు భయపడుతున్న ప్రధాని
- ఖమ్మం బహిరంగ సభలో సురవరం



విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : దేశంలో బీజేపీ, సంఘ పరివార్ శక్తుల ప్రభావంతో మితవాద పోకడలు పెరిగాయని, వాటిని అడ్డుకునేందుకు దేశ వ్యాప్తంగా వామపక్ష పార్టీలు ప్రధానంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులను కలుపుకుని ప్రతిఘటన ఉద్యమాలు చేపట్టనున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. సీపీఐ ఖమ్మం జిల్లా 21వ మహాసభలు శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని నాయుడు పేటలో ప్రారంభమయ్యాయి. దండి సురేష్ అధ్యక్షతన రజబ్‌అలీ ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. మితవాద, ఫాసిస్టు విధానాలను అమలు చేసే వ్యక్తులు అధికారంలోకి వచ్చినప్పుడు దాని ప్రభావం ఆ దేశం పైనే గాక ఇతర దేశాల పైన కూడా ఉంటుందన్నారు. ఫాసిస్టు, మితవాద భావాలు కలిగిన డొనాల్డ్ ట్రంప్ అమెరికాలో అధికారంలోకి వచ్చిన తరువాత అక్కడి పరిస్థితులు మారిపోయాయన్నారు. ట్రంప్ కేంద్రీకృత ఆర్థిక విధానాల వల్ల వ్యక్తులు, కుటుంబాలు అప్పులపాలు కావడంగాకుండా కొన్ని దేశాలే అప్పులపాలవుతున్నాయని అన్నారు. అలాంటి భావజాలం కలిగిన నరేంద్ర మోడీ 2014లో మన దేశంలో అధికారంలోకి వచ్చిన తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ కూడా మారిపోయిందన్నారు. ధనికులు మరింత ధనికులుగాను, పేదలు మరింత పేదలుగాను మారిపోయారని చెప్పారు.

ఎన్నికల ముందు తమను గెలిపిస్తే విదేశాల్లో ఉన్న 71 లక్షల కోట్ల నల్ల ధనాన్ని తీసుకొచ్చి ఇంటికో 10 లక్షల రూపాయలు పంపిణీ చేస్తాని మోడీ చెప్పారనీ, అధికారంలోకి వచ్చి దాదాపు నాలు గేళ్లు కావస్తున్నా ఒక్క రూపాయికూడా తేలేక పోయారన్నారు. ఇప్పుడు ఆ విషయం గురించి మాట్లాడాలంటే ఆయన భయపడుతున్నారు. ప్రజల ముందుకొచ్చినప్పుడు అది తప్ప వేరే విషయాలు మాట్లాడుతున్నారన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే దశలో ఉన్న రైతుల రుణాలను మాఫీ చేసేందుకు ఇష్టపడని బీజేపీ నేతలు ఆ పార్టీకి చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు విజయ్‌మాల్య బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగనామం పెడితే దాన్ని మొండి బకాయికింద చూపించి మాఫీ చేస్తారన్నారు. తాజాగా వెలుగులోకి వచ్చిన పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణానికి పాల్పడిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీకి కూడా బీజేపీ నేతలతో సంబంధాలు ఉన్న వాడేనని చెప్పారు. అయితే, అతనితో తమకు సంబంధంలేదని బీజేపీ నాయకులు చెపుతున్నారని దావోస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోడీతో ఫోటోకు ఫోజెలా ఇచ్చాడని సురవరం ప్రశ్నించారు.

కేసీఆర్‌ది నియంత పాలన

తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, పేదలందరికీ మూడెకరాలు భూమి, పెద్ద పెద్ద ఇళ్లు కడతామంటే తాము గుడ్డిగా నమ్మలేదనీ, కేసీఆర్ పట్ల తమకు అటువంటి భ్రమలు లేవని చెప్పారు. కనీసం ప్రజాస్వామ్యబద్దంగా పాలన సాగిస్తారని భావించామని సమస్యల పై ప్రజలు గొంతు వినిపించే అవకాశం కూడా లేకుండా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు చూపించడంలో పాలకు విఫలమయ్యారన్నారు. ధరల సమతుల్యత, రైతులకు గిట్టుబాటు కల్పించేందుకు ఓ స్పష్టమైన విధానం ఈ ప్రభుత్వాలకు లేదన్నారు. వీటిన్నింటికీ సమాధానంగా సీపీఐ ప్రతిఘటన ఉద్యమాలకు సిద్ధమవుతున్నదని చెప్పారు. బహిరంగ సభలో సీపీఐ సీనియర్ నాయ కులు, మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నేత మహ్మద్ మౌలానా, పోటు ప్రసాద్, జిల్లా కార్యదర్శి భాగం హేమంతరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబిర్ పాష్ తదితరులు పాల్గొన్నారు.



అందరి కష్టాలు తీరుస్తా..!

90వ రోజు ప్రజా సంకల్పయాత్రలో జగన్

విశాలాంధ్ర - ఒంగోలు : వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అందరి కష్టాలు తీరుస్తానని ఆపార్టీ అధినేత వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర 90వ రోజు ప్రకాశంజిల్లాలో కొనసాగింది. కందుకూరు నియోజకవర్గంలోని బంగారక్కపాలెం క్రాస్‌రోడ్డు నుంచి ప్రారంభమైన పాదయాత్ర గాంధీనగర్, వలేటివారిపాలెం, రాళ్ళపాడు క్రాస్‌రోడ్, ఉప్పలపాడు క్రాస్‌రోడ్, కునిపాలెం క్రాస్‌రోడ్డు, పోకూరు మీదుగా సాగింది. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై జగన్‌కు అర్జీలు ఇచ్చారు. పొగాకు కౌలు రైతులు కలిసి కౌలు కాకుండా కిలో పొగాకుకు రూ. 176 ఖర్చవుతుందని, పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జగన్ గిట్టుబాటు ధర కిలోకు రూ. 210 ఇప్పించేందుకు పోరాడదామన్నారు. అనంతరం పొలినేనివారిపాలెంలో మత్స్యకారులు కలిసి తమను ఎస్సీల జాబితాలో చేరిస్తే రానున్న రోజుల్లో మత్స్యకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జగన్ పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా ఎస్సీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారు. ఏలూరుకు చెందిన లాయర్‌లు జగన్‌కు వినపత్రం ఇస్తూ ప్రత్యేక హోదా సాధించేంత వరకు పోరాడాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. మహిళలు, యువత పెద్ద ఎత్తున జగన్‌కు స్వాగతం పలికి మంగళహారతులు ఇచ్చారు. 91వ రోజున వలేటివారిపాలెం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని ఆపార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఓ ప్రహసనం

(మొదటిపేజీ తరువాయి)

26,502 ఉన్నాయి. గ్రూప్ డీ విభాగంలో గ్యాంగ్‌మెన్, స్విచ్‌మెన్, ట్రాక్‌మెన్, కేబిన్‌మెన్, వెల్డర్, హెల్పర్, పోర్టర్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. అలాగే గ్రూప్ సీ విభాగంలో అసిస్టెంట్ లోకోపైలెట్లు, టెక్నీషియన్ ఖాళీలున్నాయి. వివిధ జోన్లలో ఆయా ఖాళీలను బట్టి ఈ మేరకు నోటిఫికేషన్‌ను ఆర్‌ఆర్‌బీ జారీ చేసింది. వీరికి 7వ సెంట్రల్ పే కమిషన్ (లెవిల్1) ప్రకారం నెలకు వేతనం, ఇతర అలవెన్సులుగా రూ.18వేలు చెల్లిస్తారు. దక్షిణ మధ్య రైల్వే పరంగా సికింద్రాబాద్‌లో సుమారు 22 వేల ఖాళీలుండగా తాజా ప్రకటనతో దాదాపు 16వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు అవకాశం ఉంది. వీటిలో గ్రూప్ సీలో 10వేలు, గ్రూప్ డీలో 6 వేల వరకూ ఖాళీలు భర్తీ కానున్నాయి. ఇంకా దేశవ్యాప్తంగా అహ్మదాబాద్, అజ్మీర్, అలహాబాద్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువహటి, జమ్ము, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, రాంచి, సిలిగురి, త్రివేంద్రంలలో ఉద్యోగాల ఖాళీలున్నాయి. ఉద్యోగాల దరఖాస్తులను మార్చి 12వ తేదీలోపు సమర్పించాల్సి ఉంది. పదవ తరగతి ఉత్తీర్ణతతోపాటు ఐటీఐలో డిప్లమో చేసిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులు. అంతాబాగానే ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా కోట్లాదిగా ఉన్న నిరుద్యోగులు దరఖాస్తు చేస్తారని, వివిధ దశల్లో వీరికి పరీక్షలు నిర్వహించి నియామకాలు జరగడానికి ఎంతలేదన్నా ఏడాది సమయం పడుతుందని రైల్వే కార్మిక సంఘానికి చెందిన సీనియర్ నేత సీహెచ్ శంకరరావు 'విశాలాంధ్ర' ప్రతినిధికి తెలిపారు. తీరా ఉద్యోగాలను భర్తీ చేసే సమయానికి ఇదే స్థాయిలో ఉద్యోగులు పదవీ విరమణ చేస్తుండడంతో పనిభారం ఏమాత్రం తగ్గడం లేదన్నారు. ఏటా దేశవ్యాప్తంగా 40వేల నుంచి 45వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తుంటారని, 2017-18 సంవత్సరంలో 56వేల మంది పదవీ విరమణ చేసే అవకాశం ఉందన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా సేఫ్టీ కేటగిరిలో 2016 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 7,46,676 పోస్టులు మంజూరైతే 6,23,913 పోస్టుల్లో మాత్రమే ఉద్యోగులు న్నారని తెలిపారు. ఈ విధంగా 2016 ఏప్రిల్ నాటికి సేఫ్టీ కేటగిరిలో 1.22 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా 2018 ఏప్రిల్ నాటికి పదవీ విరమణ చేసిన వారితో ఈ సంఖ్య 2 లక్షలకు చేరుకుందన్నారు. అలాగే లోకోపైలెట్ల ఉద్యోగాలు 95,913 మంజూరవ్వగా 77,298 భర్తీ అయ్యాయని, ఇంకా 18,633 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. రైల్వే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రతిసారీ ప్రయాణీకుల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్ప డమే తప్ప ఆచరణలోకి తేవడంలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందుతోందనే విమర్శలు కార్మిక సంఘాల నుంచి వస్తున్నాయి. ఇప్పటికే అనేక విభాగాల్లో పనిభారం పెరిగిపోయి సిబ్బంది మానసికంగా, శారీరకంగా అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోకోపైలెట్ల మొదలుకొని ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్లు (టీటీఈ), గార్డులు, ఎలక్ట్రికల్, ట్రాక్షన్, సిగ్నలింగ్ వంటి సాంకేతిక విభాగాల్లోని సిబ్బందిపై పనిభారం విపరీతంగా పెరిగినట్లు చెబుతున్నారు. కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకు ఖాళీల భర్తీని చేపడుతున్నారే తప్ప కీలక విభాగాల్లోని అనేక ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్‌కు అప్పగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. క్రమంగా ఉద్యోగాలను తగ్గించడం ద్వారా కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందన్న అనుమానాన్ని పలువురు నేతలు వ్యక్తం చేస్తున్నారు.

ఏటా రూ. 4వేల కోట్ల భారం

దేశవ్యాప్తంగా రైల్వేశాఖలో ఉద్యోగాల నియామకాల వల్ల ఏటా రూ. 3వేల నుంచి రూ. 4వేల వరకూ అదనపు భారం పడుతోందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వేతనాల కోసం పెద్దమొత్తంలో ఖర్చవుతోందన్నారు. ఉద్యోగుల జీతాల పరంగా 2016-17 సంవత్సరంలో రూ. 69,713 కోట్లు, 2017-18 సంవత్సరంలో రూ. 72,705 కోట్లును చెల్లించాల్సి ఉందన్నారు. ఇక 2018-19 సంవత్సరంలో ఈ మొత్తం రూ. 76,451 కోట్లకు చేరుకోవచ్చని తెలిపారు.

డివిజన్	పోస్టులు	ఖాళీలు	వ్యత్యాసం
సికింద్రాబాద్	24,000	20,000	4,000
విజయవాడ	21,000	18,000	3,000
గుంతకల్	20,000	16,000	4,000
హైదరాబాద్	8,000	6,000	2,000
గుంటూరు	6,000	3,000	3,000
నాందేడ్	8,000	5,000	3,000
వర్క్‌షాప్స్	8,000	5,000	3,000





విజయోత్సాహంతో..

- సఫారీలతో నేడు తొలి టీ20 మ్యాచ్
- తుది జట్టులో రైనా, రాహుల్‌కు అవకాశం!

జోహనెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో తడబాటుకు గురైన కోహ్లీ సేన 1-2తో సిరీస్ కోల్పోయినా 6మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో సత్తా చాటింది. భారత్ బ్యాట్స్‌మన్ విదేశాల్లో ఆడలేరు అన్న అపవాదును తుడిచిపారేస్తూ సఫారీల గడ్డపై తొలిసారి 5-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుని దక్షిణాఫ్రికాను కంగు తినిపించింది. ప్రధానంగా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ చెలరేగిపోయి మూడు శతకాలు సాధించగా, చాహల్, కుల్దీప్ స్పిన్ ద్వయం 33 వికెట్లతో మణికట్టు మాయాజాలాన్ని ప్రదర్శించారు. ఇప్పుడు అదే ఊపును ట్వంటీ 20ల్లో కూడా కొనసాగించాలని టీమిండియా ఉవ్విళ్లూరుతోంది. దక్షిణాఫ్రికా-భారత్ టీ20 క్రికెట్ జట్ల మధ్య 3 మ్యాచ్‌ల సిరీస్ ఆదివారం ప్రారంభం కానుంది. జోహనెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో తొలి మ్యాచ్ సాయంత్రం 6 గం.ల నుంచి జరగనుంది. టీ 20 సిరీస్‌లో విజయం సాధించేందుకు రెండు జట్లు వ్యూహ ప్రతి వ్యూహాలతో సిద్ధమయ్యాయి. ట్వంటీ 20 ఫార్మాట్ల పరంగా చూస్తే ఇరు జట్లు బలంగానే ఉండటంతో మ్యాచ్‌లు నువ్వా నేనా అన్న రీతిలో జరుగుతాయని భావిస్తున్నారు. ఇప్పటివరకూ భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య నాలుగు సార్లు ట్వంటీ 20 సిరీస్‌ల జరిగాయి. 2006-07 సీజన్‌లో దక్షిణాఫ్రికాలో పర్యటనలో భాగంగా ఏకైక ట్వంటీ 20 మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. 2010-11 సీజన్‌లో సఫారీ పర్యటనకు వెళ్లిన భారత జట్టు మళ్లీ ఏకైక ట్వంటీ 20 మ్యాచ్‌లో గెలుపొందింది. 2011-12 సీజన్‌లో మాత్రం భారత్ ఓటమి పాలైంది. ఏకైక ట్వంటీ 20 మ్యాచ్‌లో సఫారీలు విజయం సాధించారు. 2015-16 సీజన్‌లో భారత పర్యటనకు వచ్చిన సఫారీలు మూడు టీ 20ల సిరీస్‌ను 2-0తో గెలుపొందారు. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. కాగా 2007-08 సీజన్‌లో భాగంగా దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన ఐసీసీ టీ 20 వరల్డ్ కప్‌లో భారత్ విజేతగా నిలిచింది. జోహనెస్‌బర్గ్ వరకయితే భారత మూడు టీ20 మ్యాచ్‌లు ఆడి రెండింట విజయం సాధించింది. ఇందులో దక్షిణా ఫ్రికాతో ఒక మ్యాచ్‌లో గెలిచి, మరొక మ్యాచ్‌లో ఓటమి చవి చూసింది. వరల్డ్ టీ 20లో ఇదే వేదికపై పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. ఇక చాలాకాలం తర్వాత భారత జట్టులో చోటు దక్కించుకున్న సురేష్ రైనా.. ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశాలు కనబడుతున్నాయి. ట్వంటీ 20ల్లో మంచి రికార్డు ఉన్న రైనాను తుది జట్టులోకి దాదాపు ఖాయంగా కనిపిస్తుండగా కేఎల్ రాహుల్‌కు జట్టులోకి తీసుకోవడంపై భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది. ఈ ఇద్దరిలో ఒకరిని పక్కకు పెడితే మాత్రవ దినేశ్ కార్తీక్‌ను తీసుకునే అవకాశం ఉంది. మరొకవైపు దక్షిణాఫ్రికా పలు కొత్త ఆటగాళ్లతో మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. బ్యాట్స్‌మన్ క్రిస్టియన్ జోంకర్, ఫాస్ట్ బౌలర్ జూనియర్ దాలాలకు తొలిసారి జట్టులో చోటు దక్కించుకోగా, ఇటీవల భారత్‌తో జరిగిన నాల్గో వన్డేలో కీలక ఇన్నింగ్స్ ఆడిన హెన్రిచ్ క్లాసెన్‌కు కూడా టీ 20 జట్టులోకి ఎంపిక చేశారు. సఫారీ రెగ్యులర్ కెప్టెన్ డు ప్లెసిస్ ట్వంటీ 20 సిరీస్‌కు సైతం దూరం కావడంతో అతని స్థానంలో జేపీ డుమినీ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

ఎవరితో పోటీ పడాలనుకోవట్లేదు : కోహ్లీ

సెంచూరియన్: ఎవరితోనో పోటీ పడాలని తాను అనుకోవడం లేదని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. ఆతిథ్య దక్షిణాఫ్రికాతో చివరి వన్డే అనంతరం కోహ్లీ మీడియాతో మాట్లాడాడు. 'ఇప్పుడు నేను ఎవరితో పోటీ పడాలని అనుకోవట్లేదు. ఆటపైనే నా దృష్టి. తదుపరి మ్యాచ్‌కు ఎలా సమాయత్తం అవ్వాలి, మ్యాచ్ ఎలా జరిగింది తదితర అంశాల గురించే ఆలోచిస్తా. ఇతరులతో పోటీ గురించి ఆలోచిస్తే ఆ ఆటలో ఎక్కువ కాలం కొనసాగలేం. అంతేకాదు పలు అంశాల్లో రాజీ పడాల్సి ఉంటుంది. అందుకే నేను ఎవరితో పోటీ పడను' అని స్పష్టం చేశాడు. కాగా ప్రపంచంలోనే గొప్ప బ్యాట్స్‌మన్ అని మిమ్మల్ని పిలవ వచ్చునా అని ప్రశ్నించగా ఒకింత అసహనం వ్యక్తం చేశాడు. "నాకు ఎలాంటి ట్యాగ్స్ అక్కర్లేదు.. నేనే హెడ్‌లైన్ వార్త అవ్వాలని ఎప్పుడూ అనుకోను. నా పని ఏదో అదే చేసుకుపోతుంటాను. మీరు మీ ఇష్టమొచ్చినట్లు రాసుకోండి.. నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మీరు రోజుకో విధంగా రాస్తారు.. రేపు ఏదో చెత్త షాట్‌కు ఔటైతే చాలు మీరు కోహ్లీ ఫామ్ కోల్పోయాడంటూ ఏదేదో రాస్తారు.. ఎవరికోసమో నేను ఈ జాబ్ చేయట్లేదు. నా వరకు బాగా ఆడుతూ తద్వారా జట్టుకు విజయాలు అందించడమే నా లక్ష్యం. జట్టు మేనేజ్‌మెంట్ నా గురించి ఏమి ఆలోచిస్తుందో నేను పట్టించుకోను. కెప్టెన్‌గా జట్టులోని ఆటగాళ్ల గురించి మాత్రమే ఆలోచిస్తాను" అని కోహ్లీ వివరించాడు. విదేశీ గడ్డపై ఇదే గొప్ప సిరీస్ విజయమా అనుకుంటున్నారా? అన్న మరో ప్రశ్నకు కోహ్లీ స్పందిస్తూ " అవునో కాదో మీరే చెప్పండి. ఎందుకంటే నెల క్రితం టీమిండియా సఫారీగడ్డపై ఏ మేరకు రాణిస్తుందోనంటూ అనుమానాలు లేవనెత్తారు. ఇప్పుడేమో ఇలా అడుగుతున్నారు. అప్పటికీ ఇప్పటికీ మా జట్టు, మా మైండ్ సెట్ ఏమీ మార్చుకోలేదు. మా ఆటతీరుపై విశ్లేషణ చేసి మీకు ఎలా అనిపిస్తే అలా రాయండి' అంటూ బదులిచ్చాడు.

కోహ్లీని చూసి చాలా నేర్చుకున్నా : మార్‌క్రమ్



సెంచూరియన్: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీని చూసే చాలా నేర్చుకున్నా నని దక్షిణాఫ్రికా జట్టు తాత్కాలిక కెప్టెన్ మార్ క్రమ్ తెలిపాడు. చివరి మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ.."ఇరు జట్ల మధ్య మ్యాచ్ జరిగే సమయంలో విరాట్ కోహ్లీని చూసి చాలా నేర్చుకున్నా. అతని ఆటతీరు అద్భుతం.. ఆట పట్ల అతనికి ఉన్న అంకిత భావం నన్ను ఆశ్చర్యపరిచింది. అతని పరుగుల దాహం, జట్టు విజయం కోసం అతడి తాపత్రయం బాగుంది. అందుకేనేమో కోహ్లీని ప్రపంచ అత్యుత్తమ బ్యాట్స్‌మెన్ అని అంటారు. కోహ్లీతో పాటు అతని జట్టును చూసి కూడా ఎంతో నేర్చుకోవచ్చు. మణికట్టు స్పిన్ ద్వయం చాహల్-కుల్‌దీప్ కూడా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించారు. ఈ సిరీస్ ఓటమి నాకు చాలా నేర్పింది. ఒత్తిడిని ఎలా అధిగమించి ఆడాలో తెలిసింది. ఆశించిన స్థాయిలో సిరీస్‌లో రాణించలేకపోయా. కెప్టెన్సీతో తీవ్ర ఒత్తిడికి గురయ్యా. కానీ, దీన్ని ఎంజాయ్ చేశాను. ఇది భవిష్యత్తులో తప్పకుండా నాకు ఉపయోగపడుతుంది" అని మార్‌క్రమ్ వివరించాడు

36 ఏళ్ల వయస్సులో ప్రపంచ నంబర్‌వన్

ఫెదరర్ రికార్డు



ఢిల్లీ: స్విస్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ మరోమారు చరిత్ర సృష్టించాడు.. ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడిగా నిలిచాడు. ఫెదరర్ ఈ ఘనతను ఏనాడో సాధించినప్పటికీ ఇందులో విశేషమేమిటంటే 36 ఏళ్ల వయస్సులో ఓ ఆటగాడు ప్రపంచ నంబర్‌వన్‌గా నిలవడం ఇదే తొలిసారి. అది కూడా సింగిల్స్ ఫార్మాట్‌లో. ఇప్పుడు ఫెదరర్ వయస్సు 36. తాజా ర్యాంకింగ్స్‌లో పురుషుల సింగిల్స్‌లో స్విస్ క్రీడాకారుడు రోజర్ ఫెదరర్ తిరిగి నంబర్‌వన్ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ టెన్నిస్‌లో ఇప్పటి వరకు 36 ఏళ్ల వయస్సులో ఏ ఆటగాడు నంబర్‌వన్ ర్యాంకులో నిలవలేదు. గతంలో అమెరికా క్రీడాకారుడు అంద్రూ అగస్సీ 33సంవత్సరాల వయస్సులో నంబర్‌వన్ ర్యాంకును దక్కించుకున్నాడు. అగస్సీ రికార్డును ఫెదరర్ అధిగమించాడు. 2012 నవంబరు తర్వాత ఫెదరర్ నంబర్‌వన్ ర్యాంకును దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఇప్పటి వరకు ఫెదరర్ పేరిట 20గ్రాండ్ స్లామ్ టైటిళ్లు(సింగిల్స్‌లో) ఉన్నాయి. ఇటీవల ఫెదరర్ ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ సాధించిన సంగతి విదితమే. ప్రస్తుతం రోటర్‌డ్యాం ఓపెన్‌లో ఆడుతున్న ఫెదరర్ ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్నాడు. నంబర్‌వన్ ర్యాంకు కైవసం చేసుకోవడంపై మాట్లాడుతూ..'ఇది నాకెంతో ప్రత్యేకమైనది.. చాలా సంతోషంగా ఉంది. తిరిగి నంబర్‌వన్ ర్యాంకు దక్కించుకుంటానని అనుకోలేదు... నా కెరీర్‌లో ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ప్రతి ఆటగాడు నంబర్‌వన్‌గా నిలవాలని ఎంతో కష్టపడతాడు.. యువ ఆటగాళ్లపై విజయం సాధించి అగ్రస్థానంలో నిలవాలంటే చాలా కష్టపడాలి. నా కల నెరవేరింది' అంటూ ఆనందం వ్యక్తం చేశాడు.

కోహ్లీని పొగిడేందుకు డిక్షనరీ కొనుక్కోండి : శాస్త్రి



సెంచూరియన్: 'కోహ్లీని పొగిడేందుకు పదాలు సరిపోవేమో అతడి ప్రతిభను వర్ణించడానికి డిక్షనరీ కొనుక్కోండి' అంటూ భారత జట్టు ప్రధాన కోచ్ రవిశాస్త్రి పాత్రికేయులకు సలహా ఇచ్చాడు. వన్డే సిరీస్ ముందుగానే గెలవడమే కాదు.. నామమాత్రపు చివరిమ్యాచ్ లో కూడా విరాట్ కోహ్లీ అద్భుతంగా ఆడటమే కాదు.. కెప్టెన్‌గా జట్టు సభ్యులతోనూ అదే రీతిలో ఆడించాడంటూ ఆకాశాని కెత్తేశాడు. దక్షిణాఫ్రికా-భారతజట్ల మధ్య 6వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన ఆఖరి మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో శాస్త్రి మాట్లాడాడు. "కోహ్లీని పొగుడుతూ రాయడానికి బహుశా మీకు పదాలు కరువై ఉంటాయి. మీకు ఒక సలహా ఇస్తా. ఒకవేళ మీ స్థానంలో నేను ఉంటే నేరుగా బుక్‌స్టోర్‌కు వెళ్లి కొత్త ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు కొనుక్కుంటాను. నా పద సంపదను పెంచుకుంటాను" అన్నాడు. 'సగటును బట్టి కాదు ఎప్పుడైనా బ్యాట్స్‌మెన్ ఎలాంటి సమయంలో పరుగులు రాబడుతున్నాడో మనం చూడాలి. అవి జట్టు విజయానికి ఎంత కీలకంగా మారాయో గుర్తించాలి. ప్రపంచంలోని మేటి బ్యాట్స్‌మెన్లలో కోహ్లీనే బెస్ట్' అని శాస్త్రి అన్నాడు. "గతంలో నేను భారత జట్టు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థి జట్ల భాగస్వామ్యాన్ని ఎలా విడదీయలన్న దాని గురించి కోహ్లీతో చర్చించా.. ఇప్పుడు మాకు కుల్దీప్‌యాదవ్-చాహల్ దొరికారు.. ఈ ఇద్దరూ మంచి ప్రదర్శన ఇస్తున్నారు.. బ్యాటింగ్, ఫీల్డింగ్, స్పిన్ బౌలింగ్‌లో గొప్పగా రాణిస్తున్నారు. భవిష్యత్తులో మేం మరిన్ని విదేశీ పర్యటనలు చేయాల్సి ఉంది. అలాంటి సమయంలో దక్షిణాఫ్రికా పర్యటన ప్రస్తుత భారత జట్టుకు ఎంతో నేర్పింది. యువ ఆటగాళ్లకు ఇదో మంచి అవకాశం" అని రవిశాస్త్రి వివరించాడు.

పీసీబీ సలహాదారుగా అక్తర్



ఇస్లామాబాద్: పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)లో కీలక మార్పులు చోటుచేసు కున్నాయి. మాజీ పేసర్ షోయబ్ అక్తర్‌ను రెండు ముఖ్యమైన పదవు లలో నియమించనున్నట్లు పీసీబీ శనివారం ప్రకటిం చింది. పీసీబీ బ్రాండ్ అంబాసిడర్‌తో పాటు సలహాదారుగా అక్తర్‌ను నియమిం చారు. "క్రికెట్ సంబంధాల విషయంలో పీసీబీ అధ్యక్షుడికి సలహాదారు గానూ, అదే సమయంలో పీసీబీకి బ్రాండ్ అంబా సిడర్‌గా అక్తర్ నియమితులయ్యారు"అని చైర్మన్ నిజం సేథీ తెలిపారు. పీసీబీ నిర్ణయాన్ని అక్తర్ స్వాగతించాడు. తన 14 ఏళ్ల కెరీర్‌లో దేశానికి ఏవిధంగా సేవలందించానో అదే స్ఫూర్తిని కొనసాగిస్తానని వెల్లడించాడు.

నాటి విరోధే..నేటి ఆత్మీయుడు

కెరీర్ ఆసాంతం పీసీబీతో గొడవలు పెట్టుకున్న షోయబ్ అక్తర్.. రిటైర్మెంట్ తర్వాత కూడా పీసీబీపై పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. సేథీ చైర్మన్‌గా ఉంటే పాక్ క్రికెట్‌కు కష్టాలు తప్పవని చెప్పాడు. ఒక దశలో బద్ధ విరోధులుగా వ్యవహరించిన సేథీ, అక్తర్‌లు ఇప్పుడు ఆత్మీయులుగా మారిపోవడం పాక్ క్రీడా, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

స్టేట్ హ్యాండ్‌బాల్ టోర్నీ చాంపియన్ విశాఖపట్నం

రన్నరప్‌గా వెస్ట్‌గోదావరి, కృష్ణాకు మూడవ స్థానం



విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జిల్లా జట్టు కైవశం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు వెస్ట్‌గోదావరి జట్టుపై 30-26 స్కోర్ తేడాతో విజయం సాధించింది. వెస్ట్‌గోదావరి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. మూడవస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో అతిధ్య కృష్ణాజిల్లా జట్టు, కర్నూల్ జట్లు పోటీపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో 20-18 స్కోర్ తేడాతో కృష్ణాజిల్లా జట్టు కర్నూల్‌పై గెలిచి మూడవస్థానంలో నిలవగా, కర్నూల్ జట్టు నాల్గవస్థానంలో నిలిచింది. అనంతరం విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో పి.మనోహరం ఏపీ హ్యాండ్ బాల్ అసోసాయేషన్, ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, కోశాధికారి పీఆర్ఎమ్. లెనిన్, కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.సీజర్‌రెడ్డి, కోశాధికారి ఎస్. యల్లయ్య, కార్యనిర్వహక కార్యదర్శి ఎన్.వంశీకృష్ణ, టోర్నమెంట్ అబ్‌జర్వర్, శాప్ డిప్యూటీ డైరక్టర్ దేవానంద్, సాయి రిటైర్డ్ కోచ్ చెన్నారెడ్డి, సీహెచ్.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ముళ్లపూడిని పరామర్శించిన సీపీఐ నేతలు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరంసిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు ముళ్లపూడి సూర్యనారాయణను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు, విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్‌లు శనివారం మర్యాదపూర్వకంగా ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. వారి మధ్య కమ్యూనిస్టు ఉద్యమాలకు సంబంధించిన సంభాషణ చోటుచేసుకుంది. అనేక సంఘటనలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర బ్యూరో చీఫ్ చావా రవి తదితరులు ఉన్నారు.

బాలికపై అత్యాచారం, హత్య కేసులో

మానవ మృగానికి నాలుగుసార్లు మరణదండన



లాహోర్: ఏడేళ్ల బాలికని పైశాచికంగా హింసించి, హత్య చేసి, చెత్త బుట్టలో పడేసిన కేసులో నిందితుడు ఇమ్రాన్ అలీకి శనివారం ఉరిశిక్ష పడింది. అన్నెంపున్నెం ఎరుగని పసిపాపపై అమానుషానికి ఒడిగట్టినందుకు నాలుగుసార్లు మరణదండనతో పాటు జీవిత ఖైదు, రూ. 32 లక్షల జరిమానా విధిస్తూ యాంటీ టెర్రరిజం కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. ఈ కేసును లాహోర్ కేంద్ర కారాగారంలోనే విచారణ చేశారు. హత్యానంతరం బాలికదేహాన్ని చెత్తకుప్పలో పడేసినందుకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 10 లక్షల జరిమానా విధించారు. ఇమ్రాన్‌పై కిడ్నాప్, అత్యాచారం, హత్య, టెర్రరిజం సంబంధిత కార్యకలాపాల్లో సంబంధం తదితర ఆరోపణలు ఉన్నట్లు పాకిస్తాన్ జాతీయ పత్రిక డాన్ ప్రచురించింది. నిందితుడు నేరాలను కోర్టులో ఒప్పుకున్నట్లు న్యాయవాది తెలిపారు. కోర్టు తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు దోషికి 15 రోజులు సమయం ఉంటుందని వివరించారు. ఏడేళ్ల జైనాబ్ అమీన్‌ను ఇమ్రాన్ అలీ జనవరి 4న కిడ్నాప్ చేశాడు. అనంతరం బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి క్రూరాతి క్రూరంగా హత్య చేశాడు. ఈ ఘటనతో పాకిస్తాన్‌లో ప్రజాగ్రహం పెల్లుబికింది. చిన్నారులను కాపాడలేని ఈ పోలీసు వ్యవస్థ ఎందుకంటూ ప్రజలు రోడ్లపైకెక్కారు. దీంతో ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం విచారణను వేగవంతంగా ముగించింది.

పెళ్లి వేడుకలో తీవ్ర విషాదం

సిలిండర్ పేలి 9 మంది మృతి, 20 మందికి గాయాలు



అజ్మీర్: పెళ్లివేడుకలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సిలిండర్ పేలడంతో 9 మంది మృతి చెందగా, మరో 20 మందికి గాయాలయ్యాయి. రాజస్థాన్ బీవర్‌లోని నంద్‌నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ పెళ్లి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి తొమ్మిది మంది సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. వంట చేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ దగ్గర నిర్లక్ష్యంగా పనిచేయడంతో పేలుడు సంభవించినట్టు చెబుతున్నారు. ఆ సిలిండర్ పక్కనే నిండుగా ఉన్న మరో సిలిండర్ ఉండటం వల్ల ప్రమాద తీవ్రత పెరిగింది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. క్షతగాత్రుల్ని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పేలుడు ధాటికి ప్రమాదం జరిగిన చోట రెండు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో దగ్గరలో ఉన్న రెండు కార్లు కూడా దగ్ధమయ్యాయి. మృతుల్లో ముగ్గురు చిన్నారులు, ఇద్దదరు మహిళలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సహాయక సిబ్బంది శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.